# కథామంజరి

## పది కథల సమాహారం



జన్మదిన ప్రత్యేక సంచిక

జూలై 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**జూలై 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 7

# ముచ్చటగా మూడేళ్ళు

'కథామంజరి' మొదలై ఈనాటికి మూడేళ్లు.

లెక్కలేనన్ని ఆటంకాలూ, సవాళ్ళూ ... ఈ మూడేళ్ళలోనూ!

వీటన్నిటినీ విజయవంతంగా అధిగమించి
మూడవ మైలురాయిని చేరుకుంది మా ప్రస్థానం.

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, క్రమం తప్పకుండా ప్రతినెలా 'కథామంజరి'ని
మీకు అందించడంలో సఫలీకృతులం కావడం గొప్ప విజయంగా భావిస్తున్నాం.
ఎందరో అందించిన స్పందనా, సహకారం, ప్రోత్సాహాలు దీనికి ఉత్ప్రేరకాలు.

అందుకే
కథలనిచ్చిన - రచయితలకూ, రచయిత్రులకు
బొమ్మలిచ్చిన – కళాకారులకు
గాత్రదానం చేసిన – గళాకారులకు
నిరంతరం మమ్మల్ని దారిలో పెట్టే – సద్విమర్శకులకు
చదివి, విని ఆదరించే – పాఠక శ్రోతలకు

**శత సహస్ర వందనాలు, కృతజ్ఞతలు.**

'కథామంజరి' యెడల మీ ఆదరాభిమానాలు
చెక్కుచెదరకుండా నిలుపుకోవడానికి
సర్వదా కృషిచేస్తామని సవినయంగా మనవిచేస్తున్నాం.

ఈ నెల కథామంజరి సంచికకి

చేయూతనిచ్చినవారు

ప్రముఖ రచయిత

**‘ఎలక్ట్రాన్’**

**(పింగళి వెంకట రమణరావుగారు)**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# కథామంజరి
## పది కథల సమాహారం

తెలుగు కథాభిమానులకు నమస్కారం!

**కథామంజరి** ద్వారా జరుగుతున్న తెలుగు కథాయజ్ఞం మూడు సంవత్సరాలు నిర్విఘ్నంగా సాగి, నేడు నాలుగో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. మార్పులు చేర్పులు చేసుకుంటూ తెలుగు కథను పాఠకులకు అందించాలనే అలనాటి మా సంకల్పం మంచి ఫలాలనే ఇచ్చింది. పయనం ఉత్సాహంగానే సాగుతోంది!

ఎందరో మహానుభావులు వెనుకనుండి, వెన్నుతట్టి ఆర్థికబలం అందిస్తున్నారు. వారితో పాటు చేరాలనీ, అదీ వారి తాహతుకు అందాలనీ ఎందరో ఔత్సాహికులు ముందుకు వచ్చిన తర్వాత, కథామంజరిని ఉచితంగానే అందిస్తూ, వీలయిన వారి దగ్గర చందా స్వీకరించాలని భావించాం. ఆ కోవలోనే విన్నపాలు పంపాం! మెయిల్ ద్వారా కథామంజరి నేరుగా చేరుతున్న వారిలో పది శాతం పాఠకుల నుంచి స్పందన వచ్చింది. కనీసం ఏభై శాతం మంది స్పందించి, చేయూతనందిస్తే, మరింత మెరుగైన పత్రికగా అందించగలమని మనవి చేసుకుంటున్నాం! అంతే కాదు.. ఈ ఆర్థికబలం ఎందుకంటే... అక్షర సేద్యం చేస్తున్న సాహితీ కర్షకుల కష్టానికి నూలుపోగులా అందించడానికే!

అందుకే... ఇంకా చందాదారులుగా నమోదు చేసుకోని కథాభిమానులను మరోసారి అభ్యర్థిస్తున్నాం!

చందాదారులుగా చేరండి!
ఈ కథాయజ్ఞానికి మీ చేయూత అందించండి!!

వార్షిక చందా **రెండు వందల రూపాయలు** చెల్లించడానికి

**ఇచట నొక్కండి**

# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# కథామంజరి

## సినిమా రంగమార్తాండ కథల పోటీ ఫలితాలు

| | |
|---|---|
| ప్రథమ బహుమతి : రు. 5000/- | "మీరు నాకు వద్దు మాష్టారు" - శ్రీమతి పున్నమరాజు సరోజ హరనాథ్ |
| ద్వితీయ బహుమతి : రు. 3000/- | "జమదగ్ని" – శ్రీ రత్నాకర్ పెనుమాక |
| తృతీయ బహుమతి : రు. 2000/- | "రవి గాంచనిచోట.." – శ్రీ ఇరిగినేని హనుమంతరావు |

| | |
|---|---|
| ప్రోత్సాహక బహుమతులు<br>రూ. 1000 చొప్పున | 1. "నానాటి బ్రతుకు" – డా. ఎమ్. సుగుణరావు<br>2. "దోచుకునే కళ" – శ్రీ దత్తశర్మ పాణ్యం<br>3. "తెరవెనుక బొమ్మ" – శ్రీమతి వేలూరి ప్రమీలాశర్మ<br>4. "సినిమా(య): - శ్రీమతి ఉగాది వసంత పూడిపెద్ది<br>5. "సాలె పురుగు గూడు వదిలింది"- శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి |

| సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలు | |
|---|---|
| 1. రంగుల కల – శ్రీ కె. వి. లక్ష్మణరావు | 11. సినిమా వాళ్ళంతే – శ్రీ బి. నర్సన్ |
| 2. అనామతరువు – శ్రీ అనిల్ ప్రసాద్ లింగం | 12. తెర వెనుక – అనసూయ ఉయ్యూరు |
| 3. రంగుల కల – శ్రీమతి వాడపల్లి పూర్ణ కామేశ్వరి | 13. స్క్రీన్ ప్లే – శ్రీ చాగంటి ప్రసాద్ |
| 4. వైకుంఠపాళి – శ్రీ యస్వి కృష్ణ | 14. లవ్ క్వీన్ – శ్రీ చరణ్ మిత్ర |
| 5. రంగస్థలం – శ్రీమతి సి. యమున | 15. అశ్వత్థామ హతః – వసుంధర |
| 6. జవరాలి జడదెబ్బ – శ్రీ దినవహి హనుమంతరావు | 16. సహజ నటుడు – శ్రీ ఆదోని బాషా |
| 7. నిన్నటిదాక శిలనైనా - శ్రీమతి నండూరి సుందరీ నాగమణి | 17. రాలిపడ్డ పువ్వు – శ్రీ బలభద్రపాత్రుని ఉదయకుమార్ |
| 8. ఓ చిన్న సినిమా – శ్రీ హావిష | 18. నట నక్షత్రాలు – శ్రీ వి. రాజారామ్మోహన రావు |
| 9. అడవి – శ్రీ సి. కుమార యశస్వి | 19. వల – శ్రీ కొయిలాడ రామమోహనరావు |
| 10. మౌలిక స్వరం – శ్రీమతి బులుసు సరోజ | 20. ప్రేమా నీ చిరునామా ఏమిటి? – శ్రీ సింహప్రసాద్ |

కథామంజరి మూడు సంవత్సరాలు పూర్తిచేసుకుని, నాలుగో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా నిర్వహించిన కథల పోటీలో ఉత్సాహంగా పాల్గొని, పోటీని జయప్రదం చేసిన రచయితలు, రచయిత్రులకు ధన్యవాదాలు. అలాగే న్యాయనిర్ణేతలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం.

**కథామంజరి బృందం**



# పెద్దల మాట



ఆలోచనలో నిజాయితీ, నూతనత్వం పనిలో నిబద్ధత, అంకితభావం తెలుగు కథాసాహిత్యం ఎడల అమితమైన ఆపేక్ష; ఇవన్నీ కలిగి ఉన్న రచయితల బృందం ఒక అంతర్జాల పత్రికను తీసుకువస్తే ఎలా ఉంటుందో 'కథామంజరి'ని చూస్తే మనకు అర్థమవుతుంది .

'కథా మంజరి' అంతర్జాల సంచిక మూడేళ్లు పూర్తి చేసుకుని నాలుగో సంవత్సరంలో అడుగుపెడుతున్న తరుణంలో మనందరం సంపాదక బృందానికి అభినందనలు తెలియజేస్తూ స్వాగతం చెబుదాం.

తమ పెట్టుబడులతో, ఇంకా మిత్రుల సహకారంతో, ఈ గత మూడు సంవత్సరాలుగా లాభాపేక్ష లేకుండా ఉచితంగా సంచికను తీసుకువచ్చి అందరికీ పంచుతున్నా... రాను రాను అది కష్టతరంగా మారుతుంది అనే సంగతి మనందరికీ తెలిసిందే!!

తెలుగు సాహిత్యంలో అద్భుతమైన గొప్ప కథలను అందించిన అలనాటి కథకులను పరిచయం చేయడంతో పాటు ఈనాటి కథకులకు చేయూతనిస్తూ, 'రాశి కన్నా వాసికి మేము కట్టుబడి ఉంటాం' అనే నినాదంతో ఆణిముత్యాల్లాంటి పది కథల సమాహారంతో నెల నెలా అమూల్యమైన సంచికను వెలువరిస్తున్న కథామంజరి బృందానికి, కథా ప్రియులమైన మనందరం చేయూతనివ్వడం చాలా అవసరం .

పత్రిక మరి పదిమందికి చేరేలా చూడడంతో పాటు పత్రిక తయారవడానికి కావలసిన ఆర్థిక సహకారం కూడా... చంద్రునికో నూలు పోగులా కథాప్రియులు అందజేయవలసిన అవసరం ఉంది .

ముద్రణలో పత్రికలు కనుమరుగైపోతున్న తరుణంలో ఇలా మలయ మారుతంలా వచ్చి మనలను చల్లగా స్పృజించి, చక్కని కథలను అందజేస్తున్న కథామంజరి సంచిక మరిన్ని కాలాలపాటు మనకి అందడానికి మనందరం మన వంతు సహకారం అందిద్దాం.

ప్రియ మిత్రుడు జె పి శర్మ గారికి, కథామంజరి ఇతర సంపాదక బృందానికి నా అభినందనలు.

**ద్విభాష్యం రాజేశ్వరరావు, విశాఖపట్నం**





కథామంజరి మూడు వసంతాలు నిండి నాలుగో సంవత్సరానికి రావడం ఆనందించ దగ్గ విజయం. మహా మహా పత్రికలే నడపలేని స్థితిలో పడి మానుకున్న స్థితి, సాహిత్యానికి ఆదరణ లేని స్థితిలో మీ కథామంజరి మూడేళ్లు నింపుకోడం గర్వించదగ్గ విజయం. ఓ పత్రికకి లాభాలు, అమ్మకాలపై దృష్టి పెట్టకుండా, కేవలం సాహిత్యాభిలాషతో కొద్ది రచయితలని కూడగట్టుకుని, వారిని ప్రోత్సహిస్తూ, రాయించి పత్రిక అందరి మన్ననలు పొందేట్టు, అహర్నిశము కష్టపడుతూ, నడుపుతూ, మూడేళ్లు నడపగలిగారంటే, ప్రతి అక్షరం వెనక వారి అకుంఠిత కృషి, అభిలాష కనపడుతున్నాయి. వారికీ నా మనపూర్వక అభినందనలు. మీ పత్రిక ఇలాగే దిగ్విజయంగా నడవాలని కోరుతూ శుభాభినందనాలు అందిస్తున్నాను!

**డి. కామేశ్వరి, హైదరాబాద్**



కథామంజరి రథసారథులందరికి నమస్తే!

ముందుగా హృదయపూర్వక అభినందనలు. అప్పుడే 36 సంచికల ప్రాయం గడిచిందా? నిన్న మొన్నటి పసికూన! తప్పటడుగులు లేకుండా నడక, మాట నేర్చి ముద్దు ముచ్చట్లతో అలరించి నాలుగో ఏట అడుగిడుతోంది... శుభం.

అంతర్జాల పత్రికల్లో... ఏ పత్రిక వైశిష్ట్యం ఆ పత్రికదే! కథామంజరి కథామంజరే! ముందు ఒక కథా మార్గదర్శి ప్రత్యక్షం. సంచికకు గళ ప్రదాతలు. మీ జట్టు. ఇదీ వరుస సరే. ఆ వెంటనే వచ్చే కథాకీయం ఎంతో విలువైన సంపాదకీయం. సమకాలీన సాహిత్యం, ధోరణులు, గమనం చూపుతూ, కథామంజరి కథల్ని కూడా స్పర్శిస్తున్నారు. బావుంది. ఆ పై విశిష్ట అతిథి ఏదో మొక్కుబడి పరిచయం కాక, ఆ రచయిత వ్యక్తిత్వ విశేషాలూ, ఆయన కథాత్మ , అవగాహన అయ్యేట్టు మంచి వ్యాసాన్ని అందిస్తున్నారు.


కథామంజరి ఈ 36 సంచికల్లోనూ వచ్చిన కథలు.. చాలావరకూ వర్తమాన సామాజికతకూ, మానవ సంబంధాల్లో వచ్చిన(వస్తున్న) పరిణామాలకూ కథాత్మకతను కూర్చాయి. శైలి శిల్ప విషయాల్లో కొన్ని విశేష గుణాలు కలిగినవి వచ్చాయి. పత్రికను తీర్చి దిద్దుటల్లో మీ జట్టు నిబద్ధత, శ్రద్ధ, శ్రమ, ఉత్సాహం, ఫ్యాషన్ ఆఫ్ ఎక్సలెన్స్ ... అక్షరం అక్షరంలో కనిపిస్తున్నది. ఇందుకు ఎన్ని అభినందనలైనా చాలవు!

అలాగే సమయపాలన... నమో నమః

చిత్తశుద్ధి, లక్ష్య సిద్ధి, ప్రేరణలకు వెన్నెముక.. మీ సహకారం సహచర్యం! అందరూ మంచి రచయితలుగా అందరికందరే కదా! అదీ అసలైన దీపస్తంభం!

సాగించండి మీ సాహితీ చైతన్యయాత్ర. కథామంజరికి ఆయురారోగ్య భోగభాగ్య భరిత ప్రస్థాన ప్రాప్తిరస్తు!

**విహారి, హైదరాబాద్**



కథామంజరి ఒక గొప్ప ప్రయత్నం.. అత్యంత విలువైన, గొప్ప రచయితల్ని, రచయిత్రులనీ ఒకే చోట చేర్చి ప్రజలకు సత్ సాహిత్యాన్ని అందించే అద్భుత ప్రయత్నం. ఇక్కడ పేరుకి విలువ ఇవ్వరు. ఇక్కడ అస్మదీయులకి విలువనివ్వరు! ఇక్కడ విలువని ఇచ్చేది సాహిత్యానికి మాత్రమే! పత్రికలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో ఒక పత్రికను నడిపించడం ఎంత కష్టమో అందరికీ తెలుసు! ప్రతి ఔత్సాహిక రచయిత కథలో, కవితలో రాస్తాడు. కానీ ఎక్కడ ప్రచురించాలో తెలియని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో కథామంజరి నేనున్నానంటూ మన ముందుకు వచ్చింది.

మూడు సంవత్సరాల వయసుని చక్కగా, అందంగా, ముద్దు ముద్దుగా, దాటి నాలుగవ సంవత్సరంలో అడుగు పెట్టింది. ఈ బిడ్డ నిండు నూరేళ్లు చల్లగా, హాయిగా, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, దినదిన ప్రవర్ధమానంగా ఎదగాలని కోరుకుంటూ...

**భువనచంద్ర, చెన్నయ్**



తెలుగువారి మధురమైన భావనలు, జీవిత గమనాలు, భావోద్వేగ పరిమళాలను సందర్శింప చేయగల సాహితి సంపద మనకుంది. వాటిని సజీవంగా తరతరాలు నిలుపుకుంటూ వచ్చాం. అయితే క్రమక్రమంగా వాటికి దూరమవుతున్నామనే ఆవేదన అప్పుడప్పుడు కలుగుతూ ఉంటుంది. అయితే చిమ్మ చీకటిలో చిరుదీపం వెలుతురు కూడా ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంటుంది... ప్రభావితం చేస్తుంది కూడా! ఈ సత్యం ఈనాడు మన ముందు ఆహ్లాదభరితంగా ఆవిష్కృతం కావడం ఎంతో ఆనందదాయకమైన విషయం అని చెప్పాలి. క్రమక్రమంగా తెలుగు పత్రికలు మూతపడిన తరుణంలో అంతర్జాల మాసపత్రికగా కథామంజరి పేరిట అంకురార్పణ చేయడం, తద్వారా ముందు తరాల వారికి మార్గదర్శకంగా ఉండాలనీ, అనేక విధాలుగా స్ఫూర్తిదాయకం కావాలని కథామంజరి బృందం సంకల్పించడం కేవలం దైవ సంకల్పమే!

ఈ పవిత్ర సంకల్పం నిజంగా సాహితీయజ్ఞం వంటిదే. ఈ యజ్ఞ పత్రిక జూలై 2020 ప్రారంభింపబడి, అవిరళ కృషితో, ఆత్మవిశ్వాసంతో, అజేయ స్ఫూర్తితో, నాలుగో సంవత్సరంలోకి అడుగు పెట్టబోతోంది.

ఎందరో సాహితీ ద్రష్టలనూ, సాహితీమూర్తులనూ, కథామంజరిలో గతస్మృతులతో నింపి, అనిర్వచనమైన హృదయ స్పందనలతో, నూతనోత్సాహంతో, కలాలను పరుగు పెట్టిస్తోంది. ఉత్తేజభరితం చేస్తుంది. అలా... కథామంజరి ఆశయాలను, ఆలోచనలు సాకారం చేస్తూ, సిద్ధింపచేస్తోంది. ఇంతకుమించిన యజ్ఞఫలం ఇంకేముంటుంది!

ఈ యజ్ఞంలో నేను కూడా భాగస్వామిని కావడం నా అదృష్టం. ఆత్మీయ సాహితీ సోదరులు వంటి సంపాదకులు, వారి బృందానికి అభినందన చందనాలు ఈ సందర్భంగా అందచేసుకుంటున్నాను.

**డాక్టర్ కె.వి కృష్ణకుమారి ( కృష్ణక్క), హైదరాబాద్**

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | | i |
| విశిష్ట అతిథి | | iii |
| కథా మార్గదర్శి | | v |
| కథా పరిచయం | | vii |
| కథాపుస్తక పరిచయం | | ix |
| వినదగునెవ్వరు చెప్పిన | | xi |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| మీరు నాకు వద్దు మాస్టారూ! | పున్నమరాజు సరోజ హరనాథ్ | 1 |
| జమదగ్ని | రత్నాకర్ పెనుమాక | 7 |
| రవిగాంచని చోట | ఇరిగినేని హనుమంతరావు | 11 |
| నానాటి బతుకు! | డా. ఎమ్. సుగుణరావు | 17 |
| దోచుకునే కళ | దత్తశర్మ పాణ్యం | 24 |
| తెర వెనుక బొమ్మ | వేలూరి ప్రమీలా శర్మ | 29 |
| సినీమా(య) | ఉగాది వసంత పూడిపెద్ది | 36 |
| సాలెపురుగు గూడు వదిలింది | అత్తలూరి విజయలక్ష్మి | 41 |
| జపాను | శ్రీరాజ్ | 46 |
| కానుక | ముళ్ళపూడి వెంకటరమణ | 52 |


Cover Page : Kocherla VR

# కథాకీయం

మూడు సంవత్సరాల క్రిందట, ఓ ఆలోచన రావడం, దానికి కార్యరూపం ఇచ్చి రంగంలోకి అడుగు పెడుతున్నప్పుడు కొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నాం. ఎలాగైనా తెలుగు కథని ముందుతరానికి అందించాలనీ, యువరచయితలను ప్రోత్సహించాలనీ, ఒకవేళ సాధించలేకపోతే, ఎక్కువగా చేతులు కాల్చుకోకుండా బయటపడాలనీ... ఈ కథాయజ్ఞ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం! ఆలోచనలు చేసిన తర్వాత, నెల తిరక్కుండానే 1 జూలై 2020 న మొదటి పత్రిక నెట్టింట్లోకి రప్పించగలిగాం! అయితే.. పెద్దగా బాలారిష్టాలు ఎదురు కాలేదు. మంచి ప్రోత్సాహమే వచ్చింది. అనూహ్యమైన ఆదరణ కూడా లభించింది. యువరచయితల విషయంలో ఇప్పటికీ కొంత నిరుత్సాహం కలిగిస్తున్నా, మా ప్రయత్నాలు కొనసాగించాలనే పట్టుదల కూడా వచ్చింది! అలా.. "కథామంజరి" మూడు సంవత్సరాలు నింపుకుని నాలుగో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ ఎదుగుదల వెనుక భుజంతట్టి ప్రోత్సహిస్తున్న ఎందరో మహానుభావులు.. అందరికి శతాధిక వందనాలు తెలియచేసుకుంటున్నాం.

ఈ మూడు సంవత్సరాలలో సంవత్సరానికి రెండుసార్లు కథల పోటీలు, వాటితో ప్రత్యేకసంచికలు విడుదల చేసాం. ప్రముఖుల ఆణిముత్యాల్లాంటి కథలను, కథా పరిచయాలను కొత్త శీర్షికలతో పాటు, నేటి పాఠకులకు అనువుగా ఉంటుందని శ్రావ్యసంచికను కూడా కథామంజరిలో భాగం చేశాం. మాకు ఉన్న కొద్దిపాటి సాంకేతిక పరిజ్ఞానం, వనరులతో "కథామంజరి" కొంచెం ముస్తాబు కూడా చేసుకుని మీ ముందుకు వస్తోంది. మరోవైపు, మా జట్టులో ఇంకో ఆరుగురు కలిసారు. వీరు కాకుండా మరో పదిమంది గొంతు కలిపారు. ఇప్పుడు మా బృందం.. బృందావనమై కథా పరిమళాన్ని వెదజల్లుతోంది.


ఈ జన్మదిన శుభసందర్భంగా పెట్టిన "సినిమారంగ మార్తాండ" కథల పోటీకి... ఆరంభం నిరుత్సాహాన్ని ఇచ్చిన మాట వాస్తవమే! ఆ అంశంలోకి రచయితలు తొంగి చూడలేరనే అభిప్రాయాలు కూడా వచ్చాయి. ఇది చాలా కొత్తగా వుందంటూ హుషారిచ్చిన మాటలు కూడా వినబడ్డాయి. ఆఖరి తేది సమీపిస్తున్న కొద్దీ కథల తాకిడి ఎక్కువైంది. కొత్త, పాత రచయితల దగ్గర్నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. రవిగాంచని చోట కవి గాంచున్... అనే మాటకు తిరుగులేని అర్థాన్ని మన కథకులు కూడా ఇచ్చారు. ఎన్నో కోణాలు, మరెన్నో కొత్త విషయాలని పట్టి కథలుగా అందించారు. చివరికి... న్యాయనిర్ణేతలు సమావేశమై చర్చిస్తే గాని బహుమతులను నిర్ణయించలేకపోయారంటే... కథల్లో ఎంత 'వాసి' ఉందో తెలుస్తుంది. బహుమతులు గెలిచిన కథలు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలే కాకుండా, ఇంకా కొన్ని కథలు బావున్నా, ప్రచురణకు పట్టే సమయాన్ని దృష్టిలో ఉంచుకుని వాటిని స్వీకరించలేదు. వెరసి " సినీరంగ మార్తాండ కథల పోటి" మాకు తృప్తిని ఇచ్చిందనే చెప్పాలి. పాఠకులను కూడా ఈ కథలు ఆకట్టుకోగలవని భావిస్తున్నాం.

ఇక.. సినిమారంగంలో పనిచేస్తున్నవారు ఈ కథలను చదివి వారి స్పందనలు అందిస్తే, అటు రచయితలకు, ఇటు పాఠకులకు కూడా ఉపయుక్తంగా ఉండగలవని ఆశిస్తున్నాం. ఈ కథామంజరి సంచికను మీకు తెలిసిన సినీరంగ మిత్రులకు పంపి సహకరించవలసిందిగా అందరిని కోరుకుంటున్నాం.

ఈ కథల పోటీకి ఉత్సాహంగా కథలు వ్రాసి పంపిన రచయితలకు, రచయిత్రులకు ధన్యవాదాలు. అలాగే కథల పోటీ న్యాయనిర్ణేతలకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుకుంటూ, "కథామంజరి" వేసే ముందడుగులకు మీ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండగలవని ఆశిస్తున్నాను.

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ శ్రీరాజ్**

"కాలం మారుతుండటం చాలా సహజం! అలా మారినప్పుడు కొత్త సమస్యలు, ఆశలు, ఆశయాలు, కోరికలు, ఆలోచనలు కూడా కొత్తకొత్తవి పుడతాయి. అదిగో.. అందులో ఏది మంచో, ఏది చెడో చూసి... కాలానుగుణంగా రచనలు చేసి, ప్రజలను జాగృతం చేసేవారే రచయితలు. కాని పూర్వకాలంలో లాగా కాకుండా, ఇప్పుడు 'మంచి కథ' లు రావడం వాదన ఓ పక్కన ఉంది. కొంచెం నిజం ఉంది. అయితే... నిజానికి ఏ రచయితైనా నిజాయితీగా, మనసు పెట్టి కథ వ్రాస్తే అది మంచి కథ అవుతుంది. ఆ కథ... మొత్తం సమాజాన్ని కాకపోయినా, కనీసం సంఘంలోని కొందరినైనా ఆలోపింపచేస్తుంది!" అంటూ ఎక్కువ నిజాయితీగా, మరింత ఎక్కువ మొహమాటంగా అంటారు "కాలధర్మం" శ్రీరాజ్ గారు. ఈయన వ్రాసిన "కాల ధర్మం" నాటిక.. ఆ తర్వాత "కలికాలం" సినిమాగా వచ్చింది. ఆ నాటికకు అనూహ్యమైన స్పందన వచ్చింది, దాని తర్వాత 'కాలధర్మం శ్రీరాజ్' గా పేరు తెచ్చుకున్న ఆయన అసలు పేరు జి. ఎస్. రావు. ఎన్ని కథలు రాసాం కాదు, ఎన్ని కథలు పాఠకుల్ని కదిలించాయనే గట్టి నమ్మకంతో 'రాశి' కంటే 'వాసి' ఎక్కువున్న కథలు, నాటికలు వ్రాసిన సినీ రచయిత అని చెప్పదగ్గ కథా రచయిత శ్రీరాజ్ గారు.

సుమారుగా అరవై డెబ్బై కథలు, నాటికలు, నాటకాలు, సినిమా రచనలు, టీవి ధారావాహికలు.. శ్రీరాజ్ గారు ఖాతాలో ఉన్నాయి. శ్రీరాజ్ గారు రాసిన రచనలన్నీ ఊహలకు దూరంగా ఉంటాయి, తాను చూసి, ప్రేరణ పొంది రాసినవే అవన్నీ! రావిశాస్త్రిగారి రచనలన్నీ చదివి ఆయనకి ఏకలవ్య శిష్యుడిగా మారి, కథ ఎలా మొదలెట్టాలి, ఎలా ముగించాలో తెలుసుకుని, అప్పటి వరకు ఎలావున్నాసరే, తర్వాతే అసలైన రచనలు చేయగలిగానని ఆనందంగా చెప్తారు శ్రీరాజుగారు. విశాఖపట్నంలోని మల్కాపురంలో 1946లో జన్మించిన శ్రీరాజ్ గారు థర్డ్ ఫారమ్ చదువుతున్నప్పుడే, స్కూలు మేగజైన్ కోసం "టెలిగ్రామ్" అనే కథ వ్రాసారు. ఆ కథ శ్రీరాజ్ గారే వ్రాసారని నిర్ధారణ చేసుకోడానికి, వారి తెలుగు మాష్టారు చాలా పరీక్షలు పెట్టారుట. అందులో నెగ్గిన తర్వాతే ఆ కథని మేగజైన్‌లో వేసారుట. ఆ తర్వాత ప్రతిఏటా మేగజైన్‌లో శ్రీరాజ్ గారి కథ ఒకటి తప్పనిసరిగా ఉండేది. హైస్కూలు చదువులు ముగిసి వెళ్లిపోతున్నప్పుడు, "నువ్వు కథలు బాగా వ్రాస్తున్నావు, బయట పత్రికలు పంపు.. మంచి భవిష్యత్తు ఉందని" ఆ తెలుగు మాష్టారు శ్రీరాజ్‌ని దీవించి పంపారుట! అంతకంటే ప్రోత్సాహం ఏం కావాలి... తర్వాత శ్రీరాజ్ గారు వెనక్కి చూడలేదు. ఆణిముత్యాల్లాంటి రచనలు అందించారు. పియుసి చదివే రోజుల్లోనే టెలిగ్రాఫ్

డిపార్ట్మెంట్ (ఇప్పటి బి యస్ ఎన్ యల్) లో ఉద్యోగం వచ్చింది. రాత్రి ఆఫీసు డ్యూటీలు చేస్తూ, పగలు ఎ.వి.యన్. కాలేజీలో డిగ్రీ చదువుతున్నప్పుడు, ఆ లైబ్రరీ లో లబ్ధప్రతిష్టుల పుస్తకాలన్నీ చదివారు. సినీ రచయిత శ్రీ గణేష్ పాత్రో, నాటక రచయిత శ్రీ యస్సీ రావు గార్లు కూడా ఆ ఆఫీసులోనే పనిచేసేవారు. వారితో మంచి స్నేహంతో పాటు వారి మధ్య ఎప్పుడూ కథలు, నాటికలు, నాటకాల మీదే సంభాషణలు ఉండేవి. కథని ప్రేమించి, నాటకాన్ని ఇష్టపడే శ్రీరాజ్ గారు ఆంధ్రా యూనివర్సిటీలో ప్లే డైరక్షన్‌లో డిప్లొమా కోర్సు చేసారు. ఆరోజుల్లో వచ్చే అనేక పత్రికల ప్రత్యేక సంచికలలో శ్రీరాజ్ గారి కథలు తప్పనిసరిగా వచ్చేవి. వాటిల్లో "దివంగతుడు" అనే కథని మెచ్చుకుని, ప్రఖ్యాత నటుడు, రంగస్థల దర్శకుడు శ్రీ యస్.కె. మిశ్రోగారు ప్రోత్సహించగా, ఆ కథ "కాలధర్మం" నాటికగా వ్రాసారు. ఆ నాటికకి ఎన్నో బహుమతులు వచ్చాయి. ఆ నాటికను చూసిన ఎందరో సినీ ప్రముఖులు ప్రశంసలు అందించారు. ఆ క్రమంలోనే ఆ నాటిక "కలికాలం" సినిమాగా వచ్చి ఉత్తమ కథా రచయితగా అవార్డులు అందించింది. ఆ సినిమా తమిళ, కన్నడ, మరాఠీ, బెంగాలీ, ఒరియా భాషల్లో పునర్నిర్మాణం జరిగి చాలా ప్రజాదరణ పొందింది. తర్వాత కాలంలో "సూరిగాడు", "ప్రేమించు" వంటి సినిమాలకు కథలు వ్రాసారు. వాటికీ అవార్డులు అందుకున్నారు. అయితే కథలు, నాటికలు, నాటకాలు రాసినప్పుడు కలిగిన సంతృప్తి, సినిమాలకు, టీవిలకు రచనలు చేసినప్పుడు పొందలేకపోయానని శ్రీరాజ్ గారు అంటుంటారు.

ఒక్క క్షణం, చుక్కలసీమ, వెలుగు వాకిట్లోకి.. మొదలగు శ్రీరాజ్ గారి కథాసంపుటాలు వచ్చాయి. అటు రావిశాస్త్రి, బీనాదేవి, కారా మాష్టారు, ముళ్ళపూడి, బుచ్చిబాబు.. వంటి లబ్ధప్రతిష్టుల కథలు చదివి, కథలు రాయడానికి స్ఫూర్తి పొందితే, ఇటు నాటకరంగంలో అగ్రగణ్యులైన గణపతిరాజు అచ్యుతరామరాజు, అత్తిలి కృష్ణారావు, చాట్ల శ్రీరాములు, అబ్బూరి గోపాలకృష్ణ, గొల్లపూడి, రావూజీ... వంటి ప్రముఖుల పరిచయాలతో నాటికలు, నాటకాలు రాయడానికి ప్రేరణ కలిగిందని చెప్తారు శ్రీరాజ్ గారు.

మితభాషి, మిత్రవాసి, సౌమ్యరాసి... అని చెప్పుకోదగ్గ శ్రీరాజ్ గారి ముగ్గురు పిల్లలూ అమెరికాలో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఇక... శ్రీరాజ్ గారు, శ్రీమతి సత్యపార్వతీదేవి గారు.. విశాఖ అమెరికాల మధ్య తిరుగుతూ, కథలకు దూరమయ్యారనే చెప్పాలి.

అటు కథాసాహిత్యంలోనూ, ఇటు సినీమారంగంలోనూ మంచి కథకుడుగా పేరు తెచ్చుకున్న శ్రీరాజ్ గారు ఈ ప్రత్యేక సంచిక 'విశిష్ట అతిథి' గా విచ్చేయడం చాలా సముచితంగా భావిస్తూ, ఆయన గురించి నాలుగు మాటలు చెప్పడానికి అవకాశం లభించినందులకు ఆనందిస్తూ... తిరిగి కలం పట్టి కథలతో తెలుగు పాఠకులని అలరిస్తారని అభిలషిస్తూ.. శ్రీరాజ్ గారి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ

ఆయన సృష్టించిన పాత్రలు మన చుట్టూ తిరుగుతూ మన మధ్యే ఉన్నట్టు అనిపిస్తుంది. తెలుగువారి లోగిళ్ళలో నిత్యం తిరుగాడే ఆ పాత్రలతో మనం నిత్యం మాట్లాడుతూ, ఎన్నో కబుర్లు చెప్పుకుంటాం. ఆయన ఉపయోగించిన భాష, పట్టుపదాలు, సంభాషణలు.. ఇవన్నీ మనం ఇంట్లో వాడుకునేవే! కథ మనం చదువుతున్నట్టు ఉండదు... మనం పరకాయ ప్రవేశం చేసి, ఆ పాత్రలలోనో, పక్కనో, ఎదురుగానో నిలబడినట్టు ఉంటుంది! ఇంతకీ ఆ సజీవపాత్రలు ఏవంటే.. అప్పుల అప్పారావు, బుడుగు, సీగాన పెసూనాంబ, పక్కింటి లావుపాటి పిన్నిగారు, రాధా గోపాలం, రెండుజెళ్ళ సీత... ఇలా చాలా పాత్రలు మన నిత్యజీవితంలో కనబడతారు. అటువంటి విశిష్టమైన సజీవపాత్రల సృష్టికర్త – తెలుగువారు గర్వించదగ్గ రచయిత, శ్రీ ముళ్ళపూడి వెంకటరమణగారు. యథార్థ దృశ్యాలని హాస్యంతో రంగరించి, తెలుగింటి జీవితాలని తన అసాధారణమైన శైలిలో కథలుగా అందించారు. కథలు, కథనాలు, మాటలు, వ్యాసాలు, సమీక్షలు... ఒకటేమిటి అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో తెలుగువారికి షడ్రసోపేతమైన రచనలను అందించారు. అచ్చమైన తెలుగింటి అమ్మాయిలకి "బాపు బొమ్మ" అనే ముద్ర ఎలా పడుతుందో, అలాగే రమణగారు తనకంటూ ఓ ప్రత్యేకమైన శైలి ఏర్పరచుకున్నారు. సహజసిద్ధంగా వచ్చిన ఆ విశిష్టమైన శైలికి 'ముళ్ళపూడి శైలి' అని నామకరణం తెలుగువారందరు కల్సి చేసారంటే, ఆయన రచనలు అంతలా మనస్సుల్లో నాటుకుపోయాయనే చెప్పాలి. కన్నీళ్లు, వ్యథలు, పోరాటాలు, రాజకీయాలు, కుటుంబ జీవితాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళు, సంసారాలు, ఆస్తులు, అప్పులు.. ఒకటేమిటి మనకు కనబడే జీవితదృశ్యాలన్నీ ఆయనకి కథా వస్తువులే! ఆ కథలు ఎంతలా నవ్వులు పూయిస్తాయో, అవి జీవితాల్లో అంతలా పెనవేసుకొని ఉండిపోతాయి. 'నవ్వొచ్చినప్పుడు ఎవ్వడైనా నవ్వగలడు.. ఏడుపొచ్చినప్పుడు కూడా నవ్వినవాడే మగాడు, అసలదే నవ్వు' అని నవ్వుకి క్రొత్త నిర్వచనం చెప్పిన ముళ్ళపూడి కథల్లో లలితమైన వాడుకభాషా పదప్రయోగాలు కనబడతాయి. నిజానికి మునిమాణిక్యం గారి రచనలు తప్పితే, ఆ రోజుల్లో తెలుగు సాహిత్యంలో హాస్యానికి స్థానం లభించలేదు. హాస్యరసంతో పెద్దగా ఎవరూ రచనలు చేయలేదు. అంతవరకు సమాజంలోని దురాచారాలని ఎత్తిపొడుస్తూ వక్రోక్తి రూపంలో రచనలను అందించారు గాని, లలిత హాస్యాన్ని, అందులో మన తెలుగువారి జీవితాల్లో నుండి పరిమళించిన హాస్యాన్ని అందించలేదు. ఓ విధంగా చెప్పాలంటే అచ్చమైన తెలుగు నుడికారాలు, పట్టుపదాలు, మధ్యతరగతి ఇళ్ళల్లో వాడే మాటలు.. వీటితోనే తెలుగు కథకి నిండైనా హాస్యం అందించే శకం

ముళ్లపూడివారి నుంచే మొదలైంది. వాడుకభాషలో మరింత లోతుకు పోయి కొత్త పదప్రయోగాలు చేసారు. 'అమ్మ్యామ్యా', 'కతలు చెప్పకు', వంటి పదాలు సృష్టించి జనబాహుళ్యం లోకి తీసుకువచ్చిన ఘనత ముళ్ళపూడి వారిదేనని చెప్పాలి.

తూర్పుగోదావరిజిల్లా ధవిళేశ్వరం గోదావరి ఒడ్డున, 28 జూన్ 1931న పుట్టిన రమణగారి అసలు పేరు ముళ్ళపూడి వెంకట్రావు. చిన్నప్పుడే తండ్రి మరణించడంతో, ఇబ్బందులు పడి, తల్లితో పాటు మద్రాసు వెళ్ళారు. ప్రాథమికస్థాయి విద్య అక్కడే చదివి, తిరిగి రాజమండ్రి చేరి ఎస్సెల్సీ ఆనర్స్ వరకు చదివారు. పద్నాలుగో ఏట రమణగారి మొదటి కథ "అమ్మమాట వినకపోతే" "బాల" పత్రికలో పడింది! తర్వాత కాలంలో ఉత్సాహంతో "ఉదయభాను" అనే పత్రిక పెట్టి, తనే సంపాదకుడి అవతారం ఎత్తారు! ఆ పత్రికకు చిత్రకారుడు బాపుగారే! తర్వాత కాలంలో చిన్నాచితకా ఉద్యోగాలు చేసి, 1954లో ఆంధ్రపత్రిక దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరారు. అప్పుడే 'బుడుగు' కి అంకురార్పణ జరిగింది. ఇక రమణగారు వెనుకకు చూడలేదు. అప్పుల ప్రహసనాల మీద 'ఋణానంద లహరి, సీతా కళ్యాణం, ఇద్దరమ్మాయిలూ ముగ్గరబ్బాయిలూ, జనతా ఎక్స్‌ప్రెస్, రాజకీయ భేతాళ పంచవింశతి, రాధాగోపాలం, ఆకలీ ఆనందరావు, విమానం కథ.. వంటి అనేక కథలు వచ్చాయి. తమాషా ఏమిటంటే.. చలనచిత్రసీమలో బిజీగా ఉన్నప్పుడే, ఆ రంగం మీదే "విక్రమార్కుని మార్కు సింహాసనం కథలు" రాసారు. ఇక.. సినిమా సమీక్షలు, సినిమా ప్రముఖులపై వ్యాసాలు, సినిమాలపై సెటైర్లు.. ఇలా ఎన్నో లక్షలు విలువచేసే తెలుగు సాహితీసంపదను అందచేసారు. వాటిని విడివిడిగా ఏడెనిమిది బుక్కులుగా కుట్టి కూడా అందించారు. తమ స్వీయజీవితాన్ని "కోతి కొమ్మచ్చి" గా అబాలగోపాలం ఆస్వాదించేలా అందించడం రమణగారికే ప్రత్యేకతగా చెప్పాలి.

పత్రికా రచయితగా పనిచేసే రోజుల్లో రమణగారు సినిమాల మీద రాసే సమీక్షలు, విశ్లేషణలూ మేధావులను సైతం చదివించేవి. రమణగారిని 'హాస్యరచయిత' గా చాలామంది ముద్రవేసినట్టు ఈయన కేవలం హాస్యరచయిత మాత్రమే కాదు. రమణగారు సృష్టించిన హాస్యానికి అంతర్లీనంగా కరుణరసం జాలువారుతూంటుంది. "జనతా ఎక్స్‌ప్రెస్", "సాక్షి" ఇందుకు చక్కటి ఉదాహరణలు. అలాగే సినిమాల విషయానికొస్తే, 'ప్రేమించి చూడు' 'బుద్ధిమంతుడు', అందాలరాముడు' ' ముత్యాల ముగ్గు' 'పెళ్ళిపుస్తకం', ' మిస్టర్ పెళ్ళాం' వంటి హాస్యరసపూరిత సినిమాలతో పాటు ' రక్తసంబంధం', 'గుడిగంటలు' వంటి విషాదభరితమైన చిత్రాలు కూడా ఈయన రాసినవే. ఇంకా "శ్రీ రామరాజ్యం", "సీతాకళ్యాణం" "భాగవతం"(TV కోసం) వంటి పౌరాణికాలకు కూడా స్క్రీన్ ప్లే, సంభాషణలు రాశారు.

ఇంతచెప్పి, రమణగారి పేరుకి ముందు ఉండే ఇంటిపేరులా ఇమిడిపోయిన బాపుగారిని తలవకపోతే బుడుగు నుంచి పక్కింటి పిన్నిగారు వరకు మనల్ని ఆడిపోసుకుంటారు. రమణగారు అక్షరానికి రూపం ఇచ్చేది బాపుగారే! హద్దుల్లేని స్నేహం వారిది. తెలుగువారికి ఓ అందమైన సాహితీ వనాన్ని అందించారు. ఆ వనంలో అన్నీ నిత్యం పూసే సాహితీపుష్పాలే! రమణగారి కథలో బాపుగారు కనబడతారు, బాపుగారి బొమ్మల్లో రమణగారు కనబడతారు. వారిద్దర్నీ కలిపి చూస్తే... తెలుగువారి గొప్పతనం కనబడుతుంది!

బుడుగ్గాడికి, సీగాన పెసూనాంబకి, అప్పుల అప్పారావుకి, రెండుజళ్ళ సీతకి, రాధాగోపాలానికి, పక్కింటి లావుపాటి పిన్నిగారికి అమృతం త్రాగించారు గాని, రమణగారు మాత్రం ఆ అమృతం తీసుకోకుండా ఫిబ్రవరి24, 2011 తేదిన అనంత లోకాలకు వెళ్ళిపోయారు.

కథామంజరి జన్మదిన ప్రత్యేక సంచిక ద్వారా వారిని తలుచుకోవడం, వారి విశిష్టతని మరోసారి మననం చేసుకోవడం సముచితంగా భావిస్తూ... వారికి జోహార్లు!

**కథామంజరి బృందం**

## పాణిని జన్నాభట్లగారి కథ మరో కురుక్షేత్రం

బహుశా పాణిని జన్నాభట్ల అనే రచయిత గురించి చాలామందికి తెలియకపోవచ్చు. వినుండకపోవచ్చు కూడా. ఎందుకంటే అతనొక వర్ధమాన రచయిత. వంగూరి ఫౌండేషన్ జరిపే కథల పోటీల ద్వారా పరిచయమై, ఈ మధ్యనే 'తనలో నన్ను' అనే కథల సంపుటాన్ని వెలువరించిన పాణిని ఒక కొత్తదనం అందించగలిగే సామర్థ్యమున్న కథా రచయితగా అందరినీ ఆకర్షించడం జరిగింది. అందుకే అతని కథనొకదాన్ని పరిచయం చెయ్యాలనిపించింది. ఆ కథా సంపుటంలో ఉన్న కథలన్నిటిలోనూ ఏదో ప్రత్యేకత కనిపిస్తుంది – ముఖ్యంగా, ఈ యువ రచయిత రాసిన కథలు ఇప్పటికీ ఇంకా రెండో, మూడో పుట్టినరోజులు కూడా జరుపుకోలేదని తెలిస్తే.

భారతాన్ని తెలీని వారు అరుదు. యుద్ధం పాండవులకి, కౌరవులకి మధ్య జరిగిందనేది నిర్వివాదాంశం. అయితే వారిద్దరితోనూ యుద్ధంచేసి ఓడించగలిగే వారు మధ్యకొచ్చి రాజ్యాన్ని కబళించుకోవాలని చూస్తే ఇద్దరూ ఏంచేయగలరు? ఇదీ ప్రస్తుత కథ 'మరో కురుక్షేత్రం'. రచయిత భారత కథను మార్చేశాడని బాధ పడద్దు. కథను ఊహించిన తీరు, తెలిసిన కథలో కొత్త పాత్రలను సృష్టించిన తీరు, కథ చెప్పిన విధానం, ఈ రచయిత ప్రయోగం పాఠకుల్ని ఆకట్టుకుంది. ముఖ్యంగా రాజులు, రారాజులు పాలించే ఆరోజుల్లో ప్రజాస్వామ్య విలువలకు అవకాశం ఉందా? సరే ఇక కథను పరిచయం చేస్తాను.

అది కురుక్షేత్ర యుద్ధానికి మొదటి రోజు. పాండవ కౌరవ సైన్యాలు మోహరించి ఉన్నాయి. ఒక వైపు అర్జునుడు, శ్రీకృష్ణుడు అయితే రెండోవైపు ద్రోణుడూ, భీష్ముడూ. బలహీనమైన పాండవ సైన్యాన్ని చూసి వెకిలిగా నవ్వాడట దుర్యోధనుడు! శంఖారావాలు పూర్తయి యుద్ధసిద్ధతను వ్యక్తం చేసారు ఇరుపక్షాలూ! ఇక అస్త్రప్రయోగంతో మొదలవాలి యుద్ధం. అంతలో ఉత్తరం నుండి పిడుగులు పడుతున్న భీకర శబ్దం. నల్లని మేఘంలా కమ్ముకొస్తున్న మరో సేనా సమూహం. అందరి మొహాల్లో ఆశ్చర్యం. అందరి మనసుల్లో అయోమయం, ఆందోళన. సేనలతో ముందుకొస్తున్న మూడు రథాల్లో ఉన్నవారు త్రిపాలకులు.

ఇంతకీ త్రిపాలకులెవరు? భీష్ముడి గురించి, ఆయన ప్రతిజ్ఞ గురించి చెప్పనక్కరలేదు. ఆయన తమ్ముడు భద్రబాహుడు – తమ్ముడూ అంటే, ఆయన పినతండ్రి – శంతనుడి సోదరుని కొడుకు. తండ్రి మరణంతో చిన్నప్పటినుంచీ శంతనుడి దగ్గరే పెరిగాడు. అన్న దేవవ్రతుడంటే గౌరవం ఉండడం వల్ల దేవవ్రతుని ప్రతిజ్ఞ విని బాధపడ్డాడు. దేవవ్రతుడు భద్రబాహుడికి కాశ్మీర రాజ్యాన్ని ధారదత్తం చేసి, తమ్ముడికి తను చేయగలిగింది చేశాడు. భద్రబాహుడికి త్రిమూర్తుల అంశలతో ముగ్గురు మనుమలు కలిగారు. ఆ ముగ్గురి పేర్లూ, వజ్రహస్తుడు, సూత్రకుడు, చతుర్భుజుడు. దేవతలకే యుద్ధాల్లో సహాయం చేయగలిగే పరాక్రమవంతులు. వారే త్రిపాలకులు. కౌరవ పాండవులు యుద్ధం గురించి తెలుసుకుని సరాసరి రణరంగానికే విచ్చేశారు సైన్యాలతో సహా. వారి ఆంతర్యమేమై వుంటుంది?

పాండవ కౌరవ సైన్యాలలో భయం, కలకలం మొదలయ్యాయి. సామంత రాజులు తమ సైన్యంతో సహా వెనుతిరుగుతున్నారు. త్రిపాలకుల పరాక్రమం అలాంటిది. ఇటు ధర్మరాజు, అటు దుర్యోధనుడికీ అదే పరిస్థితి. తాత భద్రబాహుడి వరాలూ, దైవాంశ వల్ల పొందిన ఆయుధాలూ, త్రిపాలకులను ఎంతో శక్తివంతులను చేశాయని ద్రోణునికీ, భీష్మునికీ తెలియని విషయం కాదు. ముందు వాళ్ళొచ్చిన కారణం తెలుసుకోవాలి. పరస్పర పరిచయాలయాక "యుద్ధం మధ్యలో ఆపేసి వచ్చారేం?" అని అడుగుతాడు వజ్రహస్తుడు. తమ సోదరుల యుద్ధం మధ్యలోకి త్రిపాలకులెందుకు వచ్చారో తెలుసుకుందామని అని

చెప్తాడు ధర్మరాజు. వజ్రహస్తుడు తామూ సోదరులమేనని గుర్తుచేస్తాడు. అంటే పాండవులు, కౌరవులు ఏ రాజ్యం కోసమైతే పోరాడుకుంటున్నారో, ఆ రాజ్యంలో తమకూ భాగముందని తెలియచేస్తూ. తమకు తలొగ్గి రాజ్యాన్ని అప్పజెప్పమని, అందుకు బదులుగా సామంత రాజ్యాలనిస్తామని చెప్తాడు. భీష్ముడి విజ్ఞప్తికి కూడా లొంగలేదు. అయితే తమ తండ్రి ఆదేశం ప్రకారం, విదురుడు చెప్పిన మార్గంలోనే తాము నడవడానికి సిద్ధమని చెప్తారు.

ధర్మాధర్మాలు తెలిసి, వ్యాసుని బుద్ధి కుశలత కలిగిన విదురునికి కూడా ఇది సమస్యే. ఆలోచించగా ఒకే ఒక్క మార్గం కనబడింది. అదే 'ప్రజామతం'. అంటే? ప్రజలే నిర్ణయిస్తారు వారికి ఎవరు ప్రభువులుగా ఉండాలో. దుర్యోధనుడికి అది ఎలా నచ్చుతుంది? అయినా ప్రజామతం ఎవరికి అర్థమవుతుంది కనక? అయినా, ఇదేమిటిది? యుద్ధంలో విజయం వల్లనే కదా రాజ్యం ప్రాప్తించేది! దానికి సమాధానంగా విదురుడు చెప్తాడు "రాజ్యం అంటే ప్రజలు. వారికి నమ్మకమైన పాలననందించే ప్రభువును ఎన్నుకోవడం వారి హక్కు" అని. వజ్రహస్తుడు తనకు సమ్మతమేనని చెప్తాడు. ఇంకేం! పాండవుల అజ్ఞాతవాసంలో ఇన్నేళ్ళూ తామే కదా పాలించింది, ప్రజలకు పాండవుల గురించి తెలిసింది ఏముంది కనక అన్న కర్ణుడి సలహాతో దుర్యోధనుడూ ఒప్పుకున్నాడు.

అయితే ఎన్నికల విధివిధానాలేముండాలి మరి? "రెండు ముఖ్య నియమాలు. బలవంతంగానో, ధనధాన్యాల ఆశ చూపో ప్రజల అభిమతదానాన్ని పొందరాదు. రెండవది రాజులు స్వయంగా ప్రచారంలో పాల్గొనాలి".

ఎన్నికలు అనంగానే జరిగే తతంగం మనకు తెలియనిదేముంది? ఎక్కడ చూసినా సభలు, ప్రసంగాలు, ఎవరి గొప్పలు వారు చెప్పుకోవడం... అయితే ఆ గొప్పలు పాండవులకు, కౌరవులకు ఎక్కువ చెల్లలేదు ప్రజలలో. తమలో లోపాలు ప్రజలు గుర్తించారని తెలుసుకోవడం అవమానానికి, నీరసానికి గురిచేసింది. త్రిపాలకుల ప్రచారంలో మాత్రం వారు మరో రామరాజ్యాన్ని నిర్మిస్తారన్న నమ్మకం ప్రజలలో ప్రబలుతోంది. పాండవులకు, కౌరవులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. నాలుగు వారాల్లో మూడు వారాలు గడచిపోయాయి.

ఎన్నికల సమయం రానే వచ్చింది. కురుక్షేత్ర మైదానానికి చుట్టూ ఉన్న వివిధ కొండలపై విదురుడు, పాండవులు, కౌరవులు, త్రిపాలకులు నిల్చుని ఉన్నారు. వాళ్ళ వాళ్ళ స్థానాల్లో వారి వారి పతాకాలు రెపరెపలాడుతున్నాయి. జనాలు మైదానాల్లోకి రావడం మొదలుపెట్టారు. మధ్యాహ్నానికి కొన్ని వేలమంది గుమిగూడారు. కూడిన జనాన్ని బట్టి త్రిపాలకులను తమ నాయకులుగా సమర్థించే వారే ఎక్కువగా ఉన్నారు.

పాండవులకు, కౌరవులకు ఏం చెయ్యాలో అవగతమవటల్లేదు. అందరి ముఖాల్లోనూ అవమానభారం. ఇంతలో కర్ణుడు దుర్యోధనుడి చెవులో ఏదో మాట్లాడాడు. అది పక్కనుంచి వింటున్న శకుని తన అంగీకారం తెలిపాడు. కౌరవాధినేతలు నలుగురూ పాండవులు నిల్చున్న కొండ సమీపానికి నడవడం మొదలు పెట్టారు. వారిని చూసి పాండవులకూ అర్థం కాలేదు ఏమవుతోందో. ప్రజలకూ అర్థమవటల్లేదు! అయితే కౌరవులతో పాటే ప్రజలు కూడా నడవడం మొదలు పెట్టారు. కొంత అలజడి, తరవాత చర్చలు, అంతా సద్దుమణిగింది. చూస్తూండగానే అయిదుగురు పాండవులు, నలుగురు కౌరవనాయకులు, అంతా కలిసి ఒకరి చేతులోకరు పట్టుకొని, చేతులు పైకి లేపారు. జనాలు అంతమందికీ హర్షధ్వానాలు చేస్తున్నారు. విదురుడికీ, త్రిపాలకులకు అర్థం కావడం లేదు. చివరికి విదురుడు తనదగ్గరున్న కౌరవుల, పాండవుల పతాకాలను కలిపి పైకెత్తి గాల్లో ఊపుతూ నిలబడ్డాడు. 'పాండవులకీ జై, కౌరవులకీ జై' అంటూ ప్రజలు నినాదాలు చేశారు.

పక్కనున్న ధర్మరాజుని అడిగాడు శకుని "ధర్మజా! నీకైనా అర్థమైందా ఈ ప్రజలకేం కావాలో?" అని. తల అడ్డంగా ఊపాడు ధర్మరాజు.

పై వాక్యంతో కథ ముగుస్తుంది.

కథ ప్రజాస్వామ్యంలో ప్రజల ఆలోచనా విధానాలని ప్రతిబింబిస్తూ చేసిన ఒక వ్యంగ్యాత్మక చిత్రీకరణ. అయితే అది చెప్పడానికి రచయిత ఎన్నుకున్న నేపథ్యం కురుపాండవుల సంగ్రామ సమయం. ఆరోజుల్లో ప్రజాస్వామ్యమా? బహుశా కథలో అంశాలను పేర్చుకుంటూ పోతున్నప్పుడు రచయితకు వచ్చిన ఆలోచన కావచ్చు. కౌరవ పాండవుల పోరు మధ్యలో త్రిపాలకుల కథ ఇమిడిపోవడం గమనిస్తాం. ఇది రచయిత చాకచక్యానికి ఒక ఉదాహరణ. అదికూడా చాలా ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో రాసినట్లు కనబడుతుంది. చివరికి కురు పాండవుల మధ్య వైరం త్రిపాలకుల వల్ల చెదరిపోలేదు. వాళ్ళు వచ్చారు, వెళ్ళారు. అంతే.

"సూర్యుడు తనలో తనే కుమిలిపోతూ ఉదయిస్తున్నాడ"ట – కురుక్షేత్ర సంగ్రామం మొదలయే ఉదయాన్ని వర్ణిస్తూ.

కథలో కథగా దేవవ్రతుడు తన తండ్రి శంతనుడికి మత్స్యకారుల పిల్ల సత్యవతినివ్వమని ఆమె తండ్రి దాశరాజుని అడగడానికి వెళ్ళినప్పుడు, వాళ్ళిద్దరి మధ్య సంభాషణ చదవాల్సిందే. విషయం కొత్తది కాదు. దాశరాజు తన యాసలో మెలికలేసి మాట్లాడుతూ తనకు కావలసింది రాబట్టడం చక్కని సంభాషణతో చెప్పారు రచయిత.

'పరస్పర సోదరుల మధ్య యుద్ధంలోకి మీరేందుకు వేంచేశారో' అంటే త్రిపాలకుల సమాధానం 'మేమూ సోదరులమే' అని అనిపించడం చెప్పకనే చెబుతున్న కారణం. ఇక ప్రజాస్వామ్యంలో జరిగే పద్ధతులు ఆ సందర్భానికి అన్వయించి రాసిన విధానం బాగుంది. చివరగా శకునికీ, ధర్మరాజుకీ మధ్యలో జరిగిన సంభాషణలో "ప్రజలకు ఏం కావాలో తెలుసా?" అన్న ప్రశ్న యక్ష ప్రశ్న లాంటిది.

మొత్తానికి రచయిత చేసిన ప్రయోగం అద్భుతంగా ఉంది. కథ అల్లిక, శైలి ఒక చెయ్యి తిరిగిన రచయిత చేయగలిగేవే. పుస్తకంలో అన్ని కథలూ చదివినప్పుడు, కొత్త రచయిత సంతకాలు వెతికి వెతికి పట్టుకుంటే కానీ దొరకవు. కథాంశాల వైవిధ్యాన్ని, రచనా శిల్పాన్ని గమనిస్తే, ఈ కథా రచయితకి మహోజ్వలమైన భవిష్యత్తు ఉందని నిస్సందేహంగా చెప్పొచ్చు!

*పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*

# వినదగునెవ్వరు చెప్పిన..

కేవలం ఒక వాక్యం ఉన్న కథ: For Sale, Baby Shoes, Never Worn . హెమింగ్వే రాసాడు. దీన్ని ఎన్ని కథలుగానైనా చెప్పవచ్చు (తల్లి/తండ్రి/దొంగ/జోళ్ళ వ్యాపారి దృష్టికోణాల నుంచి). కేవలం ఒకే ఒక అక్షరం 'శీర్షిక' గా గల మెడికో శ్యామ్ కథ ఈ హెమింగ్వే కథకు తీసిపోదు! ఈ కథని ఎందుకు రాయవలసి వచ్చిందో చివర్లో రచయిత చెప్పడం నాకు నచ్చింది. ఇంతకీ ఏమిటి ఈ 'ఛీ'? పలికేటప్పుడు రకరకాల అర్థాలు లాగొచ్చు కాని, రాతలో వీలు కాదు! కథ ఎత్తుగడలో వర్ణన, వాతావరణ చిత్రణ ఉన్నాయి. అందమైన పెళ్ళికూతురుని ముత్తైదువులు సహజంగానే తమ అనుభవాలను తలుచుకుంటూ శోభనం గదిలోకి పంపుతారు. గది లోపల పెళ్ళికొడుకు ఆ అనుభవం గురించి విన్నాడు, చదివాడు.. కాని 'స్వానుభవం స్వానుభావమే!' కథకుడు అన్నది జీవిత సత్యం! కథను ఇంతవరకు చదువుతూ వస్తున్న పాఠకులు 'కుర్రాళ్ళే'. అయితే వారి ఊహలు కూడా రెక్కలు విప్పుకుంటూ ఎక్కడెక్కడికో విహరిస్తూ ఉంటాయి. ('అభిసారిక', 'రేరాణి'' లాంటి పుస్తకాలు అప్పట్లో కుర్రాళ్ళను ఉవ్విళ్ళూరించేవి.) కొత్త పెళ్ళికొడుకుకి అంతా కొత్తే! ఆమెను ఎలా పిలవాలి? ఎలా లాలించాలి? అపస్మారకంగా తన పక్కన కూర్చోబెట్టుకుంటాడు. 'ఎంత గరళాన్ని అయినా మింగి సహించగల స్త్రీజాతి ప్రతినిధిలా' కనిపిస్తుంది అతనికి! మాటలు కలిపి చనువు తీసుకొని దగ్గరకు తీసుకోబోతుండగా 'ఛీ' అని ఆమె అతన్ని తోసేస్తుంది. కథని ఇక్కడ ఆపేసి open ended story (ఎన్నో అర్థాలు వచ్చే కథ) చేయొచ్చు. అప్పుడు పై కథకు ఒకలా అర్థం చెప్పుకోవచ్చు. పెళ్ళికూతురు గతంలో ఎంత భయంకరమైన అనుభవానికి గురైందో! కథకుడు మధ్యలో దూరుతాడు. మనల్ని ఒక ఆట పట్టిస్తాడు. 'ఆ రాత్రెలా గడిచిందని అడక్కండి.. పదేళ్లుగా ఆమె పుట్టింట్లోనే ఉండి పోయిందా? లేక ఆ మొదటి రాత్రి ఇద్దరూ స్వర్గం చూసారా? ప్రశ్నలు సంధిస్తాడు. పదేళ్ళు?.. అంటే కథ మొదటిరాత్రే ఆఖరి రాత్రి అవుతుంది కదా!

కథా ప్రారంభంలో కథకుడు 'భాస్కర్‌రావు వైనమెరిగినవాడు' అని క్లూ ఇచ్చాడు. (పాత్ర చిత్రణ జరిగింది) కథకుడే మనకు మార్గదర్శనం చేస్తాడు...వాళ్ళ సంసారంలో పూలు పూచాయి అంటూ. ..కథ అయిపోయింది అన్న దానికి గుర్తుపెట్టి కథకుడు మరో ట్రిక్ ప్లే చేస్తాడు. 'పాఠకుడు రివాల్వర్ తీసి కాల్చాడు. అదృష్టవశాత్తూ రచయిత అక్కడ లేడు' అంటూ కథలో తనూ ఒక పాత్ర అవుతాడు. సెక్సు కథను సైకలాజికల్ కథ చేస్తాడు. 'ఛీ' కొట్టిన ఆమె అతని మగసిరి బానిస ఎలా అయింది? వివరణ ఇస్తాడు: మనస్తత్వ విశ్లేషణ... మానసికవైద్య పరిభాష సాయంతో! భార్యకు ఉన్న frigidity (జడస్వభావం)ని అర్థం చేసుకొని సున్నితంగా ఆమెను శృంగారం వైపు తిప్పుకున్న భర్తని ప్రశంసిస్తాడు. కొసమెరుపుగా ఎడిటర్‌ని ఫూల్ చేస్తూ, NB (తా.క.)లో తను ఇచ్చిన ఈ మూలమైన అంశాన్ని సంపాదకుడు మరిచిపోయారని 'ఛీ' దారుణానికి అదే కారణం అని చమత్కరిస్తూ మనల్ని నవ్విస్తాడు.

రచయితలు ఇన్ని జిమ్మిక్స్ వాడొచ్చా? కొకు ఎప్పుడో ఇలా అన్నారు: 'కథకుడు అవసరమైనప్పుడల్లా పాత్రలను పక్కకు పెట్టి, తను నోరుచేసుకోవచ్చు, పాత్రల మనస్తత్వాన్ని, పాత్రల ప్రవర్తన ద్వారా సంభాషణల ద్వారా పాఠకుడికి తెలియచేసే శిల్పం లేనప్పుడు వాటిని గురించి తన అభిప్రాయాలు స్వయంగా చెప్పుకోవచ్చు. ఏ సంఘటనా అవసరం లేకుండా ఒక పాత్ర యొక్క మనస్తత్వంలో పరిణామాన్ని చిత్రించి కథ అల్లవచ్చు.

***రామవరపు గణేశ్వర రావు, హైదరాబాద్***

విలక్షణమైన రచయిత మెడికో శ్యామ్ కథ "ఛీ" జూన్ 2023 సంచికలో ప్రత్యేకమైన ఆకర్షణగా అనిపించింది. కథ చివర్లో "ఈ కథ 1976 ప్రాంతంలో వ్రాసింది" అని ఉంది. ఈ విషయం తెలుపకుండా ఉంటే ఈ కథ 2023, కాదు 2024లో వ్రాసినదిగా భావించేంత నిత్యనూతనంగా ఉంది! ఈ కథ వ్రాసిన వయసులో రచయిత కథాంశమైన తొలిరాత్రి గురించి స్వీయ అనుభవంతో కాకుండా, ఊహించి వ్రాసి ఉండాలనిపించింది. కథనాత్మక వైవిధ్యం అచ్చెరువొందిస్తోంది. మెడికో శ్యామ్ ట్రేడ్‌మార్క్ హిందీ సొబగులతో (కటీ పతంగ్ ... కయీ వుమంగ్ ..) కథ మెరిసింది. దాదాపు యాభైయేళ్ల క్రితం ఫ్రిజిడిటి అనే మానసిక సమస్య గురించి వైవిధ్యభరితమైన కథ వ్రాసే సాహసం రచయిత చెయ్యడం ఆశ్చర్యకరంగా ఉంది. ఫ్రిజిడ్ వుమన్‌ని హిమాంగి+హిమాని = హిమాంగినిగా సూచించడం వినూత్నంగా అనిపించింది. మెడికో శ్యామ్ బుద్ధిజీవి; రచయితగా 'వే అహేడ్ ఆఫ్ హిస్ టైంస్.' ఆర్కైవ్స్ దుమ్ము దులిపి మెడికో శ్యామ్ వ్రాసిన ఈ కథను అందించినందుకు కథామంజరి సంపాదకవర్గముకు మనఃపూర్వక ధన్యవాదములు.

***డా. అల్లాడి మోహన్, డీన్, వి. ఐ. ఏం. ఎస్., తిరుపతి***

---

రాచకొండశాయిగారు పరిచయం చేసిన "కొవ్వొత్తి దీపం" కథ బాగుంది. సంక్షిప్తంగా చెప్పినా, కథ చదవాలన్న ఆసక్తి కలిగింది. భాస్కర్ పులికాల్ రాసినవి ఇరవై నాలుగేననీ, ఆ పుస్తకం పేరు సైబీరియన్ క్రేన్స్ అనీ చెప్పి, భాస్కర్‌గారు ఏడాదికి ఒక్కటికంటే ఎక్కువ రాయలేదు అన్నప్పుడు కథల సంఖ్యకీ, పుస్తకం పేరుకీ మధ్య ఏదో అనుబంధం... ఏడాదికోసారి వలస పోయినట్టు రాయడం... వంటిదేదో స్ఫురించింది. "భయాలన్నిటికీ అజ్ఞానమే కారణం కానక్కరలేదు. కానీ అజ్ఞానమున్న చోట భయం ఉండే అవకాశం ఎక్కువ, భయం కంటే ముందు ఆందోళన సహజమైనది. ఆ ఆందోళన తొలగించేది జ్ఞానమే కదా!" అన్న మాటలతో ఏకీభవించకుండా ఉండలేను. కథా రచయితకీ, పరిచయం చేసిన శాయిగారికీ అభినందనలు.

ప్రొ.గణేశ్వరరావు గారు జూన్ 8 వ తేదీన FBలో డా. చిర్రావూరి శ్యామ్‌గారి 'ఛీ' కథ మీద విపులమైన వ్యాఖ్య రాస్తే, దానికి శ్రీ రమణమూర్తిగారూ, శ్రీ జంపాల చౌదరిగారూ, శ్రీమతి సత్యవతిగారూ ఒకే అక్షరం శీర్షికగల అనేక తెలుగు కథలని ప్రస్తావించారు. కథావస్తువు చాలా సెన్సిటివ్ విషయం. ఆ సమస్యకి పరిష్కారం కూడా అంత సెన్సిటివ్ గానూ నిర్వహించ వలసిన విషయం. అలా చెయ్యడానికి ముందు సమస్య గురించి అవగాహన, ఆచరణలో చాలా సహనం, నేర్పూ కూడా కావాలి. ఈ మౌలిక విషయాలని మరీ అంత సీరియస్‌గా చెబితే పాఠకుడికి ఎక్కదని, కొంచెం హాస్యం రంగరించి రచయిత చెప్పినట్టు నాకు అనిపిస్తోంది. మొత్తం మీద, ఇది మంచి కథ. "వేలంవెర్రితో దేవుణ్ణి సరుకుగా చలామణీ చేస్తున్నారనీ, వాడు డబ్బు సంపాదించే వ్యాపార వస్తువు అయ్యాడనీ ... రోగనిదానం చేసిన పిచ్చమ్మగారిని" ఉలిపికట్టెగా చూస్తున్నందుకు తులసిగారు బాధపడుతున్నారు కానీ, దేముడి మీద భక్తిపోయి భయం ఏనాడు ఆవహించిందో, మనం చేసిన పాపాలకి శిక్ష అనుభవించకుండా పూజలూ, పునస్కారాలూ, హుండీలూ, పూజారులూ ఎప్పుడు బయలుదేరాయో(రో), వ్యక్తికి పరిమితమవవలసిన దేవుడు సమిష్టికి ఎప్పుడు ఎదిగాడో, అప్పుడే దేవుడు దేశ, కాల, మతాలతో నిమిత్తం లేకుండా అంగటి సరుకు అయిపోయాడు.

***ఎన్. ఎస్. మూర్తి***

---

కథలన్నీ అర్థవంతంగా ఉన్నాయి.తులసిగారి ఉలిపికట్టె కథ కొత్తగా ఉంది. ఒంటరి పోరాటం చేసేవారి మనస్తత్వానికి అద్దం పట్టింది. వారి మాటల్లో నిజాయితీ నిబద్ధత స్పష్టంగా వివరించారు రచయిత్రి. అలాగే కుదించుకున్న జీవితం నేటి పరిస్థితుల్ని స్పష్టంగా చూపించింది. పరిస్థితులకనుగుణంగా నేటి యువత తమ జీవనగమ్యాన్ని ఎలా మార్చుకోవాలో చూపించింది. కేవలమూ భోగాలకే కాకుండా సమయానుకూలంగా తనను తాను మార్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు రచయిత ఉదయబాబుగారు. అలాగే శాస్త్రాంగనలు కథ విలక్షణంగా ఉంది. రూపసులు కానివారు, దివ్యాంగులు, ఆత్మవిశ్వాసంతో సమాజంలో ఎలా ఎదగాలో తనదైన రీతిలో వివరించారు రచయిత. కథలంటే కేవలము ప్రేమలు, పెళ్లిళ్లు కావనే వాస్తవాన్ని విశదీకరించారు. పెళ్లికూతురు కథ కూడ పెళ్ళికి నోచుకోని అభాగ్యురాలి కలల ప్రపంచాన్ని పరిచయం చేసారు రచయిత రాంబాబుగారు.

**రామలింగేశ్వర రావు**

# మీరు నాకు వద్దు మాష్టారు!




9866521414

పున్నమరాజు సరోజ హరనాథ్


### రచయిత్రి పరిచయం

*ఇటీవలే కథలు వ్రాయడం మొదలెట్టిన శ్రీమతి సరోజ హరనాథ్‌గారు గృహిణి. ఆమె వ్రాసిన ఆ కొద్ది కథలు కూడా బ్లాగులు, వాట్సప్, ఫేస్బుక్‌లలో వచ్చినవే! పత్రికకు కథ పంపడం మొదటిసారిగా ఈ కథతోనే. ఆ ఈ కథకే మొదటి బహుమతి రావడం నిజంగా అభినందించదగ్గ విషయం. లలితసంగీతంలో అభినివేశం ఉన్న శ్రీమతి సరోజ హరనాథ్ గారికి చిన్నప్పట్నించీ పుస్తకాలు చదవడం చాలా ఇష్టం.*

> ***"మాకు మీరనుకునే బూతే ముద్దు. పోకిరీ, రౌడీ, జులాయి ఇవే మా హీరో పాత్రలు. తీవ్రవాదులూ, శాడిస్ట్ లు మేం ఎక్కువ ఆదరించే, ఇష్టపడే వ్యక్తిత్వాలు. నిజమే... ఇది సమాజానికి మంచిది కాదు. అందుకే ఈ చెత్తంతా చూపించేసి, సినిమా ఆఖరులో ఓ ఒకటిన్నర నిముషాలలో 'ముందు చెప్పినది సమాజానికి మంచిదికాదు, మనం జాగ్రత్తగా ఉండాలి' అని భారీ పదాలతో ఓ సందేశం ఇచ్చేస్తాం."***

నెమ్మదిగా తలుపు తోసుకువస్తున్న వ్యక్తిని పరిశీలనగా చూసాడు రాజశేఖర్. ఒక చేతిలో ఒద్దికగా ఫైల్ పట్టుకున్న ఆ నడివయస్కుడు రాజశేఖర్ ముందు వినయంగా నించుని నమస్కరించాడు.

"చెప్పండి"

"నమస్కారం. నా పేరు మధుసూదన్. నా పాట ఒకటి మీకు చూపిద్దామని వచ్చాను."

"అవునా? మీరు కింద రిసెప్షన్ లో మాట్లాడేరా?"

"ముందు వాళ్ళనే కలిశాను. ఇక్కడికి పంపించారు."

"సరే. కింద మూడవ నంబర్ గదిలోకి వెళ్ళండి. అక్కడ అసిస్టెంట్ డైరెక్టర్లు ఉంటారు. వాళ్ళకి చూపించండి."

"అలాగేనండి. నమస్కారం."

ఆధునికంగా ఉన్న మూడు అంతస్తుల భవనం అది. అది 'రాజశేఖర క్రియేషన్స్' వారి కార్యాలయం. దాని అధిపతి రాజశేఖర్. అతని తండ్రి స్థాపించిన ఆ సంస్థ నుండి ఎన్నో మంచి సినిమాలు వచ్చాయి. తండ్రి తర్వాత ఆ సంస్థ సారథ్యం రాజశేఖర్ కి వచ్చింది. అప్పటివరకూ కళ వైపే మొగ్గు చూపిన సంస్థ కార్యకలాపాలు, రాజశేఖర్ ఆధ్వర్యంలో కళ, వ్యాపారాలను సరి తూచుకుంటూ కొత్త బాట పట్టాయి. నష్టాల బాట పడుతున్న సంస్థ ఊపిరి తీసుకుంది.

సినిమా వాతావరణంలో చిన్నతనం నుండి పెరిగిన రాజశేఖర్ కు సినిమా అంటే ప్రాణం. మంచి సినిమా అంటే గౌరవం.

కానీ, మంచి సినిమా కోసం తనతోబాటు, సంస్థనీ, దాని మీద ఆధారపడిన ఎంతోమంది కళాకారుల్నీ నిరాధారుల్ని చేయడం అతనికి నచ్చదు. ప్రజలకి నచ్చేదే తీస్తూ, వ్యాపారం చేసుకుంటూ, మధ్యలో మంచి సినిమా చూపించాలి అనే నిర్దుష్టమైన అభిప్రాయం ఉన్న నిర్మాత రాజశేఖర్! గతంలో మంచి సినిమాలు తీసి, నష్టపోయి, అప్పులు తీర్చలేక, తండ్రి అనుభవించిన కష్టాలు, అవమానాలూ అతనికి ఎప్పుడూ గుర్తుంటాయి. అవే అతనికి ఎప్పుడూ మార్గదర్శకాలు.



ఇంటర్–కం లో రిసెప్షన్‌కి ఫోన్ చేసి "ఎందుకు ఆ పాటల రచయితని నా దగ్గిరకి పంపారు?" అని అడిగాడు.

"సారీ సార్! మధుసూదన్ పేరు మీద అపాయింట్‌మెంట్ ఉంటే పంపించేశాను. కానీ ఆ మధుసూదన్ ఆయన కాదని ఇప్పుడే తెలిసింది. ఆయన కూడా ఇప్పుడే వచ్చారు సార్... . మీ దగ్గిరకి పంపించాను. సారీ సర్." సవినయంగా చెప్పాడు రిసెప్షన్‌లో వ్యక్తి ఇంటర్–కం లో.

ఫోన్ పెడుతున్న రాజశేఖర్‌కి లిఫ్ట్ లోంచి వస్తున్న మధుసూదనంగారు కనిపించారు. నీలం రంగు టెర్లిన్ పాంట్, దాని మీద తెల్లని చొక్కా టక్ చేసుకుని, ఓ వంకీ కర్రని సాయానికి పెట్టుకుని, మీద పడిన వయస్సుని మోస్తున్నట్టు కొంచెం ముందుకు వంగి... జ్ఞానం, అనుభవం ఇచ్చిన తేజం మూర్తీభవించినట్టున్న మధుసూదనంగారు చిరుదరహాసంతో అక్కడి వాతావరణాన్ని పరికిస్తున్నారు. లేచి ఎదురు వెళ్ళి, తనని తాను పరిచయం చేసుకుని సాదరంగా ఆయనని ఆహ్వానించాడు రాజశేఖర్.

రాజశేఖరే స్వయంగా ఎదురు వచ్చి తీసుకెళ్తుంటే, అక్కడ ఉన్న ఉద్యోగులందరూ లేచి నిలబడి గౌరవం ప్రకటించారు. వాళ్ళెవరికీ వచ్చిన వ్యక్తి ఎవరో తెలియదు. అయినా నిర్మాతగారు అంత మర్యాద చూపెడుతున్నారు కాబట్టి ఎవరో పెద్దాయనే అయ్యుంటారని అనుకున్నారు.

మధుసూదనంగారిని తీసుకువచ్చి తన గదిలో ఓ కుర్చీలో కూచోబెట్టి, ఎదురుగా తన కుర్చీలో కూచున్నాడు రాజశేఖర్. ఇంతలో ఒకరు మధుసూదనంగారికి ఒక గ్లాసుతో చల్లని మంచినీళ్లు, ఒక కప్పు స్ట్రాంగ్ కాఫీ తెచ్చి ఇచ్చారు. ఆ రెండూ చూసి మధుసూదనంగారు ఆశ్చర్యపోయారు.

"మీకు ఆ రెండూ చాలా ఇష్టమని నాకు తెలుసు మాస్టారు. మిమ్మల్ని అనుకరిస్తూ నేనూ చాలాకాలం మీలాగే అవే తాగేవాడిని!" చిన్నగా నవ్వుతూ చెప్పాడు రాజశేఖర్.

"నాయనా! నీ ఆఫీసులోకి వస్తుంటే కింద ఉన్న ఆయన నాకు ఎదురు వచ్చి నమస్కారం పెట్టి, నా పేరు కనుక్కుని నీ దగ్గరకి దారి చూపించాడు. నా అపాయింట్‌మెంట్ గురించి చెప్పుకునే అవసరం తప్పింది అనుకున్నాను. లిఫ్టు నుండి బయటకు వస్తూంటే నువ్వు ఎదురు వచ్చి, నిన్ను నువ్వు పరిచయం చేసుకుంటుంటే... . నన్ను నేను పరిచయం చేసుకునే అవసరం లేదనుకున్నాను. ఇప్పుడు నువ్వు నన్ను 'మాస్టారు' అని పిలుస్తూ, నా ఇష్టాలని గుర్తెరిగి ఆతిథ్యం ఇస్తుంటే ఇక నాకు ఏ

అవసరం లేదనిపిస్తోందయ్యా!" అంటూ ఆనందంగా రాజశేఖర్ వైపు చూశాడు.

"మేమందరం ఆధారపడ్డ ఈ పరిశ్రమకి మూలస్తంభాలలో మీరు ఒకరు మాస్టారూ. మిమ్మల్ని గౌరవించుకోవడం మా కనీస బాధ్యత!" అంటూ, అక్కడ ఉన్న మిగతావారిని పంపించి, తలుపు దగ్గరకు వేసి, తన కుర్చీలో కూచున్నాడు.

"చెప్పండి మాస్టారూ.... ఎలా ఉన్నారు? ఏదో మాట్లాడాలన్నారు కదా?"

"ఏం లేదు నాయనా. యాభై సంవత్సరాలు గడిపిన ఈ ప్రపంచం నుంచి పది సంవత్సరాలుగా దూరంగా ఉన్నాను. ఒక్కసారి ఇప్పుడెలా ఉందో చూద్దామని వచ్చాను. సహజంగానే ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడు చాలా మంది నాకు తెలియదు. ఇదివరకు ఈ సంస్థతో కలిసి పనిచేశాను కదా. అందుకే ఒకసారి చూద్దామని వచ్చాను."

"సంతోషం మాస్టారూ. మీరు మద్రాసులో పనిచేసిన పరిశ్రమ ఓ సెలయేరు అయితే, ఇక్కడ హైదరాబాద్‌లో ఉన్న తెలుగు పరిశ్రమ ఒక పోటెత్తే గంగా ప్రవాహం. మీరన్నట్టు చాలా మార్పులు వచ్చాయి."

ఇంతలో ఇంటర్‌కమ్ మ్రోగడంతో, అది ఎత్తి మౌనంగా ఒక నిముషం విని, "మాస్టారూ.... ఇప్పుడే వస్తాను" అని బయటకు వెళ్ళాడు.

'అలాగే' అన్నట్టుగా తల పంకించి, ఎదురుగా టేబుల్ మీద ఉన్న పత్రికలకేసి చూసారు మధుసూదనం గారు.'ఫిల్మ్ మేకర్', 'ఫిల్మ్ కామెంట్' పత్రికలు అవి. హాలీవుడ్ సినిమా ప్రపంచం గురించి వివరంగా చర్చించే పత్రికలు. ఒక పత్రిక తీసి పేజీలు తిప్పుతుంటే రాజశేఖర్ వచ్చాడు.

"నీకు హాలీవుడ్ మీద మక్కువ ఉందా?"

"కొంచెం ఉంది మాస్టారూ. అక్కడే 'న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ' నుంచి ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ చేశాను. ఆ సినిమాతో కొంత పరిచయం, అభిమానం ఉన్నాయి!"

"బావుంది నాయనా! సినిమా గురించి తెలిసిన నిర్మాత నుండి మంచి సినిమాలు వస్తాయన్నది నాకో పెద్ద నమ్మకం."

"అవును మాస్టారూ! దీనితో నేనూ ఏకీభవిస్తాను. ఇది కళగా భావించని నిర్మాత దీనిని పూర్తిగా వ్యాపారం చేస్తాడు. కొంతమంది వడ్డీవ్యాపారం చేసుకునే వాళ్ళు నిర్మాతలుగా మారి, సినిమా స్థాయిని బాగా దిగజార్చారు. వాళ్ళకి ఒకటే ఆశయం... వడ్డీ వ్యాపారం కంటే ఇక్కడ ఎక్కువ సంపాదించడం."

"అయ్యో! అలాగా! మా అదృష్టం కొద్దీ అప్పట్లో మంచి నిర్మాతలు ఉండేవారు. సినిమా మొత్తం దర్శకుడి కనుసన్నలలో నడిచేది. అయినా నిర్మాతల అభిరుచే సినిమాకి మూలం!"

"నిజం మాస్టారూ. ఇప్పుడు కూడా కొంతమంది ఉన్నారు. వారి మూలానే ఇంకా తెలుగు సినిమా కొంచెం నిలబడింది."

"అవును నాయనా. మంచి దర్శకులని ప్రోత్సహించిన నిర్మాతలకి తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఋణపడి ఉంటారు, ఉండాలి కూడా!"

"అక్షర సత్యం మాస్టారూ. మీ అనుభవంతో చెప్పండి... సినిమా ఎలా ఉండాలి?"

శ్రద్ధగా చేతులు కట్టుకుని అడుగుతున్న రాజశేఖర్‌కేసి ఆప్యాయతతో చూస్తూ చెప్పసాగారు మధుసూదనంగారు.

"సినిమా మూడు దశలలో ఉండాలి. పరిచయం, ఘర్షణ, ముగింపు. సినిమాకి ప్రాణం కట్టిపడేసే కథాంశం. దీనిని అర్థం చేసుకున్న దర్శకుడు... మిగిలిన వారి సహాయంతో మంచి దృశ్య రూపాన్ని ఇస్తాడు. ఏ సినిమా అయినా ప్రేక్షకుడిని కట్టి పడేసేలా ఉండాలి. సినిమాలో కథ చెప్పకూడదు, చూపించాలి! పాత సినిమాలు మనకి ఎందుకు ఎక్కువ నచ్చుతాయంటే అవి మన జీవితాల్లోని కొన్ని సంఘటనలే. అవి అర్థం చేసుకోవడానికి, ఆ సంఘటనలతో మమేకం అవ్వడానికీ మనకి ఎక్కువ సేపు పట్టదు. అందుకే అవి చూస్తూ మనం ఏడుస్తాం, నవ్వుతాం! సినిమాలో లీనమవుతాం!"

మధుసూధనంగారు మాట్లాడుతుంటే, విద్యార్థిలా వింటూ ఉండిపోయాడు రాజశేఖర్.

"ఇక నటన గురించి... నటులకే సినిమాలో అవకాశం ఇవ్వాలి. ఓ వ్యక్తి ఎంత గొప్పవాడైనా మంచి నటుడు కాలేకపోవచ్చు. నిర్మాత చుట్టాన్నో, ఓ హీరో కొడుకునో బలవంతంగా జనాల మీద రుద్దకూడదు. దర్శకుడు, కెమెరా దర్శకుడో వాళ్ళని అందులో ఇరికించవచ్చు, కానీ ఆ పాత్రకి జీవం పోయలేరు. నటనలో సృజనాత్మకత ఉండాలి. ఇది అనగానే నాకు ఒక దృశ్యం కళ్ళముందు మెదులుతుంది. కన్యాశుల్కం సినిమాలో సావిత్రి నటన. మహానటి. ఉత్తరంలో ఉన్న లొట్టిపిట్టలు అన్న పదానికి నవ్వుతుంది. ఆవిడ ఎందుకు నవ్వుతోందో ప్రేక్షకులకి అప్పటికి తెలియదు. కానీ హాలంతా ఆవిడతో బాటే నవ్వుతారు. ఇది నటనకి ఓ పరాకాష్ట. ఇది సాధించాలంటే ఎంతో అంకితభావం కావాలి!"

అలా వాళ్ళు సినిమా పూర్వాపరాలూ, స్థితిగతులూ బాగా చర్చించారు. ఆయన ఆలోచనా సరళికీ, అనుభవానికీ అతను ఆశ్చర్యపోతుంటే, పరిశ్రమ పట్ల అతని అవగాహనకీ, ఆచారణాత్మకతకీ ఆయన ఆనందపడిపోతున్నారు. అతను శిష్యుడిలా ప్రశ్నిస్తున్నాడు ఆయన గురుస్థానంలో మునిలా విశదీకరిస్తున్నారు.

"నాయనా... ఇది చీమల పుట్ట. నానుండి ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉంటాయి. కానీ నువ్వు ఇంత శ్రద్ధగా వినడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చిందయ్యా!" టేబుల్ మీద ఉన్న మంచినీళ్లు కొంచెం తాగుతూ అన్నారు మధుసూదనం గారు.

"అవును మాస్టారూ... మీరు చెప్పినది నేను మాస్టర్స్ చేస్తున్నప్పుడు నేర్చుకున్న దాని సారం. మీవంటి వారి అనుభవాన్ని మన పరిశ్రమ వాడుకోలేకపోతోంది. అన్నట్టు... అన్యథా భావించకండి... పరిశ్రమ నుండి బయటకు వెళ్ళాక గడిపిన ఈ పది సంవత్సరాల జీవితం ఎలాగుంది మాస్టారు?"

"బాగానే ఉంది. పిల్లలిద్దరూ అమెరికాలో ఉన్నారు. మేం అక్కడికి పోలేం, వాళ్ళు ఇక్కడికి రాలేరు. తిండికీ, బట్టకీ లోటు లేదు. సాగిపోతోంది." ఎటో చూస్తూ అన్నారు మధుసూదనంగారు.

ఇద్దరూ రెండు నిముషాలు మౌనం పంచుకున్నారు. బరువుగా ఉన్న మౌనాన్ని భంగపరుస్తూ మధుసూదనం గారు సంశయపడుతూ అడిగేరు... "అవునయ్యా... నువ్వు ఎలాగూ అన్నావు కదా అని అడుగుతున్నాను. నాకు మళ్ళీ ఓ సినిమాకి అవకాశం ఇయ్యగలవా?"

ఆయన మాటలకి రాజశేఖర్ ఒక్క క్షణం మౌనంగా ఉండి... "లేదు మాస్టారూ. ఇవ్వలేను. దయచేసి మరోలా అనుకోకండి." అన్నాడు.

ఊహించని ఆ స్థిరమైన సమాధానానికి మధుసూదనంగారు నివ్వెరపోయారు. తన పరిస్థితి చెప్పి, సహాయం అడగడానికి బదులు, పరిశ్రమలో తన అనుభవాన్ని చూపించి పని అడుగుదామనుకున్నారు. మొదటిది తను వద్దనుకుంటే, రెండోది

అతను వద్దన్నాడు. మరిప్పుడు తన పరిస్థితి ఏమిటి?

ఒదిగి, వినయంగా రాజశేఖర్ చెబుతున్నది వింటున్నారు, కట్టలు తెంచుకున్న ఆలోచనల్ని కట్టడి చేసే ప్రయత్నం చేస్తూ.

అంతలో... తలుపు తెరిచి లోపలకి చూస్తున్న సెక్రెటరీ వైపు 'ఏమిటి?' అన్నట్టు చూశాడు రాజశేఖర్.

"ఫైనాన్సర్స్ మీటింగ్‌కి టైమ్ అయ్యింది సార్. వాళ్ళు అందరూ వచ్చారు, మీ కోసం వెయిట్ చేస్తున్నారు!" సెక్రెటరీ నెమ్మదిగా చెప్పాడు.

"సరే! నేను వస్తున్నాను" అని చెప్పి, మధుసూదనంగారి వైపు తిరిగాడు.

పరిస్థితిని అర్థం చేసుకుని, "అలాగే! మరి..." మధుసూదనంగారికి అంతకంటే మాటలు కరువయ్యాయి. నెమ్మదిగా లేచి రాజశేఖర్ భుజం మీద ఆప్యాయంగా చెయ్యివేసి, బయలుదేరారు.

★★★

ఆటోలో తిరిగి బయలుదేరిన మధుసూదనంగారికి రాజశేఖర్ మాటలే పదే పదే గుర్తుకు వస్తున్నాయి.

"ఇది మిమ్మల్ని కించపరచడానికి అన్నది కాదు మాస్టారూ. మీరు ఉన్నత ప్రమాణాలలో సినిమాలు తీస్తారు. అవి ఇప్పుడు అక్కరలేదు. ఇప్పుడు ఏదో ఒకటి తీసి దానికి గ్రాఫిక్స్ తొడుగు తొడిగేస్తే లాభాలు వచ్చేస్తాయి. మీరు తీసే సినిమాలో నటించే స్థాయి నటులు కూడా మాకు లేరు. మేం ఎవరికి ఎక్కువ అభిమానులు ఉన్నారో వాళ్ళనే పెట్టుకుంటాం. మా సినిమాలు దాదాపు ఆ అభిమానులే చూస్తారు. అది చాలు మాకు. మీరు ఆదర్శాలని చర్చిస్తారు. దాన్ని ఇప్పుడు 'పాత చింతకాయ పచ్చడి' అంటారు. మాకు మీరనుకునే బూతే ముద్దు. పోకిరీ, రౌడీ, జులాయి ఇవే మా హీరో పాత్రలు. తీవ్రవాదులూ, శాడిస్ట్‌లు మేం ఎక్కువ ఆదరించే, ఇష్టపడే వ్యక్తిత్వాలు. నిజమే... ఇది సమాజానికి మంచిది కాదు. అందుకే ఈ చెత్తంతా చూపించేసి, సినిమా ఆఖరులో ఓ ఒకటిన్నర నిముషాలలో 'ముందు చెప్పినది సమాజానికి మంచిదికాదు, మనం జాగ్రత్తగా ఉండాలి' అని భారీ పదాలతో ఓ సందేశం ఇచ్చేస్తాం."

"మాకు సినిమా వంద రోజులు ఆడనక్కరలేదు, వారం ఆడితే చాలు. ప్రపంచం మూలమూలలా... తెలుగు సినిమా చూసేవాడు ఉన్న ప్రతిచోటా... సినిమా విడుదల చేసేస్తాం. 'సినిమాలో ఏమీ లేదు... చెత్త' అని ప్రేక్షకుడికి తెలిసేలోగా కనీసం ఐదువందల కోట్ల వ్యాపారం జరిగిపోతుంది. దీనికోసం మీలాగా సంవత్సరం సినిమా తీయాలా? మంచి గ్రాఫిక్స్ కంపెనీ ఉంటే చాలదూ!"

"ఇంకో విషయం మాస్టారూ. మీ గురించిన, మీరు చెప్పని రెండు విషయాలు నేను చెబుతాను. అన్యథా భావించకండి! మొదటిది... మీరన్నట్టు మీకు తిండికి బట్టకు లోటు లేదు. కానీ అమ్మగారి సర్జరీకి హాస్పిటల్‌కు చెల్లించడానికి మీకు సహాయం కావాలి. అందుకే మళ్ళీ మీరు పనిచేయడానికి వచ్చారు. అమ్మగారిని చేర్చిన హాస్పిటల్ బిల్లు మొత్తం ఇందాకనే చెల్లించాను. దాని గురించి దయచేసి మీరు ఆలోచించకండి. ఇది దానం కాదు. ఇది సేవాసంస్థా కాదు. నాన్నగారికి మీరంటే ఆప్యాయత, నాకు మా నాన్నంటే ప్రేమా, మీరంటే గౌరవం. ఇది కంపెనీ నుండి కాదు. పూర్తిగా నా స్వంతం. దయచేసి కాదనకండి. ఇక రెండవది... తిండి, బట్టని దాటిన ఏ ఖర్చులనీ మీరు తట్టుకోలేరు."

తడారిపోయాయి అనుకున్న కనుకొలకుల్లో రెండు చుక్కలు చేరుకున్నాయి. ఇప్పుడు ఆయనకి నెమ్మదిగా అర్థమౌతోంది. ఈ

మధ్య అత్యవసరాలలో ఆదుకుంటున్న అజ్ఞాత హస్తం ఎవరిదో.

ఆయనలో ఇంతకాలం తర్వాత మళ్ళీ ఎదురైన సందిగ్ధత... 'మంచి సినిమా అంటే? లాభాలను ఆర్జించేదా? లేదా ప్రేక్షకులకు మంచి సందేశం ఇచ్చి, తద్వారా సమాజాన్ని సరి అయిన దారిలో నడిపించేదా?'

జవాబు కోసం మధుసూదనంగారు ఇంకా ఆలోచనల్లోనే ఉన్నారు!



9063854331




# జమదగ్ని

రత్నాకర్ పెనుమాక

## రచయిత పరిచయం

*వివిధ బహుళ జాతి కంపెనీల్లో హెచ్ ఆర్ మేనేజర్‌గా పనిచేసి, ఆ తర్వాత అంటే 2005 లో యానాంలో ఒక స్వచ్ఛంద సేవాసంస్థ నెలకొల్పి పూర్తికాల సామాజిక సేవలో ఉన్నారు. సాహిత్య సేవతో పాటు సామాజిక సేవ కూడా చేస్తున్న శ్రీ రత్నాకర్‌గారు, ఇప్పటివరకు 41 సార్లు రక్తదానం చేసారు. గత మూడు సంవత్సరాల నుంచి రచనలు చేస్తున్నారు. 2022 ఫిబ్రవరిలో "గౌతమీతీరం" అనే మొదటి కథా సంపుటి ఆవిష్కరించి పాఠకుల అభిమానాన్ని పొందింది. ఈ సంవత్సరం జూలైలో వీరి రెండవ కథా సంపుటి "గౌతమీ ఒడ్డున" ఆవిష్కరింపబోతున్నారు. ఇప్పటికి 50 కథలు, 30 కవితలు, 5 నవలలు రాసారు. ఇవన్నీ అముద్రితాలే. సంవత్సరం నుంచే పోటీలకు కథలు పంపుతున్నారు. ఇప్పటికి 11 బహుమతులు వచ్చాయి . ఇది 12 వది.*

***"చెయ్యకేం... ఆడికి ఇరవైఏళ్ళు రాగానే ఒడ్డు, పొడుగు మిలమిల మెరిసీ ఆడందం చూసి హీరోలాగున్నావురా అంటే, నిజంగా హీరో అవుదామని గౌతమి ఎక్కి హైద్రాబాద్ ఎళ్ళాడు. అక్కడకెళ్తా, ఆళ్ళ నాన్నిచ్చిన దబ్బులైపోయాసరికి నాకు ఉత్తరం రాత్తే, మా బాబాయ్ ఆళ్ళింట్లో నెలరోజులు ఉండీలాగ పురమాయించాను. ఎళ్ళి రొండేళ్ళు గడుత్తున్నా అసలు ఏ స్టూడియోలోకి లోపలికెళ్ళనివ్వా పోయాసరికి, నైట్‌వాచ్‌మేన్‌గా జాయినయ్యి,"***

నాకు మాఅక్కోళ్ళ ఊరంటే మాచెడ్డ ఇష్టం. ఊరు చిన్నిదే కానీ, కోడిపందేలకి ఆచుట్టుపక్కల ఏఊరోళ్ళైనా అక్కడికి రావల్సిందే. ఊరి పేరు మెర్నిపాడు. జేగురుపాడునించి ఎలగతోడు ఎల్తుంటే తగుల్తాది. పెద్ద పండక్కైతే అమ్మోరి గుడెనకాల ఈరింకి తారకంగారి సెలకలో పెద్ద సంబరంగా జరుగుతాయి. పట్టుకుంటానికి పోలీసులు రావాలంటే మండపేటనించి రావాలి. ఆళ్ళు ఊరి పొలిమేర కాడుండగానే తారాజువ్వలు మూడేత్తారు కుర్రోళ్ళు. అది ఆనవాలు పోలీసులు వత్తన్నారని. అలా కాపలా ఉంచినోళ్ళకి కోసలో (పందెంలో ఓడిన పుంజును కూరకి వాడినప్పుడు దాన్ని కోస అంటారు) సగంవాటా ఇత్తారు. అది ఎన్నో ఏళ్ళనించి వత్తన్న పడికట్టు. పతి ఏడు మాఘమాసంలో బాపనమ్మ అమ్మోరికి జాతర జరుగుద్ది. ఊరంతా సందడిగా ఉంటది. జాతర మూడ్రోజులు... ఎక్కడెక్కడినించో జీళ్ళు అమ్ముకునీవోళ్ళు, ఖర్జూరం అమ్ముకునీవోళ్ళు, రకరకాల పిండివంటలు అక్కడికక్కడే వొండేసి వేడివేడిగా అమ్మేత్తారు. చిన్నపిల్లలు బుడగలు, బూరలు, చెంపిన్నిలు, చెవిలీలు దండలు అమ్ముకునీవోళ్ళు బోల్డుమంది. ఆ మూడ్రోజులు ఊళ్ళో రాత్రే ఉండదు. ఆ మూడురాత్రులు ఒక్కొక్కరోజు ఒక్కొక్కరి భోగంమేళాలు, హిజ్రామేళాలు, రికార్డింగ్ డేన్సులు ఉంటాయి. ఇయ్యన్నీ కారణమే నాకీ ఊరంటే ఇష్టముంటానికి, కానీ అన్నీట్లికంటే మా అక్కంటే నాకు ప్రాణం. అక్కకి నేనంటేపిచ్చి. ఆ పిచ్చి మా బావకి అంటించింది. అందుకే మా బావ కూడా అక్కతో పోటీపడతాడు నన్ను బాగా చూసుకోటంలో! అదీ అసలు కారణం.

ఎప్పటిలాగే ఈ ఏడు కూడా అమ్మోరి జాతరకొచ్చాను. మూడోరోజు రాత్రి జమదగ్ని రికార్డింగ్ డాన్స్ ఎడతారు. ఇందులో ఎక్కువమంది డాన్సర్లుండరు. సూపర్‌స్టార్ కృష్ణలాగా ఏసినతనే, ఇంకోపాట తర్వాత ఏ.ఎన్.ఆర్. లాగా, ఇంకోపాటలో

ఎన్.టి.ఆర్. లాగా ఏత్తాడు. మజ్జమజ్జలో చిరంజీవిలాగ ఒకలు, శోభన్‌బాబులాగ ఒకలు ఏత్తారు. ఆ ఇసయమే మా బావనడిగితే, "చిన్నా ఎన్ని ఏసాలేసినా తేడా రాకండా ఏత్తన్నాడుకదా! ఆడు ఈ ఊరోడే పేరు జమదగ్ని. అందుకే డబ్బులిచ్చినా ఇవ్వాపోయినా పతిఏడు పోగ్రాం పెడతాడు!" అన్నాడు.

దానికి, "అదేంటి బావా... ఎవరో కానీ పెట్టుకోరు ఆ పేరు! అదేంటి జమదగ్ని పేరు భలే ఇచిత్రంగా ఉంది!" అన్నాను.

దానికి మా బావ "ఆ పేరుకి పెద్ద కథుందిలేరా, ఇంటికెళ్ళాక పడుకున్నపుడు చెప్తాను!" అన్నాడు.



అన్నీ చూసి ఇంటికెళ్ళాక కొరమేను పులుసుతో అన్నం తినేసి వాకిట్లో నులకమంచం మీద మాబావ, పట్టిమంచం మీద అక్కా, నేను పడుకుంటంటే అప్పుడు చెప్పాడు ఆ జమదగ్ని కథ.

"జమదగ్ని ఆళ్ళ నాన్న పెద్ద సినిమా పిచ్చోడ్రా. అతనికి కరణంగారి దగ్గిర నౌకరు పని పంచాయితీలో. అందుకే సైకిలేసుకుని సెకండ్‌షోకి మండపేట ఎళ్ళి, మారిన సినిమాల్లా చూసీవోడు! సూపర్‌స్టార్ కృష్ణ అంటే మరీ పిచ్చి. ఆళ్ళావిడకి పురుడొచ్చినరోజు అగ్నిపర్వతంసినిమా రిలీజైనరోజు ఒకటే, అందుకే సూపర్‌స్టార్ కృష్ణ అంతటోడవ్వాలని ఆ పేరెట్టాడు. ఆ సినిమాలో డబుల్‌రోల్ క్రిష్ణది. పెద్దోడి పేరు జమదగ్ని! ఆ పేరే కొడుక్కెట్టాడు. ఆ సినిమాలో క్రిష్ణకి పగ, కోపం ఎక్కువ! పాపం ఇడికి అలాంటియ్యేమీలేవు. చేలా శాంతంగా ఉంటాడు!" అని చెప్పాడు.

"మరి మనిషి చూడ్డానికి నిజంగానే హీరోలాగే ఉన్నాడుకదా! సినిమాల్లోకి ట్రైచెయ్యలేదా బావా?" అనడిగాను.

"చెయ్యకేం... ఆడికి ఇరవైఏళ్ళు రాగానే ఒడ్డు, పొడుగు మిలమిల మెరిసీ ఆడందం చూసి హీరోలాగున్నావురా అంటే, నిజంగా హీరో అవుదామని గౌతమిఎక్కి హైద్రాబాద్ ఎళ్ళాడు. అక్కడకెళ్తా, ఆళ్ళ నాన్నిచ్చిన డబ్బులైపోయాసరికి నాకు ఉత్తరం రాత్తే, మా బాబాయ్ ఆళ్ళింట్లో నెలరోజులు ఉండీలాగ పురమాయించాను. ఎళ్ళి రొండేళ్ళు గడుత్తున్నా అసలు ఏ స్టూడియోలోకి లోపలికెళ్ళనివ్వా పోయాసరికి, నైట్‌వాచ్‌మేన్‌గా జాయినయ్యి, పగలంతా అవకాశాలకోసం తిరిగీవోడంట! అక్కడ ఈడికిలాగే ఏళ్ళకేళ్ళు తిరిగి తిరిగి అలిసిపోయి, ఇంటికెళ్ళలేక చిన్నిచిన్ని ఉజ్జోగాల్లో స్థిరపడిపోయినోళ్ళేఎక్కువంట. ఎవడో ముప్పైవేలు తెచ్చుకుంటే అవకాశం ఇప్పిత్తానంటే, ఇంట్లోవోళ్ళు 'అలాంటియ్యి నమ్మకూడదురా' అంటన్నా ఇనకండా, తాత ముత్తాతలనించీ వత్తన్న పెరడు అమ్మేసి డబ్బు పంపారు! ఆ డబ్బు తీసుకున్నోడు... 'ఇదిగో అదిగో' అంటంటే, ఆ అవకాశం కోసం ఈడుఎదురు చూత్తన్నపుడు ఆళ్ళనాన్నకి కాలు చెయ్యి పడిపోయి, మంచమట్టేసాడు. అప్పుడొచ్చాడు చూత్తానికి. అప్పుడు కరణంగారు

'ఒరే జమదగ్నీ! మీ అయ్యకి కాలు చెయ్యా పడిపోయింది. నాకా మీ అయ్య లేపోతే ఏపనీ నడదు. ఆ పనికి నువ్వొచ్చెయ్‌రా. తాసిల్దార్‌గారితోచెప్పి పర్మినెంట్ చేయిత్తాను' అన్నా ఇనలేదు. పాపం ఆడికి అప్పుడు డబ్బు తీసుకున్నవోడు చెప్పిన సొల్లు కబుర్లు అలాంటియ్యి మరి. హీరోకి ఫ్రెండ్ కింద నటించాల అని చెప్పాడు. ఈడు పూర్తిగా నమ్మీసాడు. కరణంగారిచ్చిన అవకాశం కాలదన్నుకున్నాడు. ఆడికి ఆళ్ళ నాన్నపనిచేసినపుడు నెలకి ఎయ్యా రెండేలు పంపీవోడు. ఇప్పుడు ఇల్లు గడటమే కష్టంగా ఉంది.ఇది జరిగిన ఏడాదికి ఆళ్ళ నాన్న సర్దేసుకున్నాడు. ఆ కబురట్టుకుని ఊరొచ్చినాడికి చుట్టాలు, మాలాంటి జతగాళ్ళు... 'ఇంక సినిమాపిచ్చి వొదిలేసి ఏదొక పని చేసుకోరా ముప్పై ఏళ్ళొచ్చేసాయి మీ నాన్న మంచమట్టిన కాణ్ణుంచి మీ అమ్మ రేవులోకెళ్తంది. ఇంటికాడ ఇస్త్రీచేత్తంది. నువ్వు పుట్టినప్పుడు నడుముకి దెబ్బ తగిలిందని డాట్టర్ మానెయ్యమంటే మానీసింది. మళ్ళీ ఇన్నాళ్ళకి మళ్ళీ మొదలెట్టిందిరా. ఊళ్ళో పెసిరెంట్ తారకంగారియ్యి కానీ, ఆరి బామ్మర్ది సత్తుంగారియ్యి కానీ... ఉతకాలన్నా, ఇస్త్రీ చెయ్యాలన్నా మీ అమ్మే ఒత్తాది. అంత తెల్లగా ఉతకటంకానీ, అంత బాగా నిలబడీలాగ ఇస్త్రీచెయ్యాలన్నా కానీ, మీ అమ్మేరా! మీ అమ్మ మానేసిన కాణ్ణించి ఆరు మండపేటలో ఇచ్చుకుంటన్నారంట!" అని చెప్తుంటే ఆడి కళ్ళు చెమర్చాయి, కళ్ళు తెరిచాయ్. ఊహాలోకంలోంచి కిందకి దిగి ఆలోచించడం మొదలెట్టాడు. రికార్డింగ్ డాన్స్ ట్రూప్ పెట్టాడు. రొండేళ్ళకితందాకా బాగానే ఉంది ఆళ్ళ పరిస్థితి! ఇప్పుడు ఆళ్ళకి బేరాల్లేవంట. ఆళ్ళ నాన్న ఉజ్జోగం గురించి కరణంగారినడిగితేఏమీ చేయలేనన్నాడు! ఆళ్ళ నాన్నకి బదులు ఆళ్ళ చాకలిపేటలో కన్నప్పగారబ్బాయ్, సిరిపురం సుబ్రమణ్యానికి ఆ ఉజ్జోగం ఏయించేసారు. మొన్నామజ్జ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆళ్ళకి పర్మినెంట్ కూడా అయిపోనాది. ఈడు అన్నిటికీ సెడిపోయాడు. ఆడందమే ఆడికి శాపమైందిరా చిన్నా" అని చెబుతుంటే నాక్కూడా బాధేసింది.

"అతనికి పెళ్ళవలేదా బావా?" అనడిగాను.

"పోయినేడే ఓ పిల్ల ఆణ్ణి ప్రేమించి కోరికోరి చేసుకుంది!" అని చెప్పాడు.

"రేపోసారి ఆళ్ళని చూడాలి బావా, ఎళ్దామా?" అన్నాను.

"సరే బాగా ఆలిసమైంది పడుకోరా!" అంది మా అక్క.

పొద్దున్నే ఏప్పుల్లతో పళ్ళు తోముకుని, వేడివేడి గారిల్లోకి చెరుకుపానకం ఏసుకుని తినీసి, బావా నేను గౌతమీ కాలవలో తానానికిబయల్దేరాం. అక్కడ జమదగ్ని బట్టలుతకటం చూసి అవాక్కైయ్యాను. అంతే బాధపడ్డాను.

"నిన్న రాత్రే అందరి హీరోల్ని నీలో చూసుకున్నాను. ఇప్పుడిలా చూడ్డం చేలా బాధగా ఉందన్నా!" అంటంటే... అతను అందులో ఏమంత విచిత్రం లేదన్నట్టు, "అది నటన ఇది జీవితం" అన్నాడు. ఆమాటలో ఎన్నో అనుభవాలసారం ముప్పైఏళ్ళ ఊహలు, అడియాసలైన ఆశలున్నాయ్.

అతనికి మాబావ నన్ను పరిచయం చేత్తా, "ఒరే బావా రాత్రి నించి మావోడు నీగురించే అడుగుతున్నాడ్రా!" అని చెప్పాడు.

సాయంత్రం బట్టలు ఇస్త్రీకిద్దామని బావా, నేను జమదగ్ని ఇంటికెళ్ళాం! ఆళ్ళావిడ ఇస్త్రీ చేత్తంది. ఆవిడికి బట్టలిచ్చి మాబావ చెప్పాడు. "మాఊళ్ళో ఉప్పుడు బట్టలుతకటంలో మాబావా, ఇస్త్రీ చేయటంలో మాచెల్లి నెంబర్‌వన్" అంటంటే ఆవిడ నవ్వుకుంటా మాకు కుర్చీలు తేటానికి పెరట్లోకెళ్ళింది.

"ఇప్పుడీళ్ళకి చేతినిండా పనే! ఈ అమ్మాయే కనక మావోణ్ణి చేసుకోపోయుంటే ఆడి బతుకు మరోలా ఉండును. ఈ అమ్మాయి 'నువ్వు సంపాదించి తెత్తేనే కాపరం చేత్తాను. లేపోతే పోతాను' అంటా, ఓ పదిరోజులు ఎళ్ళిపోయాసరికి, ఆళ్ళమ్మని కూడామాన్పించేసి ఆడే రేవుకెళ్తన్నాడు. ఆడికి తోడుగా మాచెల్లి ఇంటికాడ ఇస్త్రీ చేత్తంది. ఉప్పుడీళ్ళకి ఏలోటూలేదు.

ఓ కొడుకు... ఆడికి మూడేళ్ళు! పేటలోఎవరికీ లేనంత పెద్ద టీ.వి. కొన్నాడు. ఇంట్లో అన్నీఉన్నాయ్!" అని చెబుతంటే జమదగ్ని బయటినించొచ్చాడు. మాతో మాటాడతా ఉండగా, ఆళ్ళ పిల్లోడు టి.వి.లో పవన్కళ్యాణ్ పాటకి రేవుకేసిన బట్టల్లోది కాశీ తువ్వాలు మెళ్ళో ఏసుకుని పవన్కళ్యాణ్లాగే డాన్స్ ఏత్తన్నాడు.అదిచూసి నేను మాబావ నవ్వుకుంటా, "చెల్లీ మీవోడు భలే ఏత్తన్నాడు" అంటంటే, జమదగ్ని కోపంగా లోపలికెళ్ళి కేబుల్ కార్డు పీకేసాడు. ఏమైందో తెలీక టీ.వీ. పోయిందనుకుంటన్నాడు ఆళ్ళపిల్లోడు. కార్డట్టుకుని ఆడు మాదగ్గిరికొచ్చాడు

"అదేరా పాపం ఆడుచూత్తంటే కేబుల్పీకేసావ్" అనడిగాడు బావ.

దానికతను"నాలా ఆడు కూడా సినిమా పిచ్చిలో, ఊహల్లో బతక్కూడదనిరా బావా!" అన్నాడు.

'అవును కదా' అనుకున్నాం మేము!

**కథామంజరి రథం గత మూడు సంవత్సరాలుగా విజయపథంపై పయనిస్తోంది.**
**భగవంతుడు పుట్టిన వారందరికి బహుమతులనివ్వడు.**
**కానీ, కొంతమంది మంచివారిని అందరికీ బహమతిగా పుట్టిస్తాడు.**
**వారిలో కొందరు కథామంజరికి బహుమతిగా లభించారు. వారి ఆర్థిక వితరణయే**
**మా విజయపథ పయనానికి కారణమని వినయంగా విన్నవించుకుంటున్నాం.**
**మీరు కూడా కథామంజరికి బహుమతిని అందించాలనుకుంటే సంతోషంగా స్వీకరిస్తాం.**
**మీతో చేయిచేయి కలిపి మరిన్ని విజయాలవైపు పయనించడానికి మేము**
**సర్వసన్నద్ధంగా ఉన్నామని తెలిపరచుకుంటున్నాం.**
**ఆ అవకాశాన్ని మాకు కలిగేలా చేయమని మరోసారి విన్నవించుకుంటున్నాం.**



9676123876

# రవిగాంచని చోట ..

ఇరిగినేని హనుమంతరావు

### రచయిత పరిచయం

*వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. రాసింది చాలా తక్కువే అయినా, వాసి ఉన్న కథలు రాశారు. కోవిడ్ లాక్ డౌన్ సమయంలో, మిత్రుల ప్రోత్సాహంతో రాయడం మొదలుపెట్టారు. మొదటి కథ 'సహగమనం' తెలుగు వెలుగు జూలై 2020 సంచికలో అచ్చయింది. తర్వాత పలు కథలు వివిధ వెబ్ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. కొన్ని కథలకు బహుమతులు అందుకున్నారు. "కొంచెం ఓపికగా ఉంది, అది నా బలం. బద్ధకం మోతాదు ఎక్కువే. ఇదో బలహీనత!" అంటూ తనని తను పరిచయం చేసుకునే శ్రీ హనుమంతరావుగారు బాగా పుస్తకాలు చదువుతారు*

***"నువ్వు నన్ను క్షమించాలి. నేను నీ జర్నల్ చదివాను. కేవలం నీ ఆలోచనలు తెలుసుకొనేందుకే! మరే దురుద్దేశమూ లేదు. సినిమాలో నీ కోణాన్ని పూర్తిగా ఆవిష్కరిస్తే, మన పాత్రలు మాత్రమే ఉదాత్తమైనవిగా కనబడతాయి. శశి పాత్ర మొత్తం బలహీనమౌతుంది. అప్పుడు బయోపిక్ అర్థమే లేకుండా పోతుంది. ఇంకో సంగతి. ఒక గొప్ప సినిమాగా మిగులుతుందని 'శశి' బయోపిక్ అనుకున్నాను గానీ, నేను గొప్పగా కనబడాలనే కుట్ర కోణం ఏమీ లేదు. శశి చేసింది దిద్దుకోలేని పొరపాటైనా, వ్యక్తిగత జీవితంలో నువ్వు పాటించిన గోప్యతకు గౌరవమిస్తూ సినిమాను ఆపేస్తున్నాను.***

**నిజం**

నిజం నిశ్చలంగా ఏమీ ఉండదు. నిరంతరం పారే నదిలా ప్రవహిస్తూనే ఉంటుంది. కాలం గడిచేకొద్దీ కొత్త అభిప్రాయాలు, కొత్త అనుభవాలు నిజం యొక్క స్వరూపాన్ని మార్చివేస్తాయి. మనిషి జీవితం శాస్త్రీయ నిర్వచనానికి లోబడేదేమీ కాదు. అందులోనూ, ఓ సెలబ్రిటీ జీవితం. చూసే కోణాన్నిబట్టి నిజాలు మారుతూ ఉంటాయి. ఎవరికి ఏది సంతృప్తినిఇస్తే అదే నిజం. ఇప్పటికే ఉన్న అభిప్రాయాల్ని మార్చడానికి, నమ్మకాల్ని చెరిపేయడానికి సినిమా ఉపయోగపడుతుందంటే హాస్యాస్పదంగా అనిపించింది.

అందుకే తను తీస్తానంటున్న బయోపిక్ నాకు ఏమాత్రం నచ్చలేదు. నా మౌనం అంగీకారం అని తను అనుకున్నాడు. తిరస్కారాన్ని తెలియజేయడం ఇష్టంలేక నేను ఊరకుండిపోయాను. వృత్తిపరమైన విషయాల్లో పరస్పర జోక్యాలు ఉండకూడదని పెళ్లినాటి ఒప్పందాన్ని మాత్రం గుర్తు చేయగలిగాను. జరిగిన కీలక ఘట్టాలు నేను చెబితేనే ప్రపంచానికి తెలుస్తాయని, దాన్ని జోక్యంలా భావించకూడదని తెలుసు. జరగనిది చెప్పి కథను రక్తి కట్టించలేను. పోనీ నిజాన్ని చెప్పి అగ్నిపరీక్షకు నిలబడలేను. తనకు కావలసింది శశి అర్ధాంతర మరణంలో తన ప్రమేయం లేదని ఘనంగా చాటుకొని, వేరెవరినన్నా దోషిగా ఎత్తి చూపడమేనా? దానికి కోట్ల రూపాయల ఖర్చు చేసి సినిమా తీయవలసిన అవసరం ఏముంది. ఓ ప్రెస్ మీట్ పెట్టేస్తే సరి. అదే అన్నాన్నేను. అలా చెప్తే నచ్చుతుందని నేనేమీ అనుకోలేదు.

అప్పటికే నా నిరాసక్తతతో విసిగిపోయాడేమో..., తను కోరింది కేవలం కథను డెవలప్ చేయడంలో సహాయమేనని, ఏం

చేయాలో, ఎలా చేయాలో సలహాలు కాదన్నాడు. కొత్తగా హద్దులు ఏర్పడుతున్నాయి. బాధగా ఉంది. ఆఫీసులో కథాచర్చలు జోరుగానే జరుగుతున్నాయి. యథార్థాలకు, వ్యక్తుల అనుభవాలు, కల్పితాలు జోడించి డ్రామాను నడిపేస్తే సరిపోతుందా? ఆ సంఘటనలతో ముడిపడి ఉన్న వ్యక్తుల భావోద్వేగాల సంగతేమిటి? బయోపిక్ పేరుతో బతుకును బజారుపాలు ఎందుకు చేసుకోవాలి?



మాలతి వస్తున్న అడుగుల చప్పుడు వినబడడంతో చదువుతున్న రిఫ్లెక్టివ్ జర్నల్‌ను పక్కన పెట్టేశాడు రవికాంత్.

"ఈరోజు తొందరగా వచ్చేశారే... ఎంతసేపయింది వచ్చి? నా టేబుల్ పై కూర్చున్నారేంటి కొత్తగా!" వస్తూనే అడిగింది.

"వచ్చే శుక్రవారం షూటింగ్ మొదలౌతుంది. రావడం వీలవుతుందా?" దారి మళ్ళించాడు.

"రాలేనంత బిజీగా ఏమీ లేను. కానీ రాలేను."

హ్యాండ్‌బ్యాగ్ టేబుల్‌పై పెట్టి, టవల్ తీసుకొని బాత్రూమ్‌లోకి వెళ్ళింది మాలతి. ఆ కంఠంలోని ఉదాసీనతను గమనించాడు రవికాంత్. ఇదేమీ కొత్త కాదు. చర్చను మరి పొడిగించలేదు. లేచి తన గది వైపు వెళ్ళాడు.

"అన్నీ నిజాలేనా..." భోజనాన్ని వడ్డిస్తూ అడిగింది.

"ఆ... నువ్వు సహకరించనప్పుడు నాకు తెలిసినవేగా నిజాలు!" ముభావంగా పలికాడు.

"నేను చెప్పే నిజాన్ని మీరు పరిగణించినా, మీ పాత్ర నిర్దోషిగానే మిగులుతుంది. కానీ శశి ఓ బలహీనమైన మనిషిగా మిగిలిపోతాడు. అది నాకు ఎంతమాత్రమూ ఇష్టంలేదు!" స్థిరంగా పలికింది.

"అదెలా...?" కుతూహలంగా అడిగాడు.

మౌనాన్ని ఆశ్రయించింది మాలతి. అయిష్టత, ప్రతిఘటన అడుగడుగునా ప్రదర్శిస్తోంది. ఇక అడగదలచుకోలేదు రవికాంత్. కానీ తన కోణం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువైంది. భోజనాన్ని ముగించి ఎవరి గదుల్లోకి వారు చేరుకున్నారు.

★★★

మరుసటి రోజు ఉదయం స్నేహితురాలి ఇంట్లో పెళ్ళికని వెళ్ళింది మాలతి. ఇదే అదనుగా అనుకున్నాడు రవికాంత్. ప్రొడక్షన్

మేనేజర్‌కి కాల్ చేసి, ఈరోజు ఉదయం జరగవలసిన ప్రొడక్షన్ మీటింగును మధ్యాహ్నానికి వాయిదా వేయమని చెప్పాడు. షూటింగుకు కావలసిన అనుమతుల విషయమై ఎంక్వయిరీ చేశాడు. దర్శకుడికి కాల్ చేసి జరుగుతున్న రిహార్సల్స్ గురించి వాకబు చేశాడు. ప్రొడక్షన్ లాజిస్టిక్స్‌కి సంబంధించిన కోఆర్డినేటర్‌తో మాట్లాడి అన్నీ సవ్యంగానే జరుగుతున్నాయని నిర్ధారించుకొన్నాడు.

మాలతి గదిలోకి వెళ్లి తను రాసే రిఫ్లెక్టివ్ జర్నల్‌ను చేతిలోకి తీసుకొని టేబుల్‌పై కూర్చొన్నాడు. చదవాలా...? వద్దా...? కొద్దిసేపు తటపటాయించాడు. కానీ కథను మెరుగుపరిచే ఈ అవకాశాన్ని వదులుకోదలచుకోలేదు. పుస్తకాన్ని తెరిచి ఒక్క క్షణం ఆగాడు. చేతిలో పేజీలు పేకముక్కల్లా గిర్రున తిరుగుతున్నాయి. నిన్న చదివిన 'నిజం' పేజీ దగ్గర ఆగాడు. అక్కడి నుండి మెల్లగా పేజీలు వెనక్కు తిప్పుతున్నాడు.

★★★

### ఓకే

చాలా రోజుల సంఘర్షణ తర్వాత రవికాంత్‌తో పెళ్ళికి ఓకే చెప్పాను. మరి లోకం మాటో... దానికెప్పుడో చెల్లు చీటీ ఇచ్చేశాను. మళ్ళీ సినిమావాళ్ళేనా... అనే సంశయం తప్పితే అమ్మకు కూడా అభ్యంతరం లేదు. కొన్ని షరతులకు లోబడి మాత్రమే పెళ్లి జరుగుతుందని ఖరాఖండీగానే చెప్పాను. నేను నడిపే రేడియంట్ రోసెస్ ఫ్లవర్ బిజినెస్ గురించి, ఒక ఫ్లోరిస్ట్‌గా నా వ్యాపార సమయాల గురించి, ఈవెంట్స్‌ను నిర్వహించే క్రమంలో ఇంటికి దూరంగా ఉండాల్సిన సందర్భాల గురించి వివరంగానే చెప్పాను. ఏమాత్రం జోక్యాన్ని సహించనన్నాను. అభ్యంతరం లేదన్నాడు. అలాగే తన సినిమా నిర్మాణాలలోగానీ, తను ఇంటికి కేటాయించే సమయాలలో గానీ నా జోక్యం ఉండదనీ చెప్పాను. తను చేసే ఖర్చులు, వ్యాపార లావాదేవీలు, పెట్టుబడులు వంటివన్నీ నాకు తెలిసే జరగాలని అన్నాను. బ్యాంకు ఖాతాలు, ఇతర ఆర్థిక కార్యకలాపాలు అన్నీ ఉమ్మడి నిర్వహణలోకి రావాలని చెప్పాను. గతం తాలూకు భయాలు నన్ను ఇంతటి కఠిన నిబంధనలకు పురికొల్పినా, రెండు క్షణాల్లో తను ఓకే చేయడం ఆశ్చర్యంగానే అనిపించింది. కేవలం జాలితోనో, శశి మరణంలో తన తప్పు లేదని నిరూపించే సాకుతోనో నన్ను చేరలేదనే నా నమ్మకానికి బలం చేకూరింది.

పేజీలు వెనక్కు తిప్పుతూ ఒక చోట ఆగాడు.

★★★

### కుట్ర

అమ్మ సంబంధాలు చూస్తోంది. తెలిసిన వాళ్ళ ద్వారా రవికాంత్ గురించి అమ్మకు తెలిసింది. వయసు నలభై పైమాటే. ఇద్దరికీ ఎనిమిదేళ్ళ వ్యత్యాసం. సందేహిస్తూనే ప్రస్తావన తెచ్చింది. అదేమీ సమస్యగా అనిపించలేదు నాకు. ఈ కొద్ది రోజుల పరిచయంతో తనపై సదభిప్రాయమే ఉన్నా, శశి విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఈ మనిషిని నేను చేసుకొని జనాలు వేసే ప్రశ్నలకు జవాబులు ఇవ్వగలనా? నేను ఆలోచిస్తున్నది లోకం కోసమేనా? మరేదైనా అనుమానం ఉందా? మధ్యవర్తి ద్వారా యాదృచ్ఛికంగానే ఈ సంబంధం వచ్చిందా...? ఏదైనా కుట్ర కోణం దాగి ఉందా...? ఈ విషయంలో స్పష్టత వస్తేగానీ అడుగు ముందుకు వేయలేనేమో...!

హూ... నిట్టూర్చాడు. ఇంకొన్ని పేజీలు వెనక్కు వెళ్ళాయి.

★★★

## రాపో

ఓ నిర్మాత ఇంట్లో పెళ్ళికి ఈవెంట్ చేయడానికి ఒప్పుకున్నాను. అక్కడ మొదటిసారి రవికాంత్ తారసపడ్డాడు. తనే మొదట మాటలు కలిపాడు. నేను చేస్తున్న ఈవెంట్స్ గురించి వాకబు చేశాడు. శశి విషయంలో నేను తనకిచ్చిన కితాబు పట్ల కృతజ్ఞత వ్యక్తం చేశాడు. నేనెవరి మెప్పునూ పొందేందుకు ఆ పని చేయలేదు కదా! అదే చెప్పాను. అయినా అది ఈరోజుల్లో ఊహించలేమని అన్నాడు. అ తర్వాత కొన్నిసార్లు తనే రేడియంట్ రోసెస్‌కి రావడం, తనద్వారా కొన్ని ఈవెంట్స్ కుదరడం... రాపో ఎక్కువైంది. యాదృచ్ఛికంగా కలుస్తున్నాడా? మరేదైనా ఉద్దేశమా?

మరికొన్ని పేజీలు తిరిగాయి.

★★★

## హిట్

చివరకు ప్రెస్‌మీట్ పెట్టేందుకే నిశ్చయించుకొన్నాను. అందరూ నేనేదో సంచలన విషయాలు బయట పెట్టేస్తాననే ఎదురు చూశారు. వాళ్ళ ఆశలపై నేను నీళ్ళు చల్లేశాను. నటి ఉమశ్రీతో శశికి ఉన్న సంబంధాల విషయమై ప్రశ్నలు సంధించారు. అవన్నీ పుకార్లే అని కొట్టి పారేశాను. ఉమశ్రీకి కొన్న నగల సంగతి అడిగారు. తీసుకొన్న బాకీ చెల్లించాడని చెప్పాను. రవికాంత్ తీయాల్సిన సినిమా ఆగిపోవడం, అడ్వాన్సు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడం గురించి అడిగారు. ఊహించలేనన్ని ప్రశ్నలు. నాలాంటి సామాన్యురాలికి వీటిని ఎదుర్కోవడం సాధ్యమా? తారలు నటించిన సినిమాలు తెరలపై వెలగడమే కాదు, వారి జీవితాలు కూడా తెరల మధ్యలోనే ఉండాలని, అవి తొలగిన ప్రతిసారీ లోపలికి చొరబడాలని విఫలయత్నాలు జరుగుతున్నాయి.

ఎవరైనా సినిమా ఎందుకు తీస్తారు? దేశసేవ కోసం కాదు కదా... సినిమా తీస్తే లాభం వస్తుందనే కదా. శశికిరణ్ మంచి హిట్ సినిమాల జోరు మీదున్నప్పుడు రవికాంత్ అడ్వాన్సు ఇచ్చాడు. సినిమా మొదలయ్యేసరికి శశి మార్కెట్ గ్రాఫ్ పడిపోతోంది. అప్పుడున్న పరిస్థితుల్లో హై బడ్జెట్ సినిమా ఆర్థికంగా తనకు వర్క్ అవుట్ కాదు. ఇవన్నీ చెబితే విని రాసుకొనే ఆసక్తి వారికి ఉంటుందా...? నిర్మాతను వెనకేసుకురావడంలోని అంతర్యం ఏమిటని కొత్త లాజిక్కులు వెదుకుతారు. అవసరమా...! రవికాంత్‌గారి తప్పేమీ లేదని మాత్రం చెప్పగలిగాను.

ఇప్పుడు మానసికంగా బలహీనంగా ఉన్నానని, ఓ ఆర్నెల్ల తర్వాత వచ్చి అడిగితే అన్నీ వివరంగా చెప్తానని అన్నాను. అందరూ మూకుమ్మడిగా గయ్యిమన్నారు. ఆర్నెల్ల తర్వాత ఈ విషయంపై ఆసక్తి ఎవరికి ఉంటుందన్నారు. ఆరు దశాబ్దాలైనా నేను పడిన బాధను మర్చిపోలేనని అన్నాను. అయినా నా పిచ్చి గానీ... తొంగి వినోదం చూడడమే కానీ, బాధను పంచుకొనే అవసరం ఎవరికుంటుంది. భ్రమలు తొలగిపోయాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఏమీ చెప్పకూడదని నిశ్చయించుకొన్నాను.

★★★

## వేట

వర్ధమాన నటుడు శశికిరణ్ ఆత్మహత్య అంటూ మీడియా హోరెత్తిస్తోంది. ఎవరి కారణాలు వాళ్ళు వెతుక్కొనే పనిలో పడ్డారు. ఉమశ్రీతో శశి సంబంధాలు... నిర్మాత రవికాంత్ శశితో తీయాల్సిన సినిమా ఆగిపోవడం... చేతిలో అవకాశాలు లేకపోవడం... చేసిన అప్పులు... ఇతర ఆర్థిక ఇబ్బందులు... మద్యానికి బానిస కావడం... ఇత్యాది అంశాలపై టీవీల్లో డిబేట్లు

మొదలయ్యాయి. మేధావులంతా కలిసి, భార్యగా నాకు కలిగిన వ్యధ కంటే ఎక్కువ బాధను ప్రదర్శిస్తున్నారు. అత్తగారింటి వైపు నుండి ఒత్తిళ్ళు లేవు. అదొకటే సానుకూలాంశం. మనిషి లేని లోటు ఒకవైపు, ఇంటర్వ్యూల కోసం మీడియా వేధింపులు మరోవైపు. మనసు కుదురుగా ఏమీలేదు. ఒక్కసారి డేగ కళ్ళకు దొరికామా... ఇక అంతే సంగతులు. మరో వేట దొరికే వరకూ మనమే ఆహారం.

అసలు శశి, మాలతిల మధ్య ఏమైనా ఘర్షణ జరిగిందా ...? పేజీలు వేగంగా వెనక్కు తిప్పుతున్నాడు.

★★★

## శూన్యం

శశి రెండ్రోజులనుండీ ఇల్లు కదలలేదు. ఒకటే తాగడం. రవికాంత్ బ్యానర్‌లో చేయవలసిన సినిమా ఆగిపోయింది. శశి మార్కెట్ కన్నా బడ్జెట్ ఎక్కువైపోతోందని, కాబట్టి ఇప్పుడు ఆపేసి ఇంకొక లోబడ్జెట్ కథ దొరికేవరకూ వెయిట్ చేద్దామని అన్నారట. అసలు అంత గొప్ప కథతో వెళ్తే మార్కెట్ అదే అవుతుంది కదా అంటాడు శశి. ఎదగనీయకుండా చేస్తున్నారని ఉక్రోషం. తట్టుకోలేకపోయాడు. ఉవ్వెత్తున తారాజువ్వలా ఎగసి అక్కడ ఉండే మెరుపులే శాశ్వతమనుకొని భ్రమసి, అర్ధాంతరంగా తనువు చాలించాడు. తను నింగికెగసి, నన్ను శూన్యంలోకి నెట్టేశాడు. లక్షల మంది సినిమా మీద బతికేస్తున్నారు. పరిస్థితులకు తగినట్లుగా తను మారలేకపోయాడు. సినీతార అంటే పైనుండి ఊడిపడ్డాడని అహంకారమా? తనూ మనిషే అని తెలుసుకోలేని మూర్ఖత్వమా? ఏడుపు రావాల్సిన సమయంలో, కనబడితే చంపేయాలన్న కోపమొస్తోంది. ఆ క్షణంలో మాలతి మానసిక పరిస్థితిని తలచుకోగానే ఒళ్ళు జలదరిచింది. కొద్దిసేపు విరామం ఇచ్చి మళ్ళీ పేజీలను తిప్పడం మొదలు పెట్టాడు. రిఫ్లెక్షన్‌కు మాలతి పెట్టిన పేర్లనుబట్టి ఆగుతున్నాడు.

★★★

## డబ్బు

రోజూ కొన్ని వేలమంది సినిమా అవకాశాల కోసం రాజధాని నగరాలకు తరలిపోతారు. ది బెస్ట్ లైట్ బాయ్‌గా స్థిర పడదాం అని ఎవరూ రారు. ఈ ప్రపంచం మెచ్చే జూనియర్ ఆర్టిస్ట్ అయిపోదాం అని ఎవరూ కోరుకోరు. అందరి లక్ష్యం ఒక్కటే. గొప్ప డైరెక్టర్ అయిపోవాలనో... పెద్ద స్టార్ అయిపోవాలనో... తప్పు పట్టలేం! కానీ అందరికీ అవకాశాలు రావు. వేల మంది కుళాయిల్లో నీళ్ళు తాగి పడుకొంటే, ఎక్కడో ఒకరికి పరమాన్నం దొరుకుతుంది. ఎంత పేరు వస్తే అంత డబ్బు. గొప్ప డైరెక్టర్, పెద్ద స్టార్ అయిన వారెవరూ కష్టాల్లో ఉన్న నిర్మాతకు ఫ్రీగా సినిమా చేసిపెట్టరుగా! తమకు నచ్చిన రంగం నుండే అయినా డబ్బే కదా పరమావధి. వచ్చే అవకాశాల్ని బట్టే కదా డబ్బు. మరి ఈ స్థిరత్వం లేని డబ్బుపై ఆధారపడినప్పుడు, ఎంత జాగ్రత్తగా ఉండాలి. తనకు ఆ ఆలోచన లేదు. చెప్తే చెవికెక్కడంలేదు. ఏదో అద్భుతమే జరగాలి.

ఓ పేరు ఆసక్తిగా అనిపించింది. చదవడం మొదలు పెట్టాడు.

★★★

## చెత్త

శశికి బొత్తిగా అవకాశాలు రావడంలేదు. చేతిలో డబ్బులు ఆడడం లేదు. ఖర్చులకు కష్టం అయిపోతోంది. ఉండే విల్లా కిరాయి నెలకు రెండున్నర లక్షలు. పార్టీలు, పబ్బులు, మద్యం, మత్తు పదార్థాలు ఏవీ వదులుకోవడం లేదు. వాటి ఖర్చుకు అంతే లేదు.

అప్పులు పెరిగిపోతున్నాయి. తనకు అవకాశాలు రాకుండా ఇండస్ట్రీలోని కొద్ది మంది పెద్దలు కుట్ర పన్నుతున్నారని అంటాడు. పోనీ అలానే అనుకున్నా, ఇన్ని వందల నిర్మాణాలలో వాళ్ళు ఎన్నని ఆపగలరు. అవకాశం వస్తే ప్రతిభ! రాకపోతే కుట్ర! పసలేని చెత్త వాదం కాక మరేమిటి...! విలన్ పాత్రకైనా, సెకండ్ హీరో వేషానికైనా ఒప్పుకోమన్నాను. చస్తే కుదరదన్నాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. ఇల్లు మారదామని చెప్పాను. అవమానం అన్నాడు. బతుకు గాడి తప్పుతోంది.

చదివిన పేజీలను ఒక్కసారి ముందు నుండి వెనుకకు కాలక్రమం ప్రకారం మళ్ళీ చదివాడు.

జర్నల్ ను మూసేశాడు. ప్రతి రిఫ్లెక్షన్ లోనూ అంతులేని లోతు. కళ్ళుమూసుకొని దీర్ఘంగా నిట్టూర్చాడు. సమయం చూసుకున్నాడు. మధ్యాహ్నం మీటింగ్‌కు సమయం అవుతోంది. ప్రొడక్షన్ మేనేజర్‌కు కాల్ చేసి మీటింగ్ వాయిదా వేయమన్నాడు. మాలతికి ఫోన్ చేశాడు. లేట్ అవుతుందని చెప్పింది. ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

సాయంత్రం మాలతి ఇంటికి చేరగానే కాఫీ కలుపుకొచ్చి, ఒకటి తన చేతికిచ్చి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చొని సిప్ చేయడం మొదలు పెట్టాడు.

"ఇంత కీలక సమయంలో ఇంటిపట్టునే ఉన్నారు. ఎందుకో తెలుసుకోవచ్చా...?" కాఫీ సిప్ చేస్తూ అడిగింది.

"శశి బయోపిక్ ఆపేస్తున్నాను." మాలతి కళ్ళలోకి చూస్తూ చెప్పాడు.

"...." కళ్ళతోనే కారణాన్ని అడిగింది.

"బికాజ్, యువర్ ఫీలింగ్స్ ఆర్ వాల్యూడ్."

"అర్థం కాలేదు."

"నువ్వు నన్ను క్షమించాలి. నేను నీ జర్నల్ చదివాను. కేవలం నీ ఆలోచనలు తెలుసుకొనేందుకే! మరే దురుద్దేశమూ లేదు. సినిమాలో నీ కోణాన్ని పూర్తిగా ఆవిష్కరిస్తే, మన పాత్రలు మాత్రమే ఉదాత్తమైనవిగా కనబడతాయి. శశి పాత్ర మొత్తం బలహీనమౌతుంది. అప్పుడు బయోపిక్ అర్థమే లేకుండా పోతుంది. ఇంకో సంగతి. ఒక గొప్ప సినిమాగా మిగులుతుందని 'శశి' బయోపిక్ అనుకున్నాను గానీ, నేను గొప్పగా కనబడాలనే కుట్ర కోణం ఏమీ లేదు. శశి చేసింది దిద్దుకోలేని పొరపాటైనా, వ్యక్తిగత జీవితంలో నువ్వు పాటించిన గోప్యతకు గౌరవమిస్తూ సినిమాను ఆపేస్తున్నాను." నవ్వుతూ చెప్పాడు.

"థాంక్ యు వెరీ మచ్" కళ్ళలో నీళ్ళు తిరిగాయి మాలతికి. తననే చూస్తూ ఉండిపోయాడు రవికాంత్.

**పత్రికా నిర్వహణ, పత్రికలో ప్రచురిస్తున్న కథల గురించి మీ అమూల్య అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం. స్పందించండి. మీ స్పందన మాలో నూతనోత్సాహాలను నింపుతుంది. మీ స్పందన కొత్త కలాలకు దీవెన.**



9393129945




# నానాటి బ్రతుకు!

డా. ఎమ్. సుగుణరావు

## రచయిత పరిచయం

*డాక్టర్ ఎమ్. సుగుణరావుగారి స్వస్థలం నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, స్థిరపడింది మాత్రం విశాఖపట్నంలోనే! వెటర్నరీ సైన్సులో మాస్టర్స్ డిగ్రీ చేసిన డా. సుగుణరావు గారు, భారత ప్రభుత్వరంగ బీమా సంస్థ నుండి సీనియర్ డివిజనల్ మేనేజర్ స్థాయి అధికారిగా పదవీ విరమణ చేశారు. దాదాపు ముప్పయ్యేళ్ళుగా రాస్తున్న డా. సుగుణరావుగారు, ఇప్పటి వరకు దాదాపు మూడొందల పాతిక పైగా కథలు, పలు నవలలు రాసారు. అందులో నూరు కతలకి బహుమతులు వచ్చాయి. అలా బహుమతులు పొందిన కథలలో "నానాటి బ్రతుకు" కథ నూట ఒకటో కథ అని చెప్పాలి. దాదాపు అన్ని పత్రికలలో వీరి కథలు ప్రచురితమయ్యాయి. వీరి కథలతో నాలుగు కథా సంపుటాలు విడుదల అయ్యాయి. 'ఉపాధ్యాయ' మాసపత్రికలో బహుమతి పొందిన వీరి కథ "ఆకాశంలో ఒక నక్షత్రం" ఇండియన్ ఎన్‌సాంబుల్ ద్వారా ఇంగ్లీషు నాటకంగా రూపుదిద్దికుంది. బొంబాయిలో జరిగిన 'టాటా ఫెస్ట్' అంతర్జాతీయ స్థాయి ఇంగ్లీష్ నాటకాల పోటీలలో లక్ష రూపాయల బహుమతి పొందింది. ఎన్నో పురస్కారాలు కూడా అందుకున్న డా. సుగుణరావు గారి కతలపై పలువురు పరిశోధనలు చేసి "డాక్టరేట్" లు పొందారు.*

***'నానాటి బతుకు నాటకము కానక కన్నది కైవల్యము***
***పుట్టుటయు నిజము పోవుటయు నిజము***
***నట్టనడి నీ పని నాటకము ఎట్టనెదుట గలది ప్రపంచము***
***కట్ట కడపటిది కైవల్యము!'***
***ఆ పాట వింటోన్న వేదనాయకం మొహంలో ఏదో వెలుగు.***

వేదనాయకం, మనసులో ఆనంద తరంగం నాట్యం చేస్తున్నట్టుగా ఉంది. గాలిలో తేలినట్టుగా కూడా ఉంది. ఇది ఎవరికీ పట్టని అదృష్టం. పైగా సాధ్యం కూడా కాదు. తన చావు తాను చూసుకుంటున్నాడు. తన అంతిమ క్రియలను వీక్షిస్తున్నాడు. తన కళ్ల ముందే అవన్నీ జరుగుతున్నాయి.

తనను కర్రల మీద పడుకోబెట్టారు. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. తన దేహానికి స్నానం చేయించారు. శుభ్రమైన తెల్లటి పంచె కట్టారు. తనను పడుకోబెట్టిన దిక్కు మార్చారు. కొడుకు... చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. నిప్పుల కుండతో ముందుకు నడిచాడు. స్మశానవాటికలో తనను కట్టెల మీద ఉంచిన తర్వాత, కొడుకు తన చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేసాడు. వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు నడిచిన కొడుకు, నీటికుండ బద్దలు చేశాడు. అది ఆత్మ, శరీరంతో విడిపోవడానికి సంకేతమట!

చుట్టూ ఉన్న మనుష్యులు డబ్బులు, పువ్వులు, బొరుగులు వెదజల్లుతున్నారు. ఆత్మ తిరిగి తనవాళ్లను చూడడం కోసం

రావాలంటే వాటిని వెతుక్కుని రావాలట! అది సూర్యోదయం లోపే జరగాలట. అదే నీటికుండ బద్దలు కొట్టడం వెనుక ఉన్న సాంప్రదాయం. ఇంతలో చితికి నిప్పు అంటించేందుకు కొడుకు కాలిన కట్టెను అందుకున్నాడు.

అంతే... ''కట్'' అన్నాడు డైరెక్టర్. కట్టెల మీద పడుకోబెట్టిన తనను బైటికి దించారు.

''జీవించేసారు'' అన్నాడు డైరెక్టర్ చప్పట్లు కొట్టి.

ఒక్కసారి నవ్వుకున్నాడు. చావు సీనులో జీవించడమేమిటో! తను చేసిందేముంది? కళ్లు మూసుకొని పడుకున్నాడు. తను చనిపోయిన తర్వాత ఎలాగూ ఈ దృశ్యం చూడలేడన్న ఆనందంతో తను ఉబ్బితబ్బిబ్బయ్యాడు.



వేదనాయకం నడుచుకుంటూ వచ్చి ఆ షూటింగ్ స్పాట్‌లో డైరెక్టర్ పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. తన అటెండెంటు పరుగెత్తుకుని వచ్చి గొడుగు పట్టాడు. అప్పటికే మధ్యాహ్నం మూడు అయ్యింది. ఇంకా ఎండపొడ గట్టిగానే ఉంది. కొడుకు వేషం వేసుకొన్న వ్యక్తి చితికి నిప్పు అంటించాడు. కాలుతోన్న చితిని కెమెరామెన్ చిత్రీకరిస్తున్నాడు. ఆ దృశ్యం చూస్తోన్న వేదనాయకం కళ్లల్లో నీళ్ళు సుడులుగా తిరిగాయి. అంతవరకు ఆనందపడిన మనసు నిర్లిప్తంగా, నిరాసక్తంగా అయిపోయింది. మనసులో భయం నీడ. తను రేపొద్దున్న చనిపోయినపుడు అలాగే కాలిపోతాడేమో! కళ్లు మూసుకొని ఆలోచనలో పడ్డాడు.

''ఏంటి సార్, ఆలోచిస్తున్నారు. ఇంకా మూడ్‌లోంచి బైటికి రాలేదా? ఇంకా సీన్‌లోనే ఉన్నారా?'' అన్నాడు డైరెక్టర్.

''అబ్బే... అదేం లేదు'' అంటూ చిన్నగా నవ్వాడు.

''సినిమా బాగా వస్తోందండి. మీరు వున్న సీన్‌లు అన్నీ బాగా కుదిరాయి. అయితే ఐసియులో మీరు చనిపోయే ఆఖరి క్షణాలలో ఆ ఫీల్ సరిగ్గా ఫోకస్ అవలేదేమో అని చిన్న అనుమానం...'' అన్నాడు.

''అవునా...!'' అన్నాడు వేదనాయకం.

''అవునండీ. ఆ ఐసియు సీన్, సినిమాలో చాలా కీలకం. చనిపోయే ఆఖరి క్షణాల్లో మీ కళ్లలో వెలుగు కనిపించాలి. జీవనసాఫల్యం సిద్ధించింది అనే సంతృప్తి మొహంలో కదలాడాలి'' అంటూ ఆ డైరెక్టర్ చాలా విషయాలు చెప్పాడు. వేదనాయకం ఆలోచనలో పడ్డాడు.

ఒక్కసారి తన ఇరవై ఏళ్ల సినీ జీవితం మనసులో మెదిలింది. 'నలభై ఏళ్ల వయసులో సినీరంగంలో అడుగు పెట్టాడు. ఒక ఎక్స్‌ట్రా నటుడిగా సినీ జీవితం మొదలైంది. ఆ తర్వాత చిన్న చిన్న పాత్రలు. పొలంలో పని చేసే రైతుకూలీలలో ఒకడిగా, సమ్మె చేసే ఉద్యమకారుల్లో గొంతెత్తి అరిచే ఆవేశపరుడిలా, హీరోను వెంట తరిమే రౌడీమూకల గుంపులో ఒకడిగా... ఇలా ఒక్కొక్క పాత్ర వేసుకుంటూ ఇప్పటికి ఒక ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా స్థిరపడ్డాడు.

డబ్బు, కీర్తిప్రతిష్ఠలు, సినిమారంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం తనకు ఈ కళామతల్లి ఇచ్చింది. తను ఎక్కువగా 'టేక్'లు తీసుకోడు. రంగస్థలం మీద ఉన్న అనుభవంతో తను దృశ్యాలను అలవోకగా రక్తి కట్టిస్తాడనే అందరూ అనుకుంటారు. అలాంటిది ఈ డైరెక్టర్ తన చేసిన ఆ దృశ్యం సంతృప్తికరంగా రాలేదని చెబుతున్నాడు. ఏమైందో?! తను డైరెక్టర్ సంతృప్తి మేరకు నటించాలి. అది తన బాధ్యత...' అనుకుంటూ...

''మీ ఇష్టం.. మరోసారి ఆ సీన్ చేద్దాం'' అన్నాడు.

అంతలో తన కేర్వాన్ వచ్చి ఆగింది. ''ఓకే సార్. నమస్కారం'' అన్నాడు డైరెక్టర్.

గొడుగు పట్టుకొన్న అటెండెంట్ తన బ్యాగు తీసుకొని వాహనంలో పెట్టాడు. డ్రైవరు వాహనం ముందుకు పోనిచ్చాడు.

ఐదు నిమిషాల్లో ఆ వాహనం అక్కడికి దగ్గరలో ఉన్న ఒక భవంతి చేరుకుంది. వాహనం ఆగగానే 'తాతయ్యా' అంటూ పరుగెత్తుకొచ్చింది ఐదేళ్ల అమ్మాయి. ఆ పాపను ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు వేదనాయకం. ఇంటి లోపలికి వెళ్లగానే చిన్నపిల్లలు ఇద్దరు ముగ్గురు చుట్టుముట్టారు. వాళ్లందరికీ జేబులోంచి చాక్లెట్లు తీసి ఇచ్చాడు. ఎదురుగా ఆ గదిలో నిలువెత్తు ఫోటోలో ఉన్న తండ్రిగారికి నమస్కారం చేసాడు. భార్య మంచినీళ్ల గ్లాసుతో ఎదురువచ్చింది. ఆ హాలులోనే కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు.

''భోంచేద్దాం పదండి'' అన్నాడు వేదనాయకం.

అందరూ ఆ డైనింగ్ టేబుల్ దగ్గరకు కదిలారు. నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ వారి భోజనం ముగిసింది.

''ఓకే... కట్'' అన్నాడు డైరెక్టర్.

వేదనాయకం స్మశానంలో షూటింగ్ తర్వాత వేరే సినిమాలో, ఆ షూటింగ్ పార్ట్ ముగించుకొని వచ్చి కారులో కూర్చున్నాడు.

డైరెక్టర్ ''చాలా బాగా వచ్చింది సార్ షాట్'' అంటూ చెయ్యి ఊపాడు.

కార్వాన్‌లో కూర్చున్న వేదనాయకం మనసులో ఆలోచనలు సుడులుగా తిరుగుతున్నాయి. తనకు సినిమాల్లో అన్నీ మంచి పాత్రలే! మంచి భర్త, మంచి తండ్రి, మంచి కొడుకు.... వీటితో పాటు సిన్సియర్ పోలీస్ ఆఫీసర్. పేదల పక్షాన న్యాయానికి నిలబడే ఒక లాయర్... ఇలా తన సినీ జీవితంలో అన్నీ తనకు ఉత్తమ పాత్రలే లభించాయి. మరి వాస్తవ జీవితంలోకి వస్తే?

మనసులో ఏదో న్యూనతాభావం. తెర ముందు ఉత్తమ పురుషుడు. తెర వెనుక తన పరిస్థితి ఏమిటి? ఇల్లు గుర్తుకొచ్చింది. తను కుటుంబానికి దూరంగా ఉంటాడు. అప్పుడప్పుడు మనసు పుట్టినప్పుడు ఇంటికి వెళ్తాడు. అదీ నెలకో రెండు నెలలకో ఒకసారి. ఇంట్లోవాళ్లకు కావలసిన వసతి సౌకర్యాలతో పెద్ద భవంతి కట్టించాడు. కొడుకును, కూతురును పై చదువుల కోసం అమెరికా పంపాడు. ఇంట్లో అమ్మా, నాన్న, భార్య, వ్యాపారం చేసే తమ్ముడు, వారి కుటుంబం అంతా కలిసే ఉంటారు. తను మాత్రం దూరంగా!

తను సినిమా వేషాల కోసం ఎన్నో ప్రయత్నాలు చేసి, ఈ అద్భుతమైన సినిమా ప్రపంచంలో గుర్తింపు తెచ్చుకున్నాడు. కీర్తి, అంతస్తు, ఆస్తులు పెరిగాయి. దాంతో పాటు రక్తసంబంధీకులతో, భార్యాబిడ్డలతో కూడా సంబంధం తెగిపోయింది. పిల్లలు ఏం చదివారో, ఏమిటో తనకు తెలియదు. మొత్తం భార్యయే చూసుకుంటుంది. అమ్మా నాన్నల బాగోగులు కూడా.... అలా ఆలోచనలో ఉంటూనే తన గెస్ట్‌హౌస్ చేరుకున్నాడు.

కార్వాన్ నడిపే డ్రైవర్, అటెండెంట్ నమస్కారం చేసి వాహనాన్ని తన ఫామ్‌హౌస్‌లోని పార్కింగ్ ఏరియాలో ఉంచి వెళ్లిపోయారు.

లోపలికెళ్లిన వేదనాయకం మనసులో ఏదో గుబులు. అంతకుముందు తను చేసిన సన్నివేశం గుర్తుకొచ్చింది. ఆ సీన్‌లో ఇంటి లోపలికి వెళ్లగానే చుట్టుముట్టిన పిల్లలు, ఆప్యాయంగా ఎదురువచ్చిన భార్య! తనెందుకు మనుష్యులకు దూరం అవుతున్నాడు? ఏం సాధిద్దామని? అనుకున్నాడు. సినిమాల్లో అవకాశాలు వస్తూండేసరికి కుటుంబానికి, తనకు దూరం పెరిగింది. దాంతో పాటు అహం. తనకు వచ్చిన అవార్డులు, రివార్డులు, పాపులారిటీ... వ్యసనాలు.

సోఫా మీద కూర్చోగానే ఎదురుగా ఉన్న అద్దాల బీరువాలో విదేశీ, స్వదేశీ కంపెనీల మద్యం సీసాలు కనిపించాయి. అవే తన ఈ ఒంటరి జీవితంలో నేస్తాలు అనుకున్నాడు.

సోఫాలో వెనక్కి వాలి యూ`ట్యూబ్‌లో వచ్చిన మెసేజ్‌లు చూస్తున్నాడు. అలాంటివి తప్పనిసరి చూడడం. తనొక పబ్లిక్ ఫిగర్ ఇప్పుడు. తన గురించి ఎవరు ఏం అనుకుంటున్నారో అనేది తెలుసుకోవడం తనకు ముఖ్యం. తన గురించి ఎప్పుడూ పొగుడుతూనే ఉంటారు. ఆ ఉద్దేశ్యంతోటే యూట్యూబ్‌లో వస్తోన్న ఇంటర్వ్యూలు చూస్తూ అలా ఉండిపోయాడు. తనతో నటించిన ఆమెతో ఇంటర్వ్యూ. ఆ ఇంటర్వ్యూ చూడడం కోసం ఆ లింక్ ఓపెన్ చేసాడు. ఇంటర్వ్యూ నిర్వహించే యాంకర్ ఆమెను ప్రశ్నిస్తోంది.

''అమ్మా! మీరు చాలా మంది హీరోలకు, విలన్లకు, క్యారెక్టర్ ఆర్టిస్టులకు తల్లి పాత్ర పోషించారు కదా. ఆ పాత్రలలో మీరు జీవిస్తారు. మీకు కొడుకులుగా వేసిన ఆ పాత్రధారులు కూడా మిమ్మల్ని బాగా చూసుకుంటారు, సన్నివేశాలలో మిమ్మల్ని అందలం ఎక్కిస్తారు, మీకు ప్రాణాలు సైతం అర్పించేవారిగా కనబడతారు. మరి స్క్రీన్ బైట వాళ్లు ఎలా ఉంటారు? అంతే అభిమానిస్తారా? మిమ్మల్ని తల్లిగానే గౌరవిస్తారా?'' అంది యాంకర్.

ఆ మాటలకు తల్లి పాత్రను పోషించే ఆ తార గట్టిగా నవ్వి, ''అది పాత్రలకే పరిమితం. డైరెక్టర్ చెప్పిన సీన్ పూర్తి చేయగానే కట్... కట్... ఎవరికి వారే యమునాతీరే. దీనికి చాలా ఉదాహరణలు... ఆ మధ్య నాకు జబ్బుచేసి మెసేజ్ పెడితే, అందుబాటులోకి వచ్చిన ఒక క్యారెక్టర్ ఆర్టిస్టు నుంచి ఏ స్పందనా లేదు. సినిమాల్లో అతనికి నేను తల్లిగా నటించాను. అతను చాలాసార్లు సినిమాల్లో నాకు రక్తదానం చేస్తాడు. నా కోసం విలన్లతో తలపడతాడు. కానీ వాస్తవానికి వచ్చేసరికి నిజ జీవితంలో అతను నాకు ఎటువంటి సాయం చేయలేదు. అలా ఉంటాయి సినిమావాళ్ల వ్యక్తిత్వాలు!'' అంది ఆవిడ.

ఒక్కసారి వేదనాయకం ఆ మాటలకు అదిరిపడ్డాడు. ఆ తల్లి పాత్రలు వేసే ఆవిడ చాలా సినిమాల్లో తనకు తల్లిగా నటించింది. తమ ఇద్దరినీ నిజమైన తల్లీ కొడుకులుగా భావిస్తారు. కానీ ఆరోజు ఆమె ఆస్పత్రి పాలైనప్పుడు తను ఏమీ స్పందించలేదు. ఆమె తన పేరు చెప్పకపోయినా తన వ్యక్తిత్వాన్ని నలుగురు ముందు నిలబెట్టింది! ఆ బాధకు గురైన వేదనాయకం మనసు కాసేపు మొద్దుబారిపోయింది. క్షణం ఆలోచనల తర్వాత అనిపించింది.

అది నిజమే కదా! తను అలా చేయకుండా ఉండవలసింది. తనలో తాను మథనపడ్డాడు. అలా ఆలోచనలోనే సోఫాలో వెనక్కి వాలాడు. అంతలో ఫోన్ మోగింది.

తమ్ముడి నుంచి ఫోన్. ''అన్నయ్యా! నాన్నగారికి ఎనభై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వెయ్యి పున్నమిల నోము నోస్తున్నాము. నీకు వీలవుతుందో లేదో. నువ్వు వస్తే సంతోషం. అమెరికా నుంచి మీ అబ్బాయి, అమ్మాయి కూడా వస్తున్నారు. బంధువులు అంతా కలుస్తాం. నువ్వు ఇబ్బంది పడవద్దు. షూటింగ్‌లతో బిజీగా వుంటే ఫర్వాలేదు!'' అన్నాడు.

ఆ మాటలకు ''సరే చూస్తాను'' అంటూ ఫోన్ పెట్టేసాడు వేదనాయకం.

ఒకసారి ఆలోచనలో పడ్డాడు. భార్య నుంచి ఫోన్ రాలేదు. తనతో మాట్లాడడానికి ఆమెకు భయం. అలాగే కొడుకు, కూతురు కూడా ఎప్పుడూ ఫోన్ చేయరు. ఫోన్ చేసినా పొడిపొడి మాటలే. అమ్మా నాన్నలను చూసి కూడా చాలా రోజులయ్యింది. సోఫా మీద నుంచి లేచి గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఆలోచనలు సుడులుగా తిరుగుతున్నాయి. పావుగంట తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాడు. వెంటనే భార్యకు ఫోన్ చేసాడు. వెంటనే ఫోన్ ఎత్తింది.

''ఏమైంది?'' అంది కంగారుగా. ఎప్పుడూ ఫోన్ చేయని భర్త అలా ఫోన్ చేస్తే ఆమెకు గాభరాగానే ఉంటుంది.

''ఏమీ లేదు. నాన్నగారి వెయ్యి పున్నమిల నోము ఇక్కడే చేద్దాం. ఆ ఏర్పాట్లు అన్నీ నేను చేస్తాను. మీరంతా ఒక వారం ముందు వచ్చేయండి!'' అన్నాడు.

భార్య క్షణం సేపు మాట్లాడలేదు. భర్త చెబుతున్నది నిజమా అబద్ధమా అనే మీమాంసలో ఉండిపోయింది. ఆ తర్వాత అంది.'
'మీకు ఎందుకు ఇబ్బంది, మన ఊళ్లో చేద్దాం. అందరూ ఇక్కడే ఉన్నారు కదా!'' అంది.

''లేదు, అందర్నీ బస్సులో రప్పిద్దాం. నా ఫామ్‌హౌస్ కూడా సదుపాయంగానే ఉంటుంది!'' అన్నాడు.

''సరే'' అంటూ ఫోన్ పెట్టేసింది.

ఆ తర్వాత తమ్ముడికి, అమ్మా నాన్నలకు ఫోన్ చేసాడు. వాళ్లూ ఆశ్చర్యంగానే స్పందించారు.

ఇక ఆ క్షణం నుంచి పనులు మొదలుపెట్టాడు వేదనాయకం. తనకు తెలిసిన ఈవెంట్ మేనేజర్‌కు ఫోన్ చేసాడు. తన ఫామ్ హౌస్‌లోని విశాలమైన ఆవరణలో గబగబా ఏర్పాట్లు మొదలయ్యాయి. తాటాకులతో పందిరి వేసారు. తోరణాలు కట్టారు. రకరకాల పువ్వులతో అలంకరణ చేసారు. వారం రోజుల్లో కుటుంబం అంతా వచ్చింది. వేదనాయకం ఇంకా సందిగ్ధంగానే ఆశ్చర్యంగానే కనిపిస్తున్నాడు వాళ్లకి. అతనిలో ఈ మార్పు ఏమిటా అని ఆశ్చర్యపోతున్నారు. కొంత మంది సన్నిహితులు అడిగేసారు కూడా. అతను ఏమీ సమాధానం చెప్పకుండా చిన్నగా నవ్వి వూరుకున్నాడు. తనలోని ఈ హఠాత్పరిణామం వెనుక రహస్యం ఏమిటో తనకే తెలుసు. ఒకసారి గతంలోకి వెళ్లాడు.

ఆ రోజు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో తనతో సీన్ చేసిన డైరెక్టర్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ''ఈ సీన్ ఇంకా పండలేదు మాస్టారూ... చనిపోయే ముందు మీ మొహంలో ప్రశాంతత కనిపించాలి. చావును ఆనందంగా స్వీకరించగలగాలి. ఆ ఛాయలు కనిపించాలి. ఆఖరి గడియల్లో మీలో జీవనసాఫల్యం పొందేననే భావం కళ్లల్లో ప్రస్ఫుటించాలి!'' ఆ మాటలకు తను అర్థంకానట్టు చూసాడు. ఆ డెరెక్టర్ చెప్పడం ప్రారంభించాడు.

''మనం పుట్టినప్పుడు ఏడుస్తాం. అమ్మా నాన్నలతో పాటు ఆత్మీయులంతా ఆనందపడతారు. పుట్టినప్పుడు సంతోషపడిన వాళ్లంతా మనం ఈ భూమ్మీద నుంచి వెళ్లిపోయేటప్పుడు మాత్రం దుఃఖపడతారు. ఆ సమయంలో మాత్రం పుట్టిన పాపాయిలా మనం ఏడవకూడదు. మనం చనిపోయే క్షణాల్ని ఆస్వాదించాలి. అలా ఆస్వాదించాలంటే జీవనసాఫల్యం సిద్ధించాలి, ఆ భావన మీ మొహంలో ప్రతిఫలించాలి!'' అన్నాడు ఆ డైరెక్టర్.

అప్పుడు అర్థమైంది వేదనాయకానికి, తను ఆ సీన్‌లో ఎందుకు సహజంగా నటించలేకపోయాడో! కారణం తనకు ఆస్తి, అంతస్తు అన్నీ ఉన్నా ఏదో అసంతృప్తి! తన ఇంట్లోవారితోనే కాదు, బైటవారితో కూడా ఏ మానవ సంబంధాలూ లేవు. నా

కోసం నేను. నేను చాలా గొప్ప అనే భావనతో బతుకుతున్నాడు. ఆ మాయ పొరలు కప్పివేయడంతో తన కళ్లకు ఎవరూ కనబడటం లేదు. ఇప్పటికైనా తను కళ్లు తెరవకపోతే తను వృత్తిపరంగా ఎన్నో మెట్లు ఎదిగినా వ్యక్తిగతంగా అధమస్థాయిలో ఉన్నట్టే. అందుకే తను చేస్తోన్న తన తండ్రిగారి వెయ్యి పున్నమిల నోము? ఈ ఆలోచనలతో పాటు స్మశానంలో తను చితి మీద ఉన్నప్పటి దృశ్యంలో నటించిన తర్వాత తనకు ఈ స్మశాన వైరాగ్యం వచ్చిందా? అనుకున్నాడు వేదనాయకం.

అలా ఆలోచనలో ఉంటూనే తనతో నటించిన, తల్లి పాత్రలు వేసిన ఆ తారకు ఫోన్ చేసాడు.

''అమ్మా, క్షమించండి! తెర మీద మీ కొడుకుగా న్యాయం చేసిన నేను తెర వెనుక మీకు న్యాయం చేయలేకపోయాను. ఎప్పుడైనా ఈ కొడుకు అవసరం అనిపిస్తే ఫోన్ చేయండి!'' అంటూ క్లుప్తంగా చెప్పాడు.

వేదనాయకం మనసు శాంతించినట్టయ్యింది.

అతని ఇల్లంతా సందడిగా ఉంది. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, తను జన్మనిచ్చిన పిల్లలు, భార్య, బంధువులు... వీటితో అతని మనసులో నిజమైన ఆనందం ప్రత్యక్షమయ్యింది.

ఆ పండగ ముగిసిన తర్వాత అందరూ ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోయారు. భార్యను, అమ్మా నాన్నలను మాత్రం తన దగ్గరే ఉంచుకున్నాడు. ఇక వాళ్లను శాశ్వతంగా తనతో పాటే ఉంచుకోవడానికి నిర్ణయానికి వచ్చేసాడు.

ఆరోజు రాత్రి చాలాసేపటి వరకు వేదనాయకానికి నిద్ర పట్టలేదు. తను ఒక రంగస్థల నటుడుగా ఎన్నోసార్లు ప్రేక్షకులు 'వన్స్ మోర్... వన్స్ మోర్...' అంటూ చప్పట్లు కొట్టేవారు, తను చెప్పిన డైలాగ్స్ కోసం. అలాగే సినీ జీవితంలో ఒక సన్నివేశం బాగా రాకపోతే 'టేక్.. కట్.. టేక్.. కట్..' అంటారు. బాగా సన్నివేశం రక్తి కట్టించడం కోసం టేక్‌లు తినవచ్చు. కానీ నిజజీవితంలో నాటకంలోలాగా వన్స్ మోర్‌లు ఉండవు, వెండితెర మీదలాగా టేక్‌లు కట్‌లు ఉండవు. 'ఉన్నది ఒకటే జీవితం' అనుకున్నాడు.

చాలా రోజుల తర్వాత తనకు మత్తు కలిగించే ద్రవ పదార్థం కడుపులో వేసుకోకుండానే నిద్రలోనికి జారుకున్నాడు వేదనాయకం.

తర్వాత రోజు ఉదయం అతనికి ఫోన్ వచ్చింది. నంబర్ చూసి అవును, తనతో 'రీ`టేక్ సీన్' తీయాలనుకున్న దర్శకుడు. ''చెప్పండి...'' అన్నాడు.

''సార్, మనం అనుకున్నాం కదా! ఆస్పత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో మీ పాత్ర చనిపోయే దృశ్యం 'రీషూట్' చేయాలి. దానికి సంబంధించిన సెట్ రెడీగా ఉన్నాయి. మీ నాన్నగారి ఫంక్షన్ హడావుడిలో ఉన్నారని ఫోన్ చేయలేదు. ఈరోజు వీలైతే చేసేద్దాం!'' అన్నాడు.

''అలాగే బాబూ, నేను వచ్చేస్తాను'' అన్నాడు.

''థాంక్యూ సార్'' అంటూ ఆ డైరెక్టర్ ఫోన్ పెట్టేసాడు.

వేదనాయకం గబగబా తయారై బెడ్‌రూమ్‌లో ఉన్న అమ్మా నాన్నల దగ్గరకు వెళ్లి, ''షూటింగ్‌కు వెళ్తున్నాను నాన్నగారూ...'' అన్నాడు. అలా వెళ్తూ అమ్మా నాన్నల కాళ్లకు నమస్కారం చేసాడు. గుమ్మం ముందు ఎదురుచూస్తోన్న భార్యతో ''వెళ్లొస్తాను'' అంటూ ఆమె చెయ్యి స్పర్శించి ''జాగ్రత్త...'' అంటూ బైటికి నడిచాడు. అరగంటలో షూటింగ్ జరిగే ఆ హాస్పిటల్ దగ్గరకు చేరుకుంది కార్వాన్. ఆ సినిమాకు పనిచేసే కాస్ట్యూమర్ పరుగెత్తుకుంటూ వచ్చి ''సార్, మీరు కార్వాన్‌లో వీటిని వేసుకొంటే

మేకప్‌మెన్ మేకప్ చేస్తాడు'' అంటూ తను వేసుకోవలసిన డ్రెస్ ఇచ్చాడు.

''సరే...'' అంటూ కార్వాన్‌లోపలికెళ్లాడు వేదనాయకం.

అరగంట తర్వాత అరవై ఏళ్ల వేదనాయకం డెబ్బై ఏళ్ల వృద్ధుడుగా మారిపోయాడు. ఆ ఆస్పత్రిలో వేసిన ఐసియు సెటప్‌లో షూటింగ్ కోసం అంతా సిద్ధమయ్యారు.

''సార్, రెడీనా...?'' అన్నాడు డైరెక్టర్, వేదనాయకం వంక చూసి.

''రెడీ...'' అంటూ బొటనవ్రేలు పైకెత్తి ఆ ఐసియు సెట్‌లోని బెడ్ మీద పడుకున్నాడు. ఒకవైపు వెంటిలేటరు, మరోవైపు ఇసిజి మిషను. డాక్టరు, నర్సు వేషాల్లో ఉన్న నటులు.

''లైట్స్ ఆన్... కెమేరా స్టార్ట్...'' అన్నాడు డైరెక్టర్.

కాసేపు పరీక్ష చేసిన డాక్టరు పాత్రధారి ఇవతలికి వచ్చి ''లాభం లేదు. ఇక ఆఖరి ఘడియలు'' అన్నాడు.

ఆ సినిమాలో వేదనాయకం కొడుకుగా వేసే పాత్రధారి ''అయ్యో...'' అంటూ బావురుమన్నాడు. బంధువులుగా నటించేవారంతా చుట్టూ చేరారు. వేదనాయకం చెయ్యి పైకెత్తాడు. కెమేరా లైటింగ్ అతని మొహం మీద పడింది. నేపథ్యంలో అన్నమాచార్య కీర్తన వినిపిస్తోంది.

'నానాటి బతుకు నాటకము

కానక కన్నది కైవల్యము

పుట్టుటయు నిజము పోవుటయు నిజము

నట్టనడి నీ పని నాటకము

ఎట్టనెదుట గలది ప్రపంచము

కట్ట కడపటిది కైవల్యము!'

ఆ పాట వింటోన్న వేదనాయకం మొహంలో ఏదో వెలుగు. మొహంలో ప్రశాంతత. చెయ్యి పైకెత్తిన వేదనాయకం బొటనవ్రేలు పైకి లేచింది. మెల్లగా వెలుగుతోన్న అతని కంటిరెప్పలు మూసుకున్నాయి.

''సూపర్... అదిరిపోయింది సీన్.. మీ మొహంలో జీవనసాఫల్యం కనిపించింది. థాంక్యూ సార్...'' అన్న మాటలు లీలగా వినిపించినట్టయ్యింది వేదనాయకానికి.

''ఓకే... కట్...'' అంటూ దర్శకుడు వేదనాయకం దగ్గరకు వచ్చి అతని చెయ్యి పట్టుకున్నాడు. వేదనాయకం చెయ్యి చల్లగా తగిలింది.

''సార్... సార్...'' అంటూ ఎన్నిసార్లు పిలిచినా వేదనాయకం కళ్లు తెరవలేదు. అతని మొహం ప్రశాంతంగా కనిపించింది ఆ డైరెక్టర్‌కు.

# దోచుకునే కళ

దత్తశర్మ పాణ్యం






9550214912

### రచయిత పరిచయం

*కర్నూలు జిల్లా వెల్దుర్తి స్వస్థలం. లెక్చరర్, ప్రొఫెసర్, రీడర్ తర్వాత ఇంటర్మీడియట్ బోర్డులో పని చేసి రిటైర్ అయిన శ్రీ దత్త శర్మగారి సుమారు 40 కథలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వాటిలో ముప్పై కథలతో "దత్తకథా లహరి" పేరుతో కథాసంపుటి విడుదల అయింది కూడా! శ్రీ శర్మగారి "చంపకాలోచనం" అనే ఖండకావ్యం, garland of poems అనే ఆంగ్ల కవిత సంకలనం కూడా విడుదల అయ్యాయి. "సంచిక" పత్రికలో "సాఫల్యం" సీరియల్ నవల ప్రచురితమయింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి సిద్ధాంత గ్రంథానికి పురస్కారం అందుకున్న శ్రీ శర్మగారు, ఆంధ్రప్రభ దినపత్రిక లో "దత్తవాక్" అనే కాలమ్ వ్రాస్తున్నారు.*

***"సంపాదనదేముందిరా దానెమ్మ సంపాదన. శుక్రవారం బొమ్మ ఏస్తాం.***
***శని, ఆది, బాగనే ఆడతాది. సోమవారం నుంచి ఈగలు తోలుకోవడమే.***
***రికార్డులు బద్దలు, పాన్ ఇండియా మూవీ అని అదరగొట్టేస్తారు.***
***వందకోట్లు దాటిందంటారు.***
***పెద్ద స్టార్ల సినిమాలయితే తొలి రోజులు నాలుగు స్క్రీన్లలో అదే వేస్తాము.***

"ఎల్లమాంబా టూరింగ్ టాకీసు, వెల్దుర్తి" అనే బోర్డు ఎక్కడా లేని ఒక సినిమా హాలు. దానిని హాలు అనడం కంటే షెడ్డు అనడం మేలు. సాయంత్రం ఏడు గంటలయింది. మల్లికార్జున ప్రొజెక్టరు రూములోకి వెళ్ళి బయట పెద్ద వాల్‌పోస్టరు అతికించిన తడికె మీద లైటు పడేలాగా స్విచ్ వేశాడు. గ్రాం ఫోన్ రికార్డు వేశాడు. "శుక్లాంబరధరం విష్ణుం" అన్న ఘంటసాల వారి శ్లోకం తర్వాత హంసధ్వని రాగంలో ఆయన పాడిన "వాతాపి గణపతిం భజే" కీర్తన మంద్ర గంభీర స్వరంతో మైకు నుంచి ఊరంతా వినిపించసాగింది. తర్వాత "నమో వెంకటేశా, నమో తిరుమలేశా" అన్నపాట.

మల్లికార్జున చీపురు తీసుకొని బెంచిక్లాసు, కుర్చీక్లాసు ఉన్న ఐదారు వరుసలు శుభ్రంగా తుడిచాడు. నేలక్లాసు తుడవనక్కర లేదు. ఎందుకంటే, క్రిందంతా ఇసుక పరచారు. మగ, ఆడ ప్రేక్షకులను వేరుచేస్తూ మూడడుగులు ఎత్తున్న తడికె ఒకటి ఉంది. ప్రొజెక్టరు రూము రేకుల షెడ్డు. దానిలో పాతకాలం సింగిల్ ప్రొజెక్టరు ఉంది. పాతగుడ్డతో దాన్ని శుభ్రంగా తుడిచాడు. ఒకవైపు గోడకు చిన్న చెక్కస్టాండు మీద ఎల్లమాంబ ఫోటోఫ్రేం కట్టింది ఉంది. తాను బస్టాండు నుంచి తెచ్చిన పూలమాల రెండు మూరలది అమ్మవారికి వేశాడు. ఊదొత్తులు వెలిగించి, ఆర్పి, తిప్పి అరటిపండులో గుచ్చాడు.

అప్పుడొచ్చాడు డేనియల్. అతడే ప్రొజెక్టర్ నడిపేది. "నమస్తే ధనియాలన్నా!" అన్నాడు మల్లికార్జున. డేనియల్ నవ్వి, "ఏడున్నర దాటింది మల్లీ! పైన మైకు తీసి తెర వెనక్కి డ్రమ్ముమీద పెట్టుపో!" అన్నాడు.

మైకు తెరవెనుకకు చేరింది. పాటలు తక్కువస్థాయిలో వినబడుతున్నాయి. అంటే మరో అరగంటలో సినిమా ప్రారంభిస్తారని

ఊర్లోవాళ్ళకు తెలిసిపోతుంది. వెల్దుర్తి ఒక మేజర్ పంచాయితీ. హైదరాబాదు, బెంగళూరు జాతీయ రహదారి మీద కర్నూలుకు డోన్‌కు మధ్య ఉంటుందా ఊరు. టూరింగ్ టాకీసు వెనకే రైల్వేలైను. కూతవేటు దూరంలో రైలు స్టేషను. టాకీసును ఆనుకొని కొద్దిదూరంలో బస్టాండు.

అప్పుడే కొంతమంది వచ్చి వాల్‌పోస్టరు చూస్తూ నిలబడ్డారు. 'రాజమకుటం' సినిమా పోస్టరది. యన్.టీ.రామారావు కత్తిదూసి రాజనాలతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు. రాజసులోచన అందంగా నవ్వుతూంది. ఒకమూల గుమ్మడి, మరో మూల కన్నాంబ.

మల్లికార్జున సత్తుది చిన్నబాక్సు, టికెట్ల కట్టలు తీసుకొని ప్రొజెక్టరు పక్కన చిన్న తడికెల రూములో స్టూలు మీద కూర్చున్నాడు. అతనిముందు అడుగు వెడల్పు, మూడడుగుల పొడవున్న వున్న చిన్నపలక ఉంది. అది నాలుగడుగుల ఎత్తుంది. దానిమీద క్యాష్ బాక్సు, టికెట్లు పెట్టుకొన్నాడు. దానినానుకొని తడకలో చేయి పట్టేంత కంత.



"నేల టికెట్లు నాలుగియ్యిరా పిల్లోడా!" అన్నాడు ఉరుకుందప్ప. ఆ ఆటకు తొలి ప్రేక్షకుడు.

"తొంభైరెండు పైసలియ్యి సిన్నాయినా!" అన్నాడు మల్లికార్జున.

నేలటిక్కెట్టు పావలా అర్ధణా అంటే ఇరవై ఎనిమిదిపైసలు. బెంచీ నలభై మూడు పైసలు. కుర్చీ అరవై ఐదు పైసలు.

పదినిముషాల్లో జనం పెరిగారు. మల్లికార్జున చకచకా టికెట్లు ఇస్తున్నాడు. మగవారి గేటుదగ్గర మద్దిలేటి, ఆడోళ్ళ గేటు దగ్గర విరూపాక్షయ్య టికెట్లు తీసుకొని జనాలను లోపలికి వదుల్తున్నారు. నేలక్లాసు సగం నిండింది. బెంచి టికెట్లు పజ్జెనిమిది తెగాయి. కుర్చీ ఐదు.

బెంచీలంటే, బేతంచెర్ల నాప బండలు నిలబెట్టారు కూర్చోడానికి. వాటికి బ్యాక్‌రెస్టు ఉండదు. కుర్చీలు గోద్రెజ్ వి రేకు కుర్చీలు ఒక ఇరవై. బాగా స్థూల కాయులు దాంట్లో కూర్చోలేరసలు. టాకీసు మెయిన్ గేటు నానుకొని లోపలి వైపు క్యాంటీన్ తెరిచాడు ఖాదర్ వలీ! ఒకపెద్ద బేసిన్‌లో కారం బొరుగులు, మరోదాంట్లో అలసంద వడలు, మరో దాంట్లో మిర్చి బజ్జీలు పేర్చాడు. అతని అసిస్టెంట్ తిరుపాలు పొయ్యి రాజేసి టీ పెట్టాడు పెద్దగిన్నెతో. ఒకవైపు అరుగు మీద పుట్నాల పప్పుల గట్టాలు, నూలగట్టాలు, నిమ్మెప్పులు, బొరుగు ముద్దలు కొలువు తీరాయి సీసాల్లో.

ఎనిమిదింపావుకు స్లైడ్లు వేయసాగాడు డేనియల్. 'పొగత్రాగరాదు', 'ఏ కారణము చేత ఆట ఆగిన యెడల డబ్బు వాపసు ఇవ్వబడదు.', 'అల్లరి చేయువారిని పోలీసులకు పట్టించబడును', 'మా రాబోవు చిత్రములు' అని రెండు మూడు సినిమాల

స్లైడ్స్. చివర్లో 'నిశ్శబ్దం!'

షెడ్డులో పై లైటు ఆరిపోయింది. డేనియల్ రెండు రీళ్ళు చుట్టిపెట్టుకుని ఉన్నాడు. సినిమా స్టార్టయింది. కిర్రుమని చప్పుడు చేస్తూ ప్రొజెక్టరు తిరగసాగింది. సరిగ్గా ఇరవై నిముషాల తర్వాత సినిమా ఆపాడు, లైటు వేశాడు. ఎందుకంటే సింగిల్ ప్రొజెక్టరు కద! మళ్ళీ రెండు రీళ్ళు చుట్టుకోవడానికి పదిహేను నిముషాలు పడుతుంది.! చాలామంది లేచి బయటకు నడిచారు. ఖాదర్ వలీ క్యాంటీన్‌లో బీడీలు, తినుబండారాలు కొనుక్కున్నారు. టీలు తాగారు. మళ్ళీ సినిమా పడింది. పొలోమని లోపలికి వెళ్ళారు.

మల్లికార్జున అమ్మిన టికెట్లు, వచ్చిన డబ్బు, ట్యాలీ చేసుకున్నాడు. మొత్తం కలెక్షన్ యాభై ఐదు రూపాయలు. బయట కుర్చీలో కూర్చుని ఉన్నాడు ఓనర్ బాలకోటా రెడ్డి. ఆయనకు వినయంగా క్యాష్ అందించాడు.

"ఏమప్ప మల్లీ, బొమ్మ ఇంకా నాలుగురోజులు లాగుతాదా?" అనడిగాడు.

"రెండ్రోజుల తర్వాత తీసేద్దాం రొడ్డి! ఎల్లుండి గుంటకల్ నుండి 'ఈరాభిమన్యు' బాక్సు దిగుతాది, అది ఇట్టు సినిమా గద! ఈ రాజమ్మగూటం మంచిదే గానీ, ఇగ్గడం ల్యా" పకపకా నవ్వాడు బాలకోటారెడ్డి. "నీపాసుగూల! రాజమ్మగూటం కాదురా తిక్కనాయాల... రాజమకుటం! దీన్ని బాక్సు ఉంచేసుకుని, ఒకే టిక్కెట్టు పై రెండాటలు అని మన ఒంటెద్దు బండి మీద మైకులో అరిపించుకొంటా తిప్పుదాం. లద్దగిరి, రామళ్ళకోట, ఇటు బొమ్మిరెడ్డిపల్లె తిర్నాలలుండాయి. ఒక్కరోజు చాలు, పుల్లు కలెక్సను!"

"ఏస్తాందాం గానీ, గుంటకల్ డిస్ట్రిబ్యూటర్ నా కొడుకులకు తెలిస్తే శాన గడబడయితాది. కానీ ఈ సారికి!"

మల్లికార్జున, మద్దిలేటి, విరూపాక్షయ్యకు ఇక తీరుబాటే. వెళ్ళి ఒక బెంచీమీద కూర్చొని కాసేపు సినిమా చూడసాగారు. బెంచీలనానుకొని కొద్దిదూరంలో ఒకడు ఇసుకలో ఉమ్మేసి, మళ్ళీ ఇసుక కప్పుతున్నాడు.

"ధూ, గలీజు నా కొడుక! ఏం పనిరా అదీ? బయటకు పోయి ఉమ్మేసుకోలేవూ?" అనరిచాడు మల్లి.

వాడు వెనక్కి తిరిగి నవ్వాడు.

"ఏడనున్నాడో ఎక్కడున్నాడో" "సడి చేయకో గాలి..." లాంటి పాటలు ప్రేక్షకుల్లో కొందరు నటులతో పాటు గట్టిగా పాడుతున్నారు. తాగుబోతు ఒకడు తెర దగ్గరికి పోయి అడ్డంగా నిలబడి డాన్సు చేస్తూంటే, తిరిపాలు వాడిని బూతులు తిట్టి, లాగి పారేశాడు.

ఇంతలో మేఘాలు కమ్ముకొన్నాయి. కాసేపట్లో చినుకులు రాలసాగాయి. షెడ్డు పై కప్పిన తడికెలు కొన్ని గాలికి తొలగిపోయాయి. అయినా సరే, సినిమా ఆగలేదు. కాసేపటికి వర్షం ఎక్కువయింది. డేనియల్ స్లైడు వేశాడు.

"ఏ కారణం చేతనయినా ఆట ఆగిన యెడల డబ్బు వాపసు ఇవ్వబడదు."

కానీ, బాలకోటారెడ్డి, సినిమా ఆపి, పాసులిచ్చి జనాన్ని పంపేయమన్నాడు. ఆ పాస్‌తో రేపు మళ్ళీ మొదట్నుంచి సినిమా చూడొచ్చు. అదీ రెడ్డిగారి ప్రొఫెషనల్ ఎథిక్స్.

మల్లికార్జున అక్కడ మేనేజర్. అతనికి నెలకు వంద రూపాయలు జీతం. ఏనాడూ రెడ్డిగారిని మోసం చేయలేదు. పది

సంవత్సరాల తర్వాత డోన్‌లో రాజా థియేటర్ కొన్నాడు రెడ్డి. దానిని రెన్నోవేట్ చేయించి సెకండ్ రిలీజ్ సినిమాలు వేయసాగాడు. వెల్దుర్తిలో టూరింగ్ టాకీసు లీజుకిచ్చాడు.

మల్లికార్జునకు ప్రమోషన్. రాజా టాకీసు మేనేజర్. ఆహార్యంలో మార్పు. నేలక్లాసంతా నీట్ గా ప్లాస్టరింగ్. వెనక్కు ఆనుకొనే చెక్కబెంచీలు, కుషన్ చెయిర్లు, మల్లికార్జునకొక రూము. రెండు టికెట్ కౌంటర్లు. సినిమాలలో, ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పు, పార్ట్లీ కలర్ సినిమాలు, మరో పది సంవత్సరాలు గడిచాయి. రెడ్డిగారితో మల్లికార్జునకుచెడింది! దసరాబుల్లోడు సినిమా సెకండ్ షో కలెక్షన్‌లో తేడా వచ్చింది. తానే పాపమూ ఎరుగనన్నా, రెడ్డి ఒప్పుకోలేదు.

మల్లికార్జున కర్నూలు చేరాడు. అక్కడ 'వెరైటీ' థియేటర్‌లో ఉద్యోగం దొరికింది. సినిమాల్లో కథాబలం తగ్గి హంగామాలు ఎక్కువైనాయి. అయినా శంకరాభరణం లాంటి సినిమాలు అరుదుగా వచ్చి, ప్రేక్షకుల ఉత్తమాభిరుచిని సంతృప్తి పరుస్తున్నాయి. శాస్త్రీయ సంగీతాన్ని సూపర్ హిట్ చేసిన సినిమా అది.

మరో ఇరవై ఏండ్లు గడిచాయి. పాత థియేటర్లు కూలగొట్టి మల్టీప్లెక్సులు కట్టడం మొదలైంది. వెరైటీ టాకీసు డి.జి.ఎల్. సినీ కాంప్లెక్సుగా మారింది. మొత్తం నాలుగు స్క్రీన్లు. సినిమాలు బాక్సుల కాలం ఎప్పుడో పోయింది. శాటిలైట్ ద్వారా సినిమా వచ్చేస్తుంది.

మల్లికార్జున అదే సినీ కాంప్లెక్స్‌లో ఇపుడు మేనేజింగ్ పార్ట్నర్. అతనికి పదిపైసల వాటా ఇచ్చి, నెలకు ముప్పై వేల జీతం ఇస్తున్నాడు. డి.జి.ఎల్ ఇండస్ట్రీస్ అధినేత తిరుమల గుప్తా.

సినిమా టికెట్ ధరలు వందల్లోకి వెళ్ళిపోయాయి. క్యాంటీన్‌లో పాప్‌కార్న్, కూల్ డ్రింక్స్, కాఫీ, స్నాక్స్ రేట్లు బయటికంటే నాలుగురెట్లు ఎక్కువ! ఎక్కువ మందిని అకామడేట్ చేయాలని కుర్చీల వరుసలు మధ్య దూరం తగ్గించారు. ప్రేక్షకులు సినిమాలో లీనమవగానే ఏ.సీ. ఆపేస్తారు.

తన ఛాంబర్‌లో కూర్చుని ఉన్నాడు మల్లికార్జున్. ఊరినుండి తిరుపాలు వచ్చాడు. అతనిప్పుడు వెల్దుర్తి లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు.

"ఏందన్నా, ఒకేతూరి నాలుగు సినిమాలు ఏపిస్తా ఉండావట?" అన్నాడు తిరుపాలు.

"ఏం చెప్తాలేరా తమ్ముడు. మఖలో పుట్టి పుబ్బలో చచ్చే సినిమాలే అన్నీ. ఒక మంచి పాట లేదు. ఒక మంచి కథ లేదు. కోట్లు కుమ్మరించి సినిమాలు తీస్తాండారు గానొరేయ్, నాకు శానా కోపంగ ఉండాది లే!"

"అదేంటన్నా అట్లంటివి? బాగా సంపాదించుకొన్నావంటారు గదా!"

"సంపాదనదేముందిరా దానెమ్మ సంపాదన. శుక్రవారం బొమ్మ ఏస్తాం. శని, ఆది, బాగనే ఆడతాది. సోమవారం నుంచి ఈగలు తోలుకోవడమే. రికార్డులు బద్దలు, పాన్ ఇండియా మూవీ అని అదరగొట్టేస్తారు. వందకోట్లు దాటిందంటారు. పెద్ద స్టార్ల సినిమాలయితే తొలి రోజులు నాలుగు స్క్రీన్లలో అదే వేస్తాము. ఇంక హీరోలు గడ్డాలు పెంచుకొని బికారి ఎదవల్లా తయారైరి గద! ఒక్కని ముకంలో కలలేదు! ఈరోయిన్లయితే మరీ దరిద్రం. మొన్న అదేదో "హాటు హాటు" పాటంట. దానికి ఆస్కారు అవార్డు వచ్చినాదట. దాన్ని ఇన్న తర్వాత ఆ డాన్సు చూసిన తర్వాత, నా సెప్పుతో నన్నే కొట్టుకోవాలనిపించినాదిరా తిరిపాలూ! సినిమా అంటే కళ్ళు, సెవులూ, గుండె అన్నింటినీ పండించాల. పక్కా యాపారమై పోయినాదిరా!"

"అయితే అప్పుడే బాగుండెనంటావు!"

"అవునురా, బాలకోటారెడ్డి కాడ టూరింగ్ టాకీసులో పని చేసినప్పటి సంతోషం ఇప్పు యాడుండాది? స్లయిడు ఏసినా, వానొస్తే, పాసులిమ్మని చెప్పి, మర్నాడు మళ్ళీ సిన్మా చూపించమనే వాడు మానుబావుడు. నా కర్మ బాలేక ఆయన కాడి నుంచి వచ్చేసినా! ఇప్పుడు దోపిడీయే గానీ 'కల' యాడుందిరా?" అని నిట్టూర్చాడు మల్లికార్జున!



9492535415

కథామంజరి సినిమారంగ మార్తాండ కథల పోటీ
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2023

# తెరవెనుక బొమ్మ

వేలూరి ప్రమీలా శర్మ

## రచయిత్రి పరిచయం

*విశాఖకు చెందిన వేలూరి ప్రమీలాశర్మగారు, వృత్తిరీత్యా న్యూస్ రీడర్‌గా, న్యూస్ కరెస్పాండెంట్‌గా పనిచేస్తున్నారు. సాహిత్యాభిలాషతో రచనలు చేస్తున్న శ్రీమతి ప్రమీలగారి 118 కథలు ఇంతవరకూ వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. అందులో 19 వరకూ కథానికలూ, నాటికలూ, ధారావాహికలూ, 36 వరకూ మినీ కథలూ కూడా చోటు చేసుకున్నాయి. కేవలం కథలే కాకుండా తెలుగు గజల్స్, పద్య రచనా ప్రక్రియలోనూ వీరికి ప్రవేశం ఉంది. మనసుకి హత్తుకునేలా కథలు రాయడం ఇష్టం. ఆధ్యాత్మిక గ్రంథ పారాయణం పై మక్కువ ఎక్కువ. వచనాన్ని పద్యరూపంలోకి మార్చడం ఇష్టం.*

***కోపంగా అరుస్తోంది లిజీ.***
***"ఏంటీ... కోడిపెట్టని గంపకింద పెట్టి దాచేస్తే, వాసన పసిగట్టలేననుకున్నావా?" మొహంలో మొహం పెట్టి మాట్లాడుతున్న శైలేంద్ర నోటినుంచి గుప్పున వెలువడిన వాసనకి ఆమె ముఖం పక్కకి తిప్పుకుంది.***
***"అరె! ముందు ముందు ఆ పిల్లకి బ్రైట్ ఫ్యూచరుందని చెప్తున్నా కదా! అర్థం కాదా నీకు? ఎందుకు అడ్డు తగులుతావ్?" తాగిన మైకంలో ఏం మాట్లాడుతున్నాడో తెలీట్లేదు శైలేంద్రకి. మత్తులో తూలుతూ, మాలక్ష్మి ఉన్న గది వైపు వెళ్లబోతుంటే సివంగిలా విరుచుకుపడిన లిజీ అడ్డుకుంది.***

"ఓహ్! నో! మీరు చెప్పిన డేట్స్ ఏవీ ఖాళీ లేవండీ... అఫ్ కోర్స్ మీరు చెప్పిన కథ నచ్చడంవల్ల కాదనలేకపోతున్నాను! ఆ... ఏదీ, జూన్ సిక్స్ కదూ అన్నారు. ఓ పని చెయ్యండి సర్! సిక్స్ మార్నింగ్ ఫ్లైట్‌కి ముంబై నుంచి రావడానికి ట్రై చేస్తాను. టీమ్ షెడ్యూల్ చేసెయ్యండి. నేను రెండు గంటలకి వచ్చి జాయిన్ అవుతాను... ఓకే నా!?" రైట్ హ్యాండ్‌తో ఐ ఫోన్ పట్టుకుని మాట్లాడుతూనే, ఎడమచేత్తో షవర్ క్యాప్ ను సరిచేస్కుని, స్విమ్‌సూట్‌కి ఉన్న రేయాన్ రిబ్బన్‌ను టైట్ చేసుకుని, స్విమ్మింగ్ పూల్‌లో దూకి, ఈదడానికి సిద్ధమవుతోంది లిజీ.

బటర్‌ఫ్లయ్ కట్స్ తీస్తూ, నిశ్చలంగా ఉన్న పూల్‌లో ఈదుతున్న ఆమె జీవితాన్ని, ఒకప్పుడు ఉప్పెనలాంటి అల ఒకటి కుదిపేసింది. ఎదురీదే శక్తీ, యుక్తీ లేక రాజీపడి బ్రతుకుతున్న ఆమె కళ్ళు కార్చే నీళ్లు, నిత్యం ఆ స్విమ్మింగ్ పూల్‌లో కలిసిపోతూనే ఉన్నాయి. నలభై నిముషాల ఈత తర్వాత గట్టుమీదకొచ్చి, కుర్చీలో సేదదీరుతూ కొద్దిగా వైన్ సిప్ చేసి, రిలాక్సింగ్‌గా చెయిర్‌లో వెనక్కి జారబడి కళ్ళుమూసుకుంది లిజీ.

అలసట తీరాక తన విల్లాలో మొదటి అంతస్తులో, నార్త్‌వెస్ట్ కార్నర్ వైపున్న తన బెడ్‌రూమ్ లోకి దారితీసింది. తనకన్నా ముందే తన రూంలో దూరి, టీవీ ముందు నేలమీద బోర్లా పడుకుని, ముందు రెండు కాళ్ళూ ఒకదానిపై ఒకటి వచ్చేలా వేస్కుని, తోక ఊపుతూ టీవీలో వస్తున్న కింగ్‌కాంగ్ సినిమా చూస్తోంది బ్రూనో. గోల్డెన్ రిట్రీవర్ బ్రీడ్‌కి చెందిన బ్రూనోని,

దానికి పదహారు రోజుల వయసప్పుడు తెచ్చి, పెంచడం మొదలుపెట్టింది లిజీ. ఇప్పుడు బ్రూనో వయసు మూడు సంవత్సరాలు. లిజీని చూడగానే అమాంతం మీదకి ఎక్కేసింది. కుక్కతో అరగంటసేపు సమయం తెలీకుండా గడిపిన లిజీ... ముంబై ఫ్లైట్ కి టైమవ్వడంతో, ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళడానికి రెడీ అవుతోంది.

'మై గాడ్! ఇక గంటే టైముంది' అనుకుంటూ గబగబా ఒక బౌల్ లోకి ఒక కప్ మ్యూసిలీ, అరగ్లాసు పాలు, సన్నగా కట్ చేసిన రెండు అరటిపళ్ళు, ఒక స్పూను హనీ వేసి కలిపి, రెండు నిముషాల్లో తినడం పూర్తయ్యింది అనిపించుకుని, డ్రైవర్ కార్ తీసి రెడీగా ఉంచడంతో, గబగబా అందులోకి ఎక్కేసింది లిజీ.



హెడ్‌ఫోన్స్‌లో పాటలు వింటూ, సీట్లో వెనక్కి వాలి కళ్ళుమూసుకుంది లిజీ. ముందు సీట్లో కూచున్న శైలేంద్ర ఎవరితోనో ఫోనులో మాట్లాడుతూ, కారు ఆపమన్నట్టు డ్రైవరుకి సైగ చేసాడు.

రోడ్డు పక్కన చెరుకురసం అమ్మే బడ్డీలో, గడలు మిషన్లో వేసి రసం తీస్తున్న తండ్రికి సాయం చేస్తోంది, ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయి. కాటను చుడీదారే వేసుకున్నా, యవ్వనపు మెరుపులో అప్పుడే విచ్చుకున్న ఎర్ర గులాబీలా ఉంది. ఒత్తైన తలకట్టును విడగొడుతున్న పాపిడికి దిగువగా, మన్మథుడు సంధించడానికి సిద్ధం చేసుకున్న వింటి నారిలా వంగిన కనుబొమలు, వాటికింద చురుగ్గా కదులుతున్న మీనాల్లాంటి కళ్ళు... ఎవరికైనా ఓసారి చూస్తే, తిరిగి మళ్లీ చూడాలనిపించే అందం ఆమెది.

శైలేంద్ర కారు దిగుతూ, ఫోను జేబులోకి తోసి, నేరుగా చెరుకురసం బండి వైపు వెళ్ళాడు. కారు ఆగిన శబ్దానికి కళ్ళు తెరిచిన లిజీకి, రోడ్డు దాటి అటువైపు వెళ్తున్న శైలేంద్ర కనిపించాడు. అతనటువైపు ఎందుకు వెళ్తున్నాడో తేలిగ్గానే ఊహించగలిగింది లిజీ. ఒక గ్లాసు చెరుకురసం ఆర్డర్ చెప్పి, బండి ఓనరుతో మాటలు కలిపిన శైలేంద్ర కళ్ళు, ఆ జవ్వనికి అతుక్కుపోవడం గమనించింది లిజీ. ఖాళీ గ్లాసు వెనక్కి ఇస్తూ, షాపతని చేతిలో ఐదువందల నోటు పెట్టి, చిల్లర వద్దని వెనుదిరిగిన శైలేంద్ర, కారెక్కి స్టార్ట్ చెయ్యమన్నట్టు సైగ చేసాడు. ఫ్లైట్ కి టైమవుతుండడంతో నూట ఇరవై స్పీడులో కారుని ముందుకి దూకించాడు డ్రైవరు.

"ఆ అమ్మాయి పేరేంటి?" క్యాజువల్‌గా ఆడిగినట్టుగా అడిగింది లిజీ.

"ముంబైలో మనకి రెండు రోజుల పని ఉంది. యాడ్ షూటింగ్ పూర్తయ్యాక, మరో ముఖ్యమైన వ్యక్తిని కలవాలి!" కావాలనే మాట దాటేస్తూ అన్నాడు శైలేంద్ర.

లిజీ ముఖంలో దిగులు ఏర్పడింది. ఇప్పుడు తానొక పేరున్న ప్రఖ్యాత హీరోయిన్. అప్పుడప్పుడూ ఇలా యాడ్స్‌లో యాక్ట్ చెయ్యడానికి శైలేంద్ర, ముంబై తీసుకొస్తుంటాడు.

ఎనిమిదేళ్ల కిందట ఓ ఫ్యాషన్ షోలో పరిచయమయ్యాడు శైలేంద్ర. మోడలింగ్ రంగంలో దూసుకుపోతున్న లిజీని ఆడిషన్స్‌కి కూచోబెట్టి, సినీరంగం వైపుకి లాగాడు. కెరీర్ ఊపందుకోవాలంటే టాలెంట్ ఒక్కటే సరిపోదని అర్థమయ్యింది లిజీకి. డబ్బు, పేరు కోసం శైలేంద్ర చెప్పినట్టు వినడానికి అలవాటుపడిపోయింది.

ఆమెకి తెలుసు... యాడ్ షూటింగ్ పూర్తయ్యాక, శైలేంద్ర తనని ఎక్కడికి తీసుకువెళతాడో. సెవెన్‌స్టార్ హోటల్లో విలాసవంతమైన విందు ఏర్పాటు చేస్తాడు. అక్కడికి వచ్చిన ప్రముఖ వ్యక్తికి ఆ విందుతో ఆకలి తీరదు. లిజీకి చేతినిండా కాల్‌షీట్లు దొరకాలంటే, మింగుడుపడని విందులో తాను ప్రత్యేక ఆకర్షణ కావాలని ఆమెకి తెలుసు. అందుకే షూటింగ్ అయిపోయినా మరోరోజు అక్కడ గడపడం. లిజీ జీవితం ఆమె చేతుల్లో లేకుండాపోయింది.

క్యాబిన్ బ్యాగ్ సెక్యూరిటీ చెకిన్లో ఇస్తూ, షర్ట్ పైన కప్పుకున్న ఓవర్‌కోటు కూడా తీసి ట్రే లో ఉంచింది. బెల్ట్ మీద ట్రే కదులుతూ ముందుకి వెళుతూంటే, ఆమె ఆలోచనలు గతంలోకి పరిగెట్టాయి.

యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా చేస్తున్న తల్లికీ, హైకోర్టు ప్యానెల్ జడ్జిగా ఉన్న తండ్రికీ లిజీని పట్టించుకునేందుకు ఒక్క క్షణం కూడా తీరిక ఉండేది కాదు. చిన్నప్పట్నుంచీ నలుగుర్లోనూ తాను ప్రత్యేక ఆకర్షణ కావాలనుకునేది లిజీ. ఆ అభిలాషే ఆమెను మోడలింగ్ వైపు నడిచేలా చేసింది. మొదటిసారి రాంప్‌పై వాక్ చేస్తూ తడబడితే, చెయ్యందించిన శైలేంద్ర పరిచయం, తరువాత ఆమె జీవితాన్నే చీకట్లోకి నెట్టేసి, మత్తులోకి జారిపోయేలా చేసింది.

కోటు తీసివేసుకుంటూ, జెంట్స్ క్యూ వైపు చూసింది.

"నువ్వు గేట్ లోకి వెళ్ళు... నేనొస్తాను" అన్నట్టు కళ్ళతోటే సైగచేశాడు శైలేంద్ర.

ఆమెకి తెలుసు... శైలేంద్ర చూపు సోకితే, ఆ సాలె గూడులోంచి బయటపడడం చాలా కష్టం. అనౌన్స్‌మెంట్ విని, బోర్డింగ్ పాస్ చేత్తో పట్టుకుని ముందుకి కదిలింది. అంతవరకూ ఎవరితోనో ఫోను మాట్లాడిన శైలేంద్ర, గబగబా వచ్చి ఆమెతో జాయిన్ అయ్యాడు. మొదట్లో శైలేంద్ర తన నడుముపై చెయ్యి వేసి, పక్కనే నడుస్తుంటే చాలా సెక్యూర్డ్‌గా ఫీలయ్యేది లిజీ. ఇప్పుడు, అతని చెయ్యి తగిలితే, ఒంటిమీద పాము పాకినట్టు అనిపిస్తోందామెకు.

★★★

"మేడమ్! ఈ వీకెండ్ షూటింగ్ డేట్స్ విషయం డైరెక్టర్‌గారు మరోసారి మీకు గుర్తు చెయ్యమన్నారు. ఈసారి మెగా పిక్సెల్ కెమెరాలతో సాంగ్ రికార్డింగ్ ఉంది. ట్యాన్ అవకుండా కొంచెం జాగ్రత్తలు తీసుకోండి. ఈ నాలుగు రోజులూ స్విమ్మింగ్‌కి కూడా దూరంగా ఉంటే మంచిదని చెబుదామని ఓసారి ఫోన్ చేసాను!" టెక్నికల్‌గా సీన్ షూటింగ్‌లో ఎంతో కేర్ తీసుకుంటూ, నైపుణ్యత కనబరిచే సీనియర్ కెమెరామెన్ జయసూర్య అటువైపు లైన్‌లో ఉన్నాడు.

జయసూర్య గొంతు వినగానే ప్రాణం లేచివచ్చింది లిజీకి. కళ్ళవెంట కారుతున్న నీళ్లు, బాధతో పూడుకుపోయి తడారిపోయిన గొంతును తడపలేకపోతున్నాయి.

"ఏమైంది మేడమ్? వింటున్నారా? లైన్ లోనే ఉన్నారా? ఆర్ యూ ఓ కే!?" ప్రశ్న మీద ప్రశ్న వేస్తూ ఆదుర్దాగా అడుగుతున్నాడు జయసూర్య.

"హా! యా! బాగానే ఉన్నాను... వింటున్నాను. ఏదో ఆలోచిస్తూ సమాధానం చెప్పలేదు, అంతే!" అంటూ ఫోన్ పెట్టేసింది లిజీ.

ముందురోజు రాత్రి తాను పడిన నరకం తాలూకు బాధ, గుండెల్లో మంట పుట్టిస్తుంటే, ఎవరికి చెప్పుకోవాలో తెలీక గిలగిల్లాడిపోయింది లిజీ.

మగవారిపైనే నమ్మకం పోయిన లిజీకి, రెండేళ్ల క్రిందట ఓ జూనియర్ ఆర్టిస్ట్ విషయంలో జయసూర్య చూపించిన తెగువ, చొరవతో అతనిపై ఎంతో గౌరవం ఏర్పడింది. కుటుంబ పోషణ కోసం రోజువారీ వేతనంపై ఇండస్ట్రీని నమ్ముకుని వచ్చిన చాందినీ జీవితం, చీకట్లోకి జారిపోకుండా అండగా నిలబడ్డాడు జయసూర్య. సినీరంగంలో చెదపురుగులు లాంటి కొందరు, ఆడవాళ్ళ బ్రతుకు పుస్తకాల్లో పేజీలను నమిలి, తినేస్తుంటే చూసి తట్టుకోలేకపోయాడు. సింహాన్ని బోనులో పెడితేనే, జింకలు స్వేచ్ఛగా తిరగగలవు అనుకున్నాడో ఏమో, పేరున్న బడా బాబుతోనే ఢీకొట్టాడు. వ్యవహారం మొత్తం కెమెరాల్లో బంధించి, గుట్టు రట్టు చేస్తానని బెదిరించి, జూలు కత్తిరించిన జయసూర్య అంటే అందరికీ చాలా ఇష్టం. 'ఇలాంటి తమ్ముడు నాకొకడు ఉంటే ఎంత బాగుండును' అనుకునేది లిజీ. కానీ నోరు తెరిచి తన సమస్యను మాత్రం చెప్పుకోలేకపోయింది.

ఒక ఎం.ఎన్.సీ లో ఆరేళ్ళు పనిచేసిన జయసూర్య, ఫోటోగ్రఫీలో మెళకువలు తెలిసివుండడంతో, సినిమాలపై ఆసక్తితో... చేస్తున్న ఉద్యోగం వదిలేసి, సినీ రంగంలోకి వచ్చాడు. ఒకప్పుడు మోడలింగ్ స్టిల్స్ కోసం ప్రత్యేకించి జయసూర్యనే పిలిపించేది లిజీ. ఇద్దరి మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది.

ఆరోజు జయసూర్య ఫోన్ కాల్ అటెండ్ అవగానే లిజీ మెదడులో మెరుపులాంటి ఆలోచన వచ్చింది వెంటనే ఆలస్యం చెయ్యకుండా తిరిగి మళ్లీ అతనికి కాల్ కనెక్ట్ చేసింది. తనలా మరొకరి జీవితం ఇరుకున పడకూడదు అన్న దృఢనిశ్చయంతో, గతవారం తాను నోటీస్ చేసిన విషయాలు అన్నీ పూసగుచ్చినట్టు అతనితో చెప్పింది. ఆ రోజు ఓడ్కా తాగకుండానే ప్రశాంతంగా నిద్రపోగలిగింది లిజీ.

★★★

"ఊరు దాటి పోయెఱుఁగవు... జాగర్త మాలచ్చిమీ. చదించే తావోతు లేక నిన్ను సదివించలేకపోయినా... ఇన్నాల్లూ, నీతీ నిజాయితీగా బతికినోళ్లాం... పానం పోయినా మానం పోకుండా చూస్కోవాల. తెరమీది బొమ్మల్ని చూసేటందుకే పైసల్లేని, రోడ్డు వార జీవితాలు మనయ్యి. ఇప్పుడు నిన్నేదో తెరమీది బొమ్మని చేత్తానని ఆ బాబు చెప్తాన్నాడు. నమ్మొచ్చో లేదో తెల్వదు కానీ, నీ పోరు పడలేక పంపిస్తన్నాను. యాడున్నా బద్రంగా ఉంటావు కద బిడ్డా? నెలకోసారీనా అమ్మనీ, అయ్యనీ చూస్తాకి ఒస్తావుగా... మాటియ్యి" ప్రేమగా కూతురి తల నిమురుతూ, బేలగా అడుగుతున్న తండ్రి చెయ్యిని, తన చేతిలోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది మాలక్ష్మి.

"నేను పదో క్లాసు పాసయ్యాను నాయనా! చిన్నపిల్లని కాదు. ఎవరితో ఎట్టుండాలో మా నీరజా మేడం చెప్పిందిలే. నువ్వేం దిగులు పడకు!" నవ్వుతూ ధీమాగా చెబుతున్న ఆమె ముఖం, వెన్నెల కాంతిలో చందమామలా మెరిసిపోతోంది.

పచ్చిక మైదానంలో చెంగుచెంగున గెంతే లేగదూడ లాంటి మాలక్ష్మి, పట్నపు అడవుల్లో పొంచి ఉండి, కాటు వేసే క్రూరమృగాల మధ్యకి వెళ్ళడానికి సిద్ధపడుతోందని అర్థమయ్యే వయసు కాదామెది. సంచిలో సర్దుకోడానికి నాలుగు గుడ్డలు కూడా కరువైన బతుకులు... చెయ్యందించే మనిషి సాయం కోసం తపిస్తున్న నీరింకిన గుండెలు. కడుపు నింపుకోడానికీ, కన్నవారి రుణం తీర్చుకోడానికి ధీమాగా కారెక్కింది మాలక్ష్మి.

"పోయొస్తా నాయనా!" నవ్వుతూ గాల్లోకి చెయ్యి ఊపుతున్న కూతురు, వీధి చివరన కనుమరుగయ్యే వరకూ చూస్తూనే ఉండిపోయాడు ఆ బీద తండ్రి.

★★★

మొదటిసారి కెమేరా ముందు నుంచుని, వణుకుతున్న మాలక్ష్మి చేతిని, తన చేతిలోకి తీసుకుని, ఆమె నడుము చుట్టూ చెయ్యి వేసి, బిగించి దగ్గరగా లాక్కుని, భయం పోగొడుతున్నందుకు అన్నట్టుగా చేస్తున్న శైలేంద్ర చేష్టలకు, గిజగిజలాడింది ఆ లేత ప్రాయం.

“భయమెందుకూ? నేనున్నానుగా... ఈ సీన్‌లో నీకసలు డైలాగులు ఏమీ లేవు. జస్ట్ నీ ఉద్యోగధర్మం నువ్వు చేస్తూ, కస్టమర్లని చిన్న స్మైల్ ఇస్తూ పలకరించడమే... ఒకరోజు అలవాటైతే, భయం అదే పోతుంది!” వెకిలిగా నవ్వుతూ చెబుతున్న శైలేంద్ర మాటలు ఆ పసి మనసుకి అంతగా అర్థం కాకపోయినా, జయసూర్య రక్తం మరిగిపోయింది.

“అప్పుడే సీన్ రికార్డింగ్ లోకి ఎందుకూ? కొన్నాళ్ళు లొకేషన్‌లో అబ్జర్వ్ చేస్తూ కూచుంటే, ఏ సీన్‌లో ఎలా నటించాలో ఆమెకే అర్థమవుతుంది. ఆమెకీ ఈ వాతావరణం కొద్దిగా అలవాటుపడినట్టు ఉంటుంది. కొంచెం గ్యాప్ ఇస్తే మంచిదేమో సర్!” మాలక్ష్మిలో బెరుకును గమనించి, శైలేంద్రతో అన్నాడు జయసూర్య.

నిజానికి ఆ కొద్దీ గ్యాప్‌లో ఆమెకి, ఈ రంగుల ప్రపంచంలో జరిగే మాయల గురించి తెలియచెప్పాలని ఆశపడుతున్నాడు. అలా ఆలోచిస్తూనే వేటగాడి వాడి బాణానికి ఆ జింక పిల్ల బలవ్వకూడదనీ ఆలోచిస్తున్నాడు.

జయసూర్య మాటలకు చిరాగ్గా మొహం పెట్టిన శైలేంద్ర షాట్ బ్రేక్ తీస్కుని, లేచాడు. ఆ కాస్త సమయం చాలన్నట్టు ఆ రాత్రికి మాలక్ష్మిని లిజీ ఇంటికి తీసుకెళ్లి పరిచయం చేశాడు జయసూర్య. అతను చెప్పినదంతా విన్నాక లిజీ స్థిరంగా ఓ నిర్ణయానికి వచ్చింది.

“అక్కా! మీరెవ్వరో నాకు తెల్వదు. టౌన్లా అలవాటయ్యిందాకా మీ ఇంట్లో ఉండమని జయసూర్య అన్న చెప్పారు. నాలుగు దినాలు పోతే నాకూ బయం తగ్గుతాది. ఉండమంటావా?” అమాయకంగా అడుగుతున్న మాలక్ష్మి ప్రశ్నకు సమాధానంగా చిరునవ్వు నవ్వింది లిజీ.

“మీ నాయనకి ఫోను కలపాలంటే చెప్పు. నా ఫోన్నించి ఎప్పుడు కావాలన్నా మాట్లాడుకోవచ్చు. ఇక్కడ మేమందరం నీకు తోడున్నాం. ధైర్యంగా ఉండు!” అంటూ మాలక్ష్మికి ధైర్యం చెప్పింది.

యాక్టింగ్‌లో ఎలాంటి తర్ఫీదు ఇప్పించకుండానే డైరెక్ట్‌గా సెట్స్ మీదకి మాలక్ష్మిని తీసుకువచ్చాడు అంటే... శైలేంద్ర మనసులో ఉన్న దురుద్దేశ్యం లిజీకి తెలుసు. అందుకే మాలక్ష్మిని తన దగ్గరకి చేర్చమని జయసూర్యకి చెప్పింది.

రింగు రింగులుగా పొగ వదులుతూ, సిగరెట్ తాగుతున్న ఆమె వంక భయం భయంగా చూస్తూ, దూరంగా ఉంది మాలక్ష్మి. మూడో ఝాము వరకూ నిద్రపోని లిజీ కళ్ళు, చింత నిప్పుల్లా ఉన్నాయి. ఎడతెరిపిలేని ఆలోచనలతో ఆమె మనసు రగిలిపోతోంది. ఎప్పుడో కోడికూసే వేళకి నిద్రలోకి జారుకుంది. తనవాళ్ళందరికీ దూరమై, నా అన్నదేదీ మిగుల్చుకోలేకపోయిన లిజీకి ప్రతీ రాత్రీ నిద్రలేని రాత్రిగానే ఉంటోంది. ఎప్పుడైనా జయసూర్య పలకరిస్తే, ఆ పలకరింపులో ఓదార్పును వెతుక్కుంటోంది.

రెండు రోజుల తర్వాత లిజీ ఇంటికి వచ్చిన శైలేంద్ర, ఆ ఇంట్లో మాలక్ష్మి ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు.

“ఇక్కడికి ఎందుకొచ్చావు? ఇలా ఇంటివరకూ రావొద్దని నీకు ఎన్నోసార్లు చెప్పాను!” మేడమెట్లు దిగుతూ కోపంగా అరుస్తోంది లిజీ.

"ఏంటీ... కోడిపెట్టని గంపకింద పెట్టి దాచేస్తే, వాసన పసిగట్టలేననుకున్నావా?" మొహంలో మొహం పెట్టి మాట్లాడుతున్న శైలేంద్ర నోటినుంచి గుప్పున వెలువడిన వాసనకి ఆమె ముఖం పక్కకి తిప్పుకుంది.

"అరె! ముందు ముందు ఆ పిల్లకి బ్రైట్ ఫ్యూచరుందని చెప్తున్నా కదా! అర్థం కాదా నీకు? ఎందుకు అడ్డు తగులుతావ్?" తాగిన మైకంలో ఏం మాట్లాడుతున్నాడో తెలీట్లేదు శైలేంద్రకి. మత్తులో తూలుతూ, మాలక్ష్మి ఉన్న గది వైపు వెళ్లబోతుంటే సివంగిలా విరుచుకుపడిన లిజీ అడ్డుకుంది. ఆ తోపులాటలో అనుకోకుండా గోడకి తల తగిలి శైలేంద్ర స్పృహ కోల్పోయాడు.

భయంతో వణికిపోతూ జయసూర్యకి ఫోన్ చేద్దామని ఫోన్ చేతిలోకి తీసుకుంది లిజీ.

"అక్కా! సచ్చిపోయినట్టున్నాడక్కా!" శైలేంద్ర ముక్కు దగ్గర వేలు పెట్టిచూసి, శ్వాస తగలకపోవడంతో అనుమానంగా చెప్పింది మాలక్ష్మి. ఆ మాటలకు ఒక్కసారిగా మ్రాన్పడిపోయింది లిజీ.

"తాగేసి వున్నోడు తూలి పడిపోయిండని పోలీసులకి చెప్పి, తప్పించుకోవచ్చు. యాద్వకు అక్కా! నా కోసవేగా నువ్విట్టా చేసింది!" వయసులో చిన్నదే అయినా లిజీకి ధైర్యం చెబుతోంది మాలక్ష్మి.

అదేపనిగా ఫోను మోగుతున్నా, ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టుగా తియ్యకుండా ఉండిపోయింది లిజీ.

"అన్నా! ఒక్కమారు ఈడకి రారాదే... ఉరుకున రాకుంటే అక్క ప్రానం పోయేట్లాగుంది" జయసూర్య మాట వినపడగానే గుక్కతిప్పుకోకుండా జరిగినదంతా గబగబా చెప్పేసింది మాలక్ష్మి.

"భయం లేదు. అంతా నేను చూసుకుంటాను. ధైర్యంగా ఉండండి. పది నిముషాల్లో అక్కడ ఉంటాను!" చెప్పిన జయసూర్య ఉన్నపళంగా లిజీ ఇంటికి బయలుదేరాడు.

టీవీ ఛానెల్స్ అన్నింటిలోనూ శైలేంద్ర మరణవార్త హోరెత్తిపోతోంది. "శోక సంద్రంలో సినీ పరిశ్రమ" అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో స్క్రోలింగ్ వార్తలు... బ్రేకింగ్ న్యూస్ ప్రసారం చేస్తున్నాయి.

లిజీ ఇంటి సెక్యూరిటీగా పనిచేస్తున్న నారాయణ, తన ఐ ప్యాడ్ తీసి పోలీసులకి చూపిస్తున్నాడు. శైలేంద్ర తాగిన మైకంలో తూలుతూ వచ్చి, లిజీ ఇంట్లోకి వెళ్లడం అందులో క్లియర్‌గా రికార్డ్ అయ్యి ఉంది. అంతేకాదు కారు దిగి, లోనికి వెళ్తూ కారు డోరుని కాలితో గట్టిగా తన్నుతూ... 'లిజీ! నిన్ను వదిలిపెట్టను' అంటూ చేసిన ప్రేలాపనలూ అందులో రికార్డ్ అయ్యాయి. ఆ సాక్ష్యాలే... లిజీని కేసునించి బయటకు తీసుకువచ్చాయి.

"లిజీ! కొత్తగా వచ్చిన సెక్యూరిటీ గార్డుని నమ్మడానికి భయపడ్డావు కదా. చూసావా? అతనే ఇప్పుడు దేవుడిలా నిన్ను కాపాడాడు..." ఓదారుస్తూ దగ్గరకి తీసుకున్నాడు జయసూర్య.

ఇన్నాళ్లూ మ్యాడం అని పిలిచిన వ్యక్తి ఓ తోబుట్టువులా తనను ఓదారుస్తుంటే మొదటిసారి లిజీకి అనుబంధాల విలువ తెలిసొచ్చింది. డబ్బు వ్యామోహంలో పడి తనవాళ్ళందర్నీ దూరం చేసుకున్నందుకు కుమిలి కుమిలి ఏడ్చింది.

అప్పుడే అక్కడికి వచ్చిన మాలక్ష్మి, సెక్యూరిటీగా ఉన్న నారాయణని చూసి... "పెద నాయనా! నువ్వేంది ఈడున్నావు?" అంటూ ఆశ్చర్యంగా అడుగుతుంటే...

"ఈ జయసూర్య బాబే నన్నిక్కడ పనిలో పెట్టాడమ్మా! మీ నాయన ఒట్టి అమాయకుడు. ఆనికీ నాకూ వయసులో పదేళ్లు

యత్యాసం ఉంది. మొదట్నుంచీ నేనీ పట్నంలోనే ఉండిపోయా. నిన్నీడకి ధైర్యంగా పంపినాడంటే నా మీద నమ్మకంతోనే కదా! ఈ మాయదారి పపంచంలో నా బిడ్డ మోసపోకూడదు అంటూ నా సేతులు పట్టుకున్నాడు. అందుకే జయసూర్య బాబు ఇంట్లో పనిజేసే నేను, ఇక్కడ కాపలాకి కుదిరాను!" అంటూ జరిగినదంతా వివరంగా చెప్పి, మాలక్ష్మిని దగ్గరకి తీసుకున్నాడు నారాయణ.

"దారీ తెన్నూ లేక కొట్టుకుపోతున్న నాలాంటివాళ్ళకి నీలాంటి అన్న ఒక్కడుంటే చాలు జయసూర్యా!" కృతజ్ఞతతో లిజీ కళ్ళు వర్షిస్తుంటే... ఆమె ముఖాన్ని తన గుండెలకి హత్తుకున్నాడు జయసూర్య.

**పాఠకులే మా బలం, పాఠకులే మా బలగం.**

**మా బలాన్ని పరిరక్షించుకుంటూ, మా బలగాన్ని పెంపొందించుకోవాలనేది మా కోరిక, మా ఆకాంక్ష. దానికి మీ చేయూత కావాలి. కథామంజరి తెలుగునేల నలుచెరగులా చేరేలా మీ హితులకు, స్నేహితులకు, సన్నిహితులకు పరిచయం చేయండి.**

**కేవలం సంవత్సరానికి రూ. 200 చెల్లించి కథామంజరి బలగంలో సభ్యులుగా చేర్పించండి.**

# సినీమా(యు)

ఉగాది వసంత పూడిపెద్ది






9849455367

### రచయిత్రి పరిచయం

శ్రీమతి పూడిపెద్ది ఉగాది వసంత గారి స్వస్థలం విశాఖపట్నం. కానీ నలభై సంవత్సరాలుగా స్థిరపడింది హైదరాబాద్ లోనే. శ్రీశ్రీ గారు వీరి తాతగారు, ఆరుద్రగారు మేనమామ. విశాఖలో పేరుగాంచిన ప్రముఖ స్వతంత్ర సమరయోధులు, శ్రీ పూడిపెద్ది సుందర రామయ్యగారు వీరి నాన్నగారు. వీరి భర్త భారత ప్రముఖ చిత్రకారులు శ్రీ ఏ. వి. బి. ఎస్. ఆనంద్‌గారు. ఏ.బి.ఏ. చేసిన శ్రీమతి వసంతగారు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో ఫైనాన్స్ మేనేజర్‌గా ముప్పై ఐదు సంవత్సరాలు పని చేశారు. పదవీ విరమణ అయ్యాకా, పూర్తి స్థాయి రచయిత్రిగా మారి, కుటుంబ కథలు, క్రైమ్ కథలు, హాస్య కథలు, ఇలా అన్ని రసాల కథలూ వ్రాస్తున్నారు. వీరి కథలు ప్రముఖ వారపత్రికల్లోనూ, మాస పత్రికల్లోనూ, కొన్ని కథా సంకలనాల్లో ముద్రించబడ్డాయి. అందులో, రెండు సంకలనాలు "తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్" లో చోటు సంపాదించుకోవడం విశేషం. ప్రముఖ పత్రికలు నిర్వహించిన కథల పోటీల్లో, విరివిగా బహుమతులు గెలుచుకున్నారు. త్వరలో రెండు కథా సంపుటులను వెలువరించనున్నారు.

***నీ నటన అద్భుతం. నీలో సహజమైన నటన ఉంది.
అది ప్రస్ఫుటంగా తెలియాలంటే, ఇలాంటి వేదికలే కరెక్ట్.
సినిమాలో ఆ లైట్లు, కట్, ఓకే ల హడావిడిమధ్య, మన ప్రతిభని ఆసాంతం వెలికి తేలేము.
ఇదే పాత్ర నువ్వు ఓ సినిమాలో పోషించి ఉంటే, ఇంత బాగా వచ్చేది కాదేమో"***

"ఏంటి రాజేశ్వరీ! రాను రాను నీకు మొగుడంటే గౌరవ మర్యాదలు బాగా తగ్గిపోతున్నాయి. నేను గమనిస్తూనే ఉన్నాను... పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు అయిపోయేక, నీకు నేనంటే నిర్లక్ష్యం పెరిగిపోయింది!" ఆవేశంగా ఉంది రామారావు గొంతు.

ఆఫీసులకి వెళ్లాలని హడావిడిగా తయారవుతున్నారు కొడుకు శేఖర్, కోడలు శాంతి... అందరికీ అల్పాహారం, మధ్యాహ్నం లంచ్ ఏర్పాట్లలో సతమతమవుతోంది రాజేశ్వరి.

రామారావు ఆవేశపూరిత గొంతు విని గతుక్కుమన్నారు ముగ్గురూను. నాన్నలో ఈ కోణం దాగుందన్న సంగతి శేఖర్‌కి అస్సలు తెలియదు. అలాగే, రాజేశ్వరి కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడింది... తన భర్తలో ఇంత ఆవేశం ఉందా? ఎప్పుడు పన్నెత్తి మాట్లాడ్డం ఎరుగడు. కానీ ఇప్పుడేంటి ఇలా ?

మళ్ళీ రామారావు గొంతు వినిపించింది.

"నువ్వెలా చూసినా, నీ కాళ్ళదగ్గరే పడి ఉంటానని ఊహించుకోకు... నువ్వు దులిపే ఆ నాలుగు మెతుకులు, కాస్త డబ్బు పడేస్తే ఎవరన్నా భక్తితో చేస్తారు. మగవాళ్ళంటే ఆడవాళ్ళూ ఎంత చీదరించుకున్నా, పడి ఉంటారని అనుకోకు!" చివరిగా ఓ

వికటాట్టహాసం కూడా వినిపించింది.

ముగ్గురూ వారి వారి పనులు పక్కన పెట్టి, రామారావు బెడ్‌రూమ్ వైపు నడిచారు. ఆయన మంచం పక్కనున్న కుర్చీలో కూర్చుని, దినపత్రిక చూస్తున్నారు. అలికిడి విని, పేపర్ లోంచి చూపు మరల్చి, వీరి వైపు క్రీగంట చూసారు. అందరి మొహాల్లో ఆందోళన, భయం కొట్టొచ్చినట్టు కనిపించింది. చిన్నగా నవ్వి, మళ్ళీ పేపర్‌లో మొహం దూర్చేసాడు.

రాజేశ్వరితో పాటె, శేఖర్ కూడా వంటింట్లోకెళ్ళి, "అమ్మా! ఆయనకి టిఫిన్, కాఫీ గట్రా టైం కి ఇచ్చావా?" కాస్త విసుగ్గా అడిగాడు శేఖర్.

"అయ్యో! అన్ని టంచన్‌గా అమర్చేనురా... పూచికపుల్ల తేడా చేయలేదు!" ఆదుర్దాగా ఉంది రాజేశ్వరి గళం.

"మరెంటిట? ఎందుకలా రెచ్చిపోతున్నారు? అయినా రిటైర్ అయినప్పటినుండి, ఈయనలో చాదస్తం బాగా పెరిగిపోయింది."

"సరే పదండి పదండి! ఆఫీస్‌కి లేట్ అయిపోతుంది!" ముగ్గురూ టిఫిన్ తిన్నారు, కానీ, ముగ్గురిలోను ఎదో తెలియని ఆందోళన ఉంది. ఇప్పుడు తామిద్దరూ ఆఫీస్‌కి వెళ్ళిపోతే, రాజేశ్వరితో ఏమైనా పేచీ పెట్టుకుంటాడేమో అని బెరుకుగా ఉంది ముగ్గురికి.



ఆఫీస్‌కి బయల్దేరుతూ, "అమ్మా! ఎప్పటి కప్పుడు నాకు మెసేజ్ పెడుతుండు లేదా కాల్ చేయి... అవసరం అయితే, నేను వెంటనే బయలుదేరి వస్తాను... దిగులు పడకు, నేను చూసుకుంటాను!" అని రాజేశ్వరికి ధైర్యం చెప్పి, ఆఫీస్‌కి వెళ్లాడు.

ఆఫీస్ కెళ్తూ, దారంతా, తండ్రి ప్రవర్తనలో మార్పు గురించే ఆలోచించాడు. ఆఫీసుకెళ్లాక కూడా అన్యమనస్కంగానే పనిచేసాడు. జవాబు దొరకని ప్రశ్నలా ఉంది తండ్రి వింత ప్రవర్తన!

★★★

రామారావు ఓ మధ్యతరగతి మనిషి. వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ లో మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. భార్య, ఒక కూతురు, ఒక కొడుకు. కూతురు పెద్దది, ఇంజనీరింగ్ అయ్యాక, పెళ్లి చేసేడు. అల్లుడితో పాటు అమెరికాలో ఉంటోంది. కొడుకు శేఖర్, ఎం బీ ఏ చేసి, బ్యాంకు లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అదే బ్యాంకులో పనిచేస్తున్న శాంతిని ఇష్టపడి, పెళ్లి చేసుకున్నాడు. వీళ్ళు రామారావు, రాజేశ్వరిలతోనే హైదరాబాద్‌లో ఉంటున్నారు.

రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బులతో ఓ రెండంతస్తుల ఇల్లు కట్టించాడు రామారావు. పై పోర్షన్ అద్దెకిచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రామారావు కుటుంబం కాపురముంటున్నారు. పెన్షన్ వస్తుంది. దేనికీ లోటు లేదు!

రామారావు చాల మృదుస్వభావి, ఎదుటివారిని దూషించడం, వ్యంగ్యోక్తులు వేయడం లాంటివి ఎరుగడు. చాలా క్రమశిక్షణ గల వ్యక్తి. పిల్లలిద్దరినీ ఎంతో పద్ధతితో పెంచాడు. భార్యని కూడా ఎప్పుడు తిట్టలేదు. ఆనందమైన కుటుంబం అని అందరు కొనియాడుతారు...

★★★

లంచ్ చేస్తూ కూడా తండ్రి గురించే ఆలోచిస్తున్నాడు. దీనికి సంబంధం లేదు కానీ, ఆ మధ్య ఓ అసాధారణమైన సంఘటన చోటు చేసుకుంది. అది గుర్తొచ్చింది శేఖర్‌కి.

“హలో నాన్నా శేఖర్, ఈరోజు కాస్త త్వరగా ఇంటికి రాగలవా? నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి!” ఫోన్‌లో క్లుప్తంగా మాట్లాడాడు రామారావు.

“ఓకే నాన్నా, సాయంత్రం ఆరింటికల్లా ఇంటికొచ్చేస్తాను. ఓకేనా?” ప్రతి అక్షరంలోను గౌరవం ఉట్టిపడింది.

సాయంత్రం ఇంటికొచ్చాక సూటిగా విషయంలోకెళ్ళిపోయేడు రామారావు.

“నీకు విశ్వనాథం అంకుల్ తెల్సుగా, వాళ్ళబ్బాయి సుభాష్ తన స్నేహితులతో కలిసి, ఓ సినిమా ప్రొడక్షన్ హౌస్ పెట్టాలనుకుంటున్నాడట. విశ్వనాథంకి స్వంత ఇల్లు లేదు. ఈ ప్రొడక్షన్ హౌస్‌కి రిజిస్టర్డ్ ఆఫీస్ కోసం, స్వంత ఇంటి అడ్రస్సే ఉండాలిట. దానికోసం, మన ఇంటి అడ్రస్ వాడుకోడానికి అనుమతి ఇవ్వమని అడిగాడు. మా పిల్లలని అడిగి చెపుతానని చెప్పేను. ఏమంటావ్? నీ అభిప్రాయం చెప్పు నాన్నా!”

“అన్నట్టు ఇంకో సంగతి, నేను చిన్నప్పటినుంచి నాటకాల్లో వేషాలు వేసేవాడిని కదా, రిటైర్ అయి ఖాళీగా ఉన్నానని, పైగా నటనలో అనుభవం ఉంది కనక, ఆ ప్రొడక్షన్ హౌస్ వాళ్ళు, వారి డైరెక్టర్లకి, నాకు వేషాలిమ్మని చెపుతామని చెప్పేరు. ఇదొక్కటే, కాస్త ఆశలు రేకెత్తిస్తోంది!” ముసిముసి నవ్వులతో తన ఆనందం వ్యక్తపరిచేడు రామారావు.

“నాన్నా, నాకున్న అనుభవం ఇంత పెద్ద విషయంలో నిర్ణయం తీసుకోడానికి సరిపోదు. మనకి తెలిసిన లాయర్ సలహా తీసుకుంటే మంచిదని నా అభిప్రాయం!”

“సరేరా, భానుప్రకాష్ అంకుల్ హైకోర్ట్‌లో అడ్వకేట్ కదా, వాడిని అడుగుతానులే.”

రెండ్రోజుల తర్వాత, ఓ రోజు ఉదయాన్నే, శేఖర్‌ని పిలిచాడు తన గదికి.

“భానుప్రకాష్ చెప్పేడు, నా సంతకం ఇప్పుడున్న నా వయసు అరవై ఆరు సంవత్సరాల దృష్ట్యా చెల్లదట! నువ్వు, అక్కా ఒక అఫిడవిట్ ఇవ్వాలట... నేను సంతకం చేయడానికి, మీ ఇద్దరికీ ఎలాంటి అభ్యంతరం లేదని, నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని, ఆ అఫిడవిట్ లో మీరు పేర్కొనాలిట.”

“పైగా ఇంకో మాట చెప్పేడు, సినిమా రంగం వాళ్ళకి ఇవ్వడం అంతా శ్రేయస్కరం కాదని, రిజిస్టర్డ్ ఆఫీస్ అంటే, అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలు, నోటీసులు, ఇత్యాదులన్నీ రిజిస్టర్డ్ ఆఫీస్ అడ్రస్‌కే వస్తాయని, ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగినా, రిజిస్టర్డ్ ఆఫీస్‌నే సంప్రదిస్తారనీను, ఇప్పుడున్న ఆనందమైన జీవితం కాస్త ఇబ్బందుల్లో పడొచ్చు అని కూడా చెప్పారు! అందుకే... విశ్వనాథానికి నా సంతకం చెల్లదని చెప్పేస్తాను. సరేనా?”

“నిజమే నాన్నగారూ, మా కొలీగ్ ఒకాయనకి ఇలాంటి సంకట స్థితి ఎదురైంది! అందులోంచి బయటికి రావడానికి చాల

ఇబ్బందులు పడ్డారట. అయినా మీ ఇష్టం నాన్నగారూ!"

"అలాగే నాన్నా! అయినా నాకు నటించే అదృష్టం లేనట్టుంది!" ఓ నిట్టూర్పు విడిచి, రామారావులోని నటుడు నిరాశపడ్డాడు. ఇది గ్రహించాడు శేఖర్. నాన్నకి నటనంటే అంత ఇంటరెస్ట్ ఉందని అప్పటిదాకా తెలీదు శేఖర్‌కి.

★★★

ఓ సారి తల్లికి ఫోన్ చేసాడు పరిస్థితి భోగట్టా చేద్దామని. అంతా మామూలుగా రోజూలాగే ఉందని చెప్పింది తల్లి. మనసు కాస్త స్థిమిత పడింది. మరేంటి ఇలా సడెన్‌గా ఈ పెనుమార్పు? ఎంత ఆలోచించినా ఏమి పాలుపోడం లేదు.

ఇంతలో రామారావు దగ్గరనుంచి ఫోన్ వచ్చింది. "నాన్నా శేఖర్, నీతో ఓ పదినిముషాలు మాట్లాడాలిరా.."

"అయ్యో నాన్నా, అదెంత మాట! తప్పకుండా సాయంత్రం మాట్లాడుకుందాము!"

శేఖర్ మనసులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. 'అరవై దాటితే, మతిమరుపు వస్తుందని, విపరీతమైన ప్రవర్తన ఉంటుందని' గూగుల్ అంకుల్ చెప్పేడు. నాన్న ఇలాంటి వాటితో ఏమైనా బాధపడుతున్నాడా? అలాంటప్పుడు, వారి పిల్లలు చూపించే శ్రద్ధ చాల కీలకమైనదని కూడా గూగుల్ అంకుల్ చెప్పేడు.

★★★

సాయంత్రం నాన్నదగ్గరికెళ్లి కూర్చున్నాడు శేఖర్.

"నా కొలీగ్ సుబ్బారావు ఉన్నాడు కదరా, అతని కొడుకు డైరెక్టర్ రాఘవేంద్రరావుగారి దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా చేస్తున్నాడట. కుటుంబ కథా చిత్రం తీస్తున్నారుట. దానిలో హీరోకి బాబాయ్ వేషం ఉందిట, అది నన్ను వేయమన్నారు. అయితే, ఓ రెండ్రోజులకి మన ఇల్లు షూటింగ్‌కి కావాలని అడిగారు. షూటింగ్ అంటే ఇల్లంతా బాగా చిందర వందర అయిపోతుందేమో అని అన్నాను. అలాంటిదేమి ఉండదని, వాళ్ళు చాల శ్రద్ధగా చూసుకుని, ఏది డిస్టర్బ్ అవకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చారు. నా చిరకాల వాంఛ సినిమాలో నటించాలని, అదికూడా తీరుతుంది కదరా! వచ్చే శని, ఆదివారాల్లో, ఓ రెండ్రోజులు మనింట్లో షూటింగ్ చేస్తారుట. నీతో ఓ మాట చెప్పి, వాళ్ళకి ఓకే చెప్పాలనుకుంటున్నాను."

"నాకైతే షూటింగ్‌లకి మనిల్లు ఇవ్వడం ఇష్టం లేదు. ఆపైన మీ ఇష్టం నాన్నా!"

"అదిసరే కానీ శేఖర్, పొద్దున్న నేను డైలాగ్స్ ఎలా చెప్పేనురా? నా డైలాగులు విని అమ్మ, మీరు కంగారుగా నా గది దగ్గరికి రావడం గమనించాను. అప్పుడే అనుకున్నాను, నా పెర్ఫార్మన్స్ సహజంగా వుండి ఉంటుంది!" రెట్టించిన ఉత్సాహంతో అడిగాడు రామారావు.

"హమ్మయ్య! అదంతా నటనా? బ్రతికించారు నాన్నా! పొద్దుటనుంచి ముగ్గురం మల్లగుల్లాలు పడిపోతున్నాము, మీ ప్రవర్తనలో వచ్చిన మార్పు అనుకుని." తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు శేఖర్.

"వాళ్ళు స్క్రీన్ టెస్ట్ పెడతారట, కొన్ని ఆవేశపూరితమైన డైలాగులు ప్రాక్టీస్ చేసుకుని సిద్ధంగా ఉండమన్నారు. అందుకు, అవి నేను రాసుకుని ప్రాక్టీస్ చేస్తున్నాను."

భోజనాల దగ్గర రాజేశ్వరి, శాంతిలని కూడా అడిగాడు రామారావు షూటింగ్‌కి ఇల్లు ఇవ్వడం గురించి. ఇద్దరూ ససేమిరా

ఒప్పుకోలేదు.

శాంతి చెప్పింది "మాకు తెలిసినవాళ్ళని ఇలాగే ఇల్లు షూటింగ్‌కి అని అడిగి, వేషం ఇస్తామని చెప్పి, ఓ పాత్ర ఇచ్చి, షూటింగ్ కూడా చేసేరుట. తీరా సినిమా విడుదల అయ్యాక, ఆయన పాత్ర మొత్తం ఎడిటింగ్‌లో లేపేసారుట. ఎవరిని అడగగలరు? పైగా షూటింగ్‌లో వాళ్ళ ఇల్లు చాల డామేజ్ అయిందిట కూడాను. అంచేత ఈ సినిమా వాళ్ళని నమ్మలేము. మీరు కూడా బాగా అలోచించి నిర్ణయం తీసుకోండి మామయ్యగారూ!"

ముగ్గురి మాటల్లోనూ, రామారావు పట్ల గౌరవం, గోరంత కూడా తగ్గలేదు.

తల తటాయించి, దీర్ఘంగా ఆలోచిస్తూ అక్కడనించి లేచి వెళ్ళిపోయేరు రామారావు.

★★★

ఆరోజునుండి కాస్త డల్‌గా అయిపోయేరు రామారావు. అది గమనించారు కుటుంబసభ్యులు.

ఇంతలో శేఖర్ పనిచేసే బ్యాంకు రజతోత్సవ వేడుకలు వచ్చాయి. ఆ ఫంక్షన్‌లో ఇతర వినోదాలతో పాటు, ఒక నాటకం కూడా ప్లాన్ చేసేరు. ఇది కేవలం తండ్రి ఇంటరెస్ట్‌ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసేడు శేఖర్. ఓ మంచి నాటకం తానే స్వయంగా రచించి, దర్శకత్వం వహించి అందులో ముఖ్య పాత్రని తానే పోషించాడు రామారావు.

అన్ని వినోద కార్యక్రమాల కంటే, ఈ నాటకం ఓ ప్రత్యేకతని సంతరించుకోడం విశేషం. సభలో రామారావు ప్రతిభని వక్తలందరు వేనోళ్ళ కొనియాడారు. రామారావు ఆనందానికి అవధులు లేవు.

ఇంటికొచ్చేక, శేఖర్‌ని కౌగలించుకుని తన కృతజ్ఞతని తెలియజేసేడు.

"నాన్నా! నీ నటన అద్భుతం. నీలో సహజమైన నటన ఉంది. అది ప్రస్ఫుటంగా తెలియాలంటే, ఇలాంటి వేదికలే కరెక్ట్. సినిమాలో ఆ లైట్లు, కట్, ఓకేల హడావిడి మధ్య, మన ప్రతిభని ఆసాంతం వెలికి తేలేము. ఇదే పాత్ర నువ్వు ఓ సినిమాలో పోషించి ఉంటే, ఇంత బాగా వచ్చేది కాదేమో! ఇలా అంటున్నానని నాకు సినిమాలంటే విముఖత లేదు, కానీ సరి అయిన దర్శకుడు దొరికి, నిన్ను మనస్ఫూర్తిగా ప్రోత్సహించే వారైతేనే, నీ ప్రతిభ వెలికి వస్తుంది. ఇప్పుడు చూడు, మన సర్కిల్‌లో అందరు నిన్ను ఓ 'మహానటుడిగా' గుర్తుపెట్టుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ప్లాన్ చేద్దాము నాన్న. నీకు నేనున్నాను నాన్నా!" అని రామారావుని గట్టిగా గుండెలకి హత్తుకుని, ముద్దాడాడు శేఖర్.

ఇద్దరి కళ్ళు ఆనందభాష్పాలు వర్షించాయి. ఎన్ని లక్షలు పెడితే ఈ ఆనందాన్ని కొనగలం?

రేడియో పెట్టింది రాజేశ్వరి. దేవిశ్రీప్రసాద్‌గారి పాట ప్రేమను పలికిస్తోంది...

'ఈ అందమైనా... రంగుల లోకానా...
ఒకేజన్మలో వంద జన్మల ప్రేమను పంచిన
నాన్నకు ప్రేమతో... నాన్నకు ప్రేమతో...
నాన్నకు ప్రేమతో అంకితం నా ప్రతీ క్షణం...



📞 9951250144

ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

# సాలెపురుగు గూడు వదిలింది

అత్తలూరి విజయలక్ష్మి

## రచయిత్రి పరిచయం

*శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి నాలుగు దశాబ్దాలుగా సాహితీ రంగంలో ఉన్నారు. ఇంతవరకు వీరివి మూడు వందలపైన కథలు, ఇరవై ఐదు నవలలు, అనేక దిన, వార, మాస పత్రికల్లో అంతర్జాల పత్రికల్లో ప్రచురించబడినాయి. శ్రీమతి విజయలక్ష్మి గారు అనేక రంగస్థల, శ్రవ్య నాటకాలు కూడా రచించారు. వీరు రచించిన నాలుగు టి వి సీరియల్స్, అనేక టి వి ఫిలిమ్స్, సింగల్ ఎపిసోడ్స్ ప్రసారం అయినాయి. టి వి సీరియల్‌కి unisef అవార్డు, వీరి నాటకానికి ఆకాశవాణి నాటక పోటీలలో ప్రథమ బహుమతి, సిరికోన, కోడూరి పార్వతి విశిష్ట రచయిత్రి పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, శ్రీ జొన్నవిత్తుల రామకృష్ణశర్మ గారి జీవనసాఫల్య పురస్కారం తో పాటు అనేక పురస్కారాలు శ్రీమతి విజయలక్ష్మి గారు అందుకున్నారు. జలమండలిలో అధికార హోదాలో పదవీ విరమణ చేసినా శ్రీమతి విజయలక్ష్మి గారి అనేక నవలలు, కథలు కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువదించబడినాయి. వీరి నవలల మీద, కథల మీద ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు ఇద్దరు డాక్టరేట్ పొందారు. సుదీర్ఘ విరామం తరవాత 'సినిమా రంగమార్తాండ' కథల పోటీ ద్వారా తిరిగి కథా ప్రపంచంలోకి ప్రవేశించారు!*

***నలభై ఏళ్ల నా కల... ఇంతకాలం అమ్మ, నాన్న, భర్తల గౌరవం***
***నిలబెట్టడానికినా ఆశలు చంపుకున్నాను...***
***ఇప్పుడు కొడుకు గౌరవం నిలబడడానికి కూడా నేనే నా కోరికలు త్యాగం చేయాలా! ఎందుకు?***
***గౌరవం అంటూ పోతే నా గౌరవం కదా పోయేది!***
***ఏమైనా సరే... ఇక నుంచి నా కోసం నేను బతకాలి. అంతే!***

"అమ్మా ఫోన్" కమల నా మొబైల్ తీసుకుని వచ్చి ఇచ్చింది.

మూసుకుపోతున్న కళ్ళు బలవంతంగా తెరిచి స్క్రీన్ మీద చూసాను. మత్తులో నాకేమీ కనిపించలేదు. అవతల నుంచి 'హలో! మేడం!' అని వినిపిస్తోంది.

"హలో!" అన్నాను.

"మేడం! గుడ్ మార్నింగ్! మీకో శుభవార్త. పిక్చర్ హిట్ అయింది. ఫోర్ షోస్ నిన్న హౌస్‌ఫుల్!" ఉత్సాహంగా చెప్పాడు మనోజ్.

నా నిద్ర మత్తు వదిలిపోయింది. ఒక్క ఉదుటున లేచి కూర్చుని "నిజమా!" అన్నాను.

"నిజంగా నిజం మేడం" అన్నాడు మనోజ్ మరింత ఉత్సాహంగా.

"థాంక్స్ మనోజ్! ఉదయాన్నే నిద్రలేపి మరీ గుడ్ న్యూస్ చెప్పావు. ఎంత టెన్షన్ పడ్డానో. థాంక్స్ నాన్నా!" అన్నాను ఆనందంతో గద్గదిక స్వరంతో.

"మీకు ఫస్ట్ మూవీ అయినాసరే, చాలా బాగా నటించారు మేడం. అసలు ఈ సినిమా రెండేళ్ళ క్రితమే తీయాలి అనుకున్నారు గౌతమ్‌గారు. కానీ, ఆ పాత్రకి సూటబుల్ ఆర్టిస్ట్ దొరక్క డిలే చేసారు. ఆరోజు మీరు మాల్‌లో కనిపించగానే ఆయన ఉత్సాహం చూడాల్సిందే. మిమ్మల్ని మూవీలో చేస్తారా అని అడగడానికి చాలా సందేహించారు. ఆవిడ టిపికల్ ఫ్యామిలీ లేడిలా ఉన్నారు. అడిగితే ఏమనుకుంటారో అని చాలాసేపు ఆలోచించారు. నేను 'ఫర్వాలేదు సర్ అడుగుదాం. ఇష్టం అయితే సరే అంటారు. లేకుంటే సారీ అంటారు అంతే కదా!' అనడంతో అడిగారు. మీరూ ఒప్పుకున్నారు. అంతా కలిసి వచ్చింది. ఓకే... మీరు రెడీ అయ్యాక ఆఫీస్‌కి రండి. సక్సెస్ మీట్ ఉంది." అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసాడు మనోజ్.

నా మనసు గాలిలో తేలిపోసాగింది. నిజంగా హిట్ అయిందా! నాకు నటన వచ్చన్నమాట. మొట్టమొదటి అవకాశమే ఎంత మంచి పాత్రతో వచ్చింది! నన్ను నేను ప్రూవ్ చేసుకోడం కాదు. నిర్మాత, దర్శకుడు నా మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను.

దుప్పటి విసిరేసి మంచం దిగి కమలతో అన్నాను "కమలా! నా కల నెరవేరిందే.... నా మొట్ట మొదటి సినిమా సక్సెస్ అయింది... నేను పడిన తపన, కష్టం ఫలించింది." అన్నాను.



కమల మొహం వికసించింది. "నాకెప్పుడు చూపిస్తవమ్మా?"అంది.

"తప్పకుండా చూపిస్తాను. నీకు, మీ ఆయనకీ ఇద్దరికీ టికెట్స్ తెప్పిస్తాను. వెళ్లి చూసిరండి!" చెప్పేసి బ్రష్ చేసుకోడానికి వాష్‌బేసిన్ దగ్గరకు నడిచాను.

"విజయ సార్‌కి చెప్పవామ్మా?" కమల గొంతు విని నా చేతిలో నుంచి టూత్‌బ్రష్ కింద పడింది. నిలుచున్న చోటే స్థాణువులా నిలబడిపోయాను.

ఆరునెలలుగా వాడు కనీసం ఒక్కసారన్నా ఫోన్ చేసి, ఎలా ఉన్నావమ్మా అని అడగలేదు. నేనే చేసాను నాలుగైదు సార్లు. ఎంతో ముభావంగా, ముక్తసరిగా మాట్లాడాడు. నేనేం తప్పు చేసానో, వాడికి ఎందుకు కోపం వచ్చిందో నాకు అర్థం కావడం లేదు.

కమల కింద పడిన బ్రష్ తీసి నా చేతికి ఇచ్చింది. యాంత్రికంగా అందుకుని, బ్రషింగ్ పూర్తి చేసుకుని, స్నానానికి వెళ్ళిపోయాను.

"ఇప్పుడా! నువ్విప్పుడు యాక్టింగ్ మొదలుపెడితే నా ఫ్రెండ్స్‌కి నా మొహం ఎలా చూపించను! వీల్లేదు నువ్వు యాక్ట్ చేయడానికి నేనొప్పుకోను!" కచ్చితంగా చెప్పాడు... ఆరోజు నాకు అనూహ్యంగా వచ్చిన ఒక మంచి సినిమా ఆఫర్ గురించి చెప్పగానే.

చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే ఎంతో ఇష్టం. నాన్నకి, అమ్మకి కూడా సినిమాలు ఇష్టం. విడుదల అయిన ప్రతి సినిమా చూసే నాన్నతో కలిసి నేనూ వెళ్ళేదాన్ని! తెరమీద కనిపిస్తున్న కథానాయికలలో నన్ను నేను ఊహించుకుంటూ, వాళ్ళలా అభినయిస్తూ నటన పట్ల నాకు తెలీకుండానే ఒక ఆకర్షణ, ఆసక్తి ఏర్పరచుకున్నాను. అప్పుడే నాన్నని అడిగి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించాలి అనుకున్నాను. నేనా మాట ఎత్తగానే నాన్న మండిపడ్డారు. "వెధవ ఆలోచనలు రానీకు మనసులోకి. గౌరవనీయమైన కుటుంబం మాది. మేము తలెత్తుకోవాలా వద్దా!" అన్నారు.

సినిమా చూసి వచ్చాక అమ్మకి ఆ కథంతా చెబుతూ, "సావిత్రి ఎంత బాగా చేసిందనుకున్నావూ.... ఆ సన్నివేశంలో, నాకే కళ్ళ నీళ్ళు వచ్చాయి. రామారావు మాత్రం. అబ్బ ఆ నటన అమోఘం. ఎంతైనా మహానటులు వాళ్ళు!" అని పారవశ్యంలో మునిగిపోయే నాన్న, "రామారావుగారి పాండవ వనవాసం మళ్ళీ వచ్చిందిట... రేపో, ఎల్లుండో నన్ను ఆ సినిమాకి తీసుకుని వెళ్ళకూడదూ! ఈ జీవితానికి పరమార్థం ఉంటుంది!" అనే అమ్మ కూడా.... నేను సినిమాల్లో నటించాలని ఉంది అని చెప్పగానే నా మీద విరుచుకుపడడం ఆశ్చర్యం కలిగించింది.

పెళ్లి అయ్యాక శ్రీహరికి కూడా సినిమాలంటే ఉన్న ఆసక్తి గమనించి, "నాకూ యాక్ట్ చేయాలని ఉంది" అంటూ నా మనసులో మాట చెప్పాను తన రియాక్షన్ గమనిస్తూ.

"పిచ్చెక్కిందా! నువ్వు యాక్ట్ చేస్తావా! నువ్వు ఫ్యామిలీ ఉమెన్... మర్చిపోకు!" అన్నాడు.

ఇప్పుడు సుమారు నాలుగు దశాబ్దాలు గడిచిన తరవాత ఇరవై ఒకటో శతాబ్దపు ప్రతినిధి అయిన నా కొడుకు కూడా, నాకొచ్చిన ఆఫర్ చెప్పగానే "ఛీ, ఛీ... నువ్వు ఈ వయసులో సినిమాల్లో నటించడం ఏమిటమ్మా!" అన్నాడు.

"నా వయసుకి తగిన పాత్రేరా! చాలా మంచి కథ. డీసెంట్ కారెక్టర్‌రా... సినిమాల్లో నటించాలన్నది నా చిన్నప్పటి కల. మీ తాతయ్య, మీ నాన్న ఎవరూ నాకు సహకరించలేదు సరికదా సినిమాలో నటించడం అనేది పెద్ద క్రైమ్‌లా మాట్లాడారు. నువ్వు ఈ కాలం పిల్లాడివి. నువ్వు అలాగే మాట్లాడతావేంటి?" అన్నాను నాకు వచ్చిన అవకాశం వదులుకోడానికి అయిష్టత వ్యక్తం చేస్తూ.

"నీకేం తెలుసు ఇండస్ట్రీ ఎంత చండాలంగా ఉందో... పైకి కనిపించే రంగుల బొమ్మలు, ఆడంబరాలు చూసి ఇన్‌ఫ్లూయెన్స్ అవడానికి నువ్వేం చిన్నపిల్లవా! వద్దమ్మా. మాకు ఇష్టం లేదు!" అన్నాడు నిక్కచ్చిగా 'మాకు' అన్న మాటలో తన భార్య అయిష్టత కూడా వ్యక్తం చేస్తూ.

ఆరోజు నుంచీ ఈ రోజు వరకు సినిమా చూడడానికి ఉవ్విళ్ళూరే నా కుటుంబ సభ్యులు, నేను నటిస్తా అంటే పరువు తక్కువగా ఎందుకు భావించారో నాకు అర్థం కాలేదు. సినిమా పరిశ్రమ మీద అంత చులకన భావం ఉన్నప్పుడు సినిమాలు ఎలా చూసారు? రకరకాల ఉద్యోగాలలాగా నటన అనేది కూడా ఉద్యోగం అనుకోవచ్చుగా! కాకపోతే ఫీల్డ్ వేరు. వాళ్ళు చేసే వృత్తి అగౌరవమైనది కానప్పుడు, నటన అగౌరవం ఎందుకు అనుకున్నారు? పైగా నాట్యం, సంగీతం, సాహిత్యంలాగా నటన కూడా కళ అని నాన్నేగా అన్నారు. నటులు అంటే కళాకారులు. కళాకారులు గౌరవనీయులు కాకుండా ఎలాపోతారు?

లక్ష సందేహాలు, కోట్ల ప్రశ్నలు, అణచుకున్న ఆశలు అలా నాలో గుట్టల్లా పేరుకుపోతూ ఉండగానే శ్రీహరి పోయాడు. కూతురు, కొడుకుల చదువులు, ఉద్యోగాలు అయ్యాక పెళ్ళిళ్ళు చేసి, వాళ్ళ జీవితాలకి ఒక స్థిరత్వం ప్రసాదించి, నాకో స్వంత ఇల్లు, నెల, నెలా పెన్షన్ అందేలా ఏర్పాట్లు చేసి, తన బాధ్యతలు పూర్తిగా నెరవేర్చుకుని వెళ్ళిపోయాడు. కూతురు అమెరికా వెళ్ళిపోయింది భర్తతో. రెండేళ్ళ నుంచి ఒంటరితనం నా మీద దాడి మొదలుపెట్టింది. కొడుకు, కోడలు కళ్ళ ముందే ఉన్నా ఏదో తెలియని దిగులు, బాధ, ఇన్నేళ్ళూ నాతో నడిచి, నాతో నవ్వి, నాతో కలిసి జీవించిన సహచరుడు వెళ్ళిపోగానే, జీవితంలో ఏదో తెలియని శూన్యం! అమ్మా, నాన్నా ముందే వెళ్ళిపోయారు. అప్పుడూ దిగులుతో కృశించిపోయాను. కానీ అప్పుడు ఓదార్చడానికి శ్రీహరి ఉన్నాడు. ఇప్పుడు నాకు ఓదార్పు లేదు. కొన్ని రోజులు మాత్రం విజయ్... నేను ఆయన పోయిన బాధ నుంచి తేరుకోడానికి ప్రయత్నించాడు. తరవాత వాడి రొటీన్‌లో పడిపోయాడు. కానీ, నా రొటీన్ అదే. వంట చేయడం, ఇల్లు సర్దడం, తినడం, పడుకోడం!

ఇదివరకులా సినిమాల మీద, టి వి సీరియల్స్ మీదా, పుస్తకాల మీదా ఏ మాత్రం ఏకాగ్రత కుదరడం లేదు. కొడుకు, కోడలు ఉద్యోగాలకు వెళ్ళిపోగానే ఇల్లంతా నిశ్శబ్దం. శ్రీహరి పిలుపు గది గోడలలో ప్రతిధ్వనిస్తూ ఊపిరి తీసుకోనివ్వకుండా చేసింది. ఆ శూన్యం నుంచి నన్ను బయటపడేయడానికి ఎవరూ లేరు. మిగిలిన జీవితం గడపడానికి నన్ను నేనే సమాయత్తం చేసుకోవాలి. ఆ ప్రయత్నంలో భాగంగా బయటకు వెళ్ళి, ఇంటికి కావలసిన సామాన్లు, సరుకులు, కూరలు స్వయంగా తెచ్చుకోడం మొదలుపెట్టాను. అప్పుడే పక్కింటి వినూత్న ఒకరోజు మాల్‌కి వెళ్తూ నన్ను రమ్మంది. వెళ్లాను. ఆరోజే గౌతమ్‌గారు నన్ను చూసి ఈ సినిమా కథ చెప్పి “మీకు నటన మీద ఆసక్తి ఉందా!” అని అడగడం జరిగింది.

ఆక్షణం నన్ను నేను మర్చిపోయాను. పెద్ద షాక్ తగిలినట్టు నిలబడిపోయిన నన్ను ప్రోత్సహిస్తూ వినూత్న “వావ్ ఆంటీ! మీరెంత లక్కీ. ఓకే చెప్పేయండి. మంచి ఛాన్స్ చెప్పండి... చెప్పండి!” అంటూ ఒత్తిడి చేసింది.

‘కొడుకుని అడిగి రేపు చెప్తాను’ అని ఫోన్ నెంబర్ తీసుకున్నాను. వాడి అంగీకారం అడిగినందుకు వాడు నాకు ఇచ్చిన గౌరవం నిరాకరణ.

నలభై ఏళ్ల నా కల... ఇంతకాలం అమ్మ, నాన్న, భర్తల గౌరవం నిలబెట్టడానికి నా ఆశలు చంపుకున్నాను. ఇప్పుడు కొడుకు గౌరవం నిలబడడానికి కూడా నేనే నా కోరికలు త్యాగం చేయాలా! ఎందుకు? గౌరవం అంటూ పోతే నా గౌరవం కదా పోయేది! ఏమైనా సరే... ఇక నుంచి నా కోసం నేను బతకాలి. అంతే! నా నిర్ణయం విని ‘అయితే, నీ దారిన నువ్వుండు... నా దారి నాది’ అంటూ నిర్దయగా, పాతికేళ్ళు ఎన్నో త్యాగాలు చేసి అల్లుకున్న బంధాల పందిరి కూల్చేసి వెళ్ళిపోయాడు.

ఆలోచనలతోటే రెడీ అయాను. షూటింగ్ పూర్తయి, డబ్బింగ్, ఎడిటింగ్, మిక్సింగ్ అయ్యాక, ప్రమోషన్ అంటూ టి వి ఛానెల్స్‌లో వరసగా ప్రోగ్రామ్స్, ఇంటర్వ్యూలు బిజీగా గడిచింది. మరో ఆఫర్ కూడా వచ్చింది నిన్ననే. కానీ, నిర్ణయం తీసుకోడానికి సందేహం. ఈ సినిమా చూసి, “నీలో ఇంత టాలెంట్ ఉందా! సరేనమ్మా కంటిన్యూ చేయి!” అని కొడుకు అంటే బాగుండు అనిపిస్తోంది. కనీసం రిలీజ్ అయింది ఎలా ఉంది టాక్? అని అన్నా అడుగుతాడు అనుకున్నాను. దుఃఖం వచ్చేసింది. కనీసం సురసన్నా సంతోషిస్తుందేమో అనిపించింది.

సురసకి ఫోన్ చేసాను. “ఏంటమ్మా! నీకేమైంది ఈ వయసులో సినిమా పిచ్చేంటి అసహ్యంగా. మనవళ్ళతో, మనవరాళ్ళతో ఆడుకుంటూ వాళ్ళ ఆలనా, పాలనా చూడాల్సిన వయసులో.... చేసింది చాలు. ఇంక నటించవద్దు!” అని గట్టిగా చెప్పి ఫోన్ పెట్టేసింది.

గుండె మీద దాని మాటలు సమ్మెట పోట్లలా తగిలాయి.

మమతలు, బాధ్యతలు అనే సాలెగూడులో చిక్కుకుపోయి బయటకు రాలేక గిలగిల తన్నుకున్న సాలెపురుగుని ఇంతకాలం. సాలెపురుగు గూడు వదిలింది. స్వేచ్ఛగా ఎగురుతుంది ఇక.

డ్రైవర్ వచ్చి కాలింగ్ బెల్ కొట్టడంతో కారు కీస్ అతనికి ఇచ్చి, “కమలా! బ్రేక్‌ఫాస్ట్ రెడీనా!” అని అడుగుతూ డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచాను తరవాత సినిమా షూటింగ్ తలచుకుంటూ.


**కొత్త కలాలను కథామంజరి స్వాగతిస్తుంది. అలా అని పాత కలాలను విస్మరిస్తుందని అనుకోవద్దు. రచన కొత్తగా ఉండాలి గాని రచయిత కొత్తా, పాతా అని కథామంజరి ఎప్పుడూ వివక్ష చూపదు. మీ కలాలను విదిలించండి కొత్తదనాన్ని ఈ తరానికి అందించండి.**

**కథామంజరి సంపాదకవర్గం**

**అవసరాల వెంకటరావు**
**99899 76688**


**జయంతి ప్రకాశ శర్మ**
**98486 29151**

**మీ అభిప్రాయాలు/మీ కథలు పంపుటకు: *submit@kathamanjari.in***

**చందాదారులుగా చేరుటకు: *www.kathamanjari.in***

# జపాను

శ్రీరాజ్



**విశిష్ట అతిథి కథ**

“ఒరే, జపానూ! పాసింజర్లకి ఏటో కావాలంట సూడరా” – పాసింజర్లను గదిలోకి పంపి, గుమ్మం ముందు గుమ్మటంలా కూర్చుని డబ్బు లెక్కపెట్టుకుంటున్న సూరమ్మ హూంకరింపు అది.

“ఒరే జపానూ! తల నొప్పెడుతోంది, రెండనాసిన్లు పట్టుకురా... బాబ్బాబూ...”– నలిగిపోయిన చీరను, చెరిగిపోయిన తలను సవరించుకుంటూ, గది తలుపులు తీసుకొని, బయటకు వచ్చిన పంకజం అర్థింపు అది.

“జపానూ! సంగం ఆలుకెళ్ళి మావకీ కేరీజు యిచ్చిసీ పాౖరారా... నీకు సినిమా సూపిస్తాడ్లే...” సినిమా హాల్లో పనిచేసే పోలారావు పెళ్లాం పురమాయింపు అది.

“ఓరీ జపానుగా! పది నిముసాల్లో ఒట్టు కొచ్చినావా సరి నేపోతే, నీ బీపు యిమానం మోతవుద్ది ఎళ్ళరా ఎదవ కొడకా...” తాగింది చాలక, మరో బుడ్డి నాటు కోసం తహతహలాడిపోతున్న అసిరయ్య బెదిరింపు అది.

ఒకరిది సాధింపు. ఇంకొకరిది అదిలింపు. వేరొకరిది సతాయింపు. ఇంపుగా, విసుగు లేకుండా అందరి పనులు చేయడం జపాను ప్రత్యేకత. జపాను అందరి తల్లో నాలుక. ఎవర్నీ కాదనే నాలుక జపానుకి లేదు.

‘జపాను’ అని పిలవబడే ఆ శాల్తీకి మరో పేరు లేదు. పేరు జపానే. జపాను పుట్టుపూర్వోత్తరాల గురించి నాలుగు మాటలు – అక్కడున్న ఎవర్ని అడిగినా చెప్తారు.

చాలాకాలం క్రిందట ఆమె. ఆమె పేరు అప్రస్తుతం. పుట్టడం నేరం కాకపోయినా, యవ్వనం యిచ్చిన అందం ఆమె పాలిట శాపం అయింది. ఆ అందాన్ని, అంతకు మించిన అమాయకత్వాన్ని చూసి, ఓ కాముకుడు ప్రేమికుడిగా నటించి ఆమెను తన దారికి తెచ్చుకున్నాడు. అందమైన దారొకటి చూపిస్తానని ఆమె బతుకుతున్న పరిసరాలకి, అయిన వాళ్లకి దూరంగా తీసుకుపోయాడు.

కలలో కనిపించే రాజకుమారుడు తెల్లగుర్రం మీద తనని ఆకాశంలోకి, ఆపైన స్వర్గలోకంలోకి తీసుకెళుతున్నాడని కళ్లు మూసుకొని కలలు కంది. ఆమె కళ్ళు తెరిచి చూసే సరికి, తను నేల మీదే ఉన్నట్లు ఆపైన నరక లోకంలో ఆడయముడి లాంటి సూరమ్మ చేతుల్లో చిక్కుకున్నట్లు తెలిసింది. తన ప్రేమికుడు...కాదు కాదు... కాముకుడు తియ్యటి కబుర్లతో తన అందాన్ని జుర్రుకొని ఆ తర్వాత సూరమ్మకి అయిదొందలకి అమ్ముకొని, పలాయనం చిత్తగించాడు. ఆ దుర్మార్గుడు పరిచయం చేసిన సూరమ్మ తనకి అత్తగారు కాదని, ‘ముండలేపారం యజమాని’ అని తొందరలోనే తెలిసిపోయింది. ఏం తెలుసుకున్నప్పటికి తన జీవితాన్ని తివాచీగా పరచక తప్పలేదు. ఆ తివాచీ మీద ఎందరో నడిచిపోయారు.

ఒకసారి ఎవరో జపాన్ దొర వచ్చి వెళ్ళేక ఆమెకి కడుపొచ్చింది. ఆ కడుపులో కుళ్ళును పోగొట్టడానికి సూరమ్మ చాలా

ప్రయత్నాలు చేసింది. ఫలితం లేకపోయింది. ఈ ప్రపంచంలోకి మరో కొత్త ప్రాణి వచ్చింది. పొత్తిళ్ళలో ఎర్రగా బొద్దుగా ఉన్న పసిబిడ్డ చిన్న కళ్ళు, చప్పిడి ముక్కు చూసి, "ఈడచ్చు జెపాను దొరలాగున్నాడ"న్నారు, అక్కడ కొంపల్లో రొచ్చులో కుళ్ళులో చీకటిలో దరిద్రంలో బ్రతికేస్తున్న జనాలు. ఆ విధంగా ఆ పసివాడికి 'జపాను' అని నామకరణం జరిగింది.

ఆ పసివాణ్ణి చూసి, ఆమె చాలా చాలా మురిసిపోయింది. జపాను దొరలాగే ఎంతో ఎంతో ఎదిగిపోతాడని, మోసాలతో నిండిన ఈ లోకాన్ని, కుళ్ళుతో నిండిపోయిన మనుషుల్ని బాగుచేస్తాడని, తనని చీకటి నుండి వెలుగులోకి నడిపిస్తాడని... ఎన్నోఎన్నో అనుకుంది. ఆశలు పెంచుకుంది. కానీ, పదిమంది కోసం పరచిన తివాచీ అప్పటికే పేలికలు చీలికలయి పోయింది. జపానుకి 'అమ్మ' అనే పిలుపు రాకముందే ఆమె పిలుపుకి అందనంత దూరానికి వెళ్ళిపోయింది.

జపాను ఒంటరిగా మిగిలిపోయాడు. జపానుకి ఎవరూ లేరు. కానీ, జపాను అందరికీ కావాలి. అందుకే, పిచ్చి మొక్కను ఎదగనిచ్చారు.

అప్పట్నుంచి ఆ ప్రపంచంలోనే జపాను పెరిగాడు. ఆ వాతావరణంలోనే జపాను నవ్వడం, నడవడం, అల్లరి చేయడం, ఆడుకోవడం అన్నీ నేర్చుకున్నాడు.

★★★



జపాను నిద్ర లేచి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు.

గదంతా చీకటిగా ఉంది. అదే పనిగా దోమలు రొదచేస్తున్నాయి. ఒక్క అడుగు ముందుకి వేయటానికి వీల్లేకుండా కటకటాలు ఎదురుగా ఉన్నాయి. దూరంగా మసక వెలుతురులో సెంట్రీలు కనిపిస్తున్నారు.

జపాను చిన్నగా నవ్వుకున్నాడు, తన పాత ప్రపంచానికి దూరంగా ఉన్నందుకు.

వారం, పది రోజుల క్రిందట తన బతుకు వేరుగా ఉండేది.

చీకటి పడుతుంది. అప్పుడే చీకటి బతుకులకు, ఆకలి కడుపులకు, నిరాశలకు, నిట్టూర్పులకు తెల్లవారుతుంది. మురికి సందుల్లో, ఇరుకు కొంపల్లో ఎండిన గుండెల్లో, గాజు కళ్ళల్లో ఒకటే సందడి. ఒకటే హడావుడి.

సద్దుమణిగే సరికి అర్థరాత్రి దాటుతుంది. అప్పటికి గాని తనకి తీరిక దొరకదు. తినటానికి తిండి దొరకదు. పడుకోవటానికి చోటు దొరకదు. అందర్నీ ఒప్పించాలి. ఎవర్ని నొప్పించినా చీవాట్లు, దెబ్బలు తినాలి. పస్తులుండాలి.

తెల్లవారుతుంది.

దారంతా చిందరవందరగా ఉన్న పగిలిన గాజులు నలిగిన పువ్వులు, రాత్రంతా మంచుకి తడిసిన మట్టిలో పిల్లలు చేసే గొడవలు, బతుకంతా దరిద్రం, రోగాలతో నిండిన మనుషుల మూలుగులు – వీడ్కోలు ఇస్తున్న సమయంలో మస్తూ తాత అడుక్కోవటానికి బయల్దేరతాడు. మస్తూ తాతకి కళ్ళు లేవు. దారి తెలీదు. తాతకి కళ్ళూ, దారీ తనే. ఉదయాన్నే తాతని తీసుకు వెళ్ళడం, నలుగురూ వచ్చేపోయే చోట గుడ్డపరిచి కూర్చోబెట్టడం పొద్దుపోయేవరకు తోడుగా ఉండడం, మళ్ళీ తాతను గూటికి చేర్చడం తను చేయాలి. ఏ ఒక్కటి చేయకపోయినా మధ్యాహ్నం తాత యిచ్చే రొట్టెముక్క టీ నీళ్ళు దొరకవు. తాత పెట్టే బూతులు మస్తుగా తినాలి.

ఇప్పుడు తనకి కావలసినంత తీరిక. 'అది చెయ్యి ఇది చెయ్యి' అని ఎవరూ తనకి పనులు పురమాయించడం లేదు. సూరమ్మ మామ్మ, పంకజం పిన్ని, పోలారావు మావయ్య, అసిరయ్య పెద్ద, మస్తూ తాత – ఒక్కరూ కనిపించడం లేదు.

తను హంతకుడు. ఒక పెద్దమనిషిని హత్యచేసిన నేరానికి తనని జైల్లో పెట్టారు. కావాలనే, తను హత్య చేసి జైలుకి వచ్చాడు. చాలా సంతోషంగా ఉంది. తను పెరుగుతున్న చీకటి చోటు నుంచి, ఇరుకు బతుకు నుండి బయటపడినందుకు.

ఠాణాలో గడియారం గంటలు వినిపించాయి.

కోర్టు బోనులో, పది మంది తెలివైన వాళ్ళ మధ్య, దేవుడి లాంటి జడ్జిగారి ముందు గుండెల్లో దాగిన నిజంతో నిర్భయంగా జపాను నిలబడ్డాడు.

పది గంటలు దాటింది. జడ్జీగారు రావటంతో కోర్టు హాలులో అలజడి తగ్గింది.

పదేళ్ళయినా నిండని ఓ పసివాడు పట్టపగలు నడిరోడ్డు మీద తనకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని దారుణంగా ఎందుకు హత్యచేసినట్లు?

ప్రాసిక్యూషన్ వారూ, డిఫెన్సు వారూ వాదించుకున్నారు. కారణాలు వెలికి తీయటానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కోర్టు వారు – సూరమ్మను, ఆసిరయ్యను, మస్తూ తాతను పేరు పేరునా పిలిపించారు. ప్రశ్నలు వేశారు. పాయింట్లు లాగారు. ఒక్కొక్కరూ బోనులోకి వచ్చారు. దేవుడి ఎదుట ప్రమాణం చేసి, అంతా నిజమే చెప్పారు.

ఆకలి బాధకు తట్టుకోలేక, ఎవర్నో దోచుకోవాలనే దురుద్దేశంతో జపాను హత్య చేయలేదు. తన తల్లిని కుళ్ళు సమాజానికి అప్పగించి, జపాను పతనానికి కారణమయ్యాడన్న కోపానికి ఆ వ్యక్తి బలి కాలేదు. చనిపోయిన పెద్దమనిషితో ఎలాంటి పరిచయం లేని జపాను కక్షతో ఈ దారుణం చేయలేదని తేలిపోయింది. తమ స్వార్థం కోసం ఎవరూ తనని పురమాయించలేదని జపాను చెప్పుకున్నాడు. సరదా కోసం, ఆకతాయితనంగా ఒక మనిషి చావుకి కారణమై ఉండొచ్చన్న ఊహను జపాను ఒప్పుకోలేదు.

జపాను మానసిక పరిస్థితిలో ఎలాంటి లోపమూ లేదని వైద్యనిపుణులు పరీక్షలు జరిపి, చెప్పారు.

చాలా చాలా అనుమానాలు వ్యక్తం చేశారు. సరైన సమాధానం ఒక్కటీ దొరకలేదు. కోర్టు ఎడ్జర్నమెంటుతో నెల రోజులు గడిచిపోయాయి.

"చూడు, జపానూ! మనం అన్నం తింటాం ఎందుకు? ఆకలి తీర్చుకోవడం కోసం, బడికి వెళతాం ఎందుకు? చదువుకోసం. సినిమా చూస్తాం ఎందుకు? సరదా కోసం. సూరమ్మ వ్యాపారం చేస్తుంది ఎందుకు? డబ్బు కోసం. ఇలాగే మనం ఏ పని చేసినా, ఒక కారణం ఉంటుంది. మరి – అతన్ని నువ్వు చంపినందుకు ఏదో కారణం ఉండాలి కదా? నువ్వు భయపడకు. నిజం చెప్పు. నీకు శిక్ష వేయను" – జడ్జిగారు లాలనగా జపాన్ని అడిగేరు.

చివరి దశలో, "నిజం చెప్తాను. సిచ్చ లేకుండా నన్నుబయటికి పంపీకండి. నన్ను జైల్లోనే ఎట్టండి... జైల్లోనే ఉండనిస్తారా?" జపాను సందేహంగా అడిగాడు.

ఆ మాటల్లో ఆంతర్యం అర్థం కాలేదు. అయినా జడ్జీగారు, "అలాగే" అన్నారు.

నిజం బయటపడింది.

★★★

నెల రోజుల నుంచి మస్తూ తాతను కాన్వెంటు దగ్గర కూర్చోబెడుతున్నాడు జపాను. ఆ దారిన ప్రతిరోజూ జపాను వయస్సున్నవాళ్ళు, అంతకన్నా పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళు, ఇంకా చిన్నవాళ్ళు కాన్వెంటుకి వెళ్తుంటారు. తియ్యగా, ముద్దుగా చిలకల్లా 'కాసర బీసర' మంటూ మాట్లాడుకుంటారు. 'డింగు డాంగు' గంటలు వినిపిస్తాయి. గూడు చేరేముందు గాలిలో రివ్వున పల్టీలు కొట్టే గువ్వల్లా పరుగులు తీస్తారు.

ఆ పిల్లల్ని చూస్తున్నప్పుడు జపానుకి చాలా చాలా ఆలోచనలు వస్తాయి. తను కూడా మంచి లాగూ చొక్కా వేసుకొని, ఓ చేత్తో పుస్తకాల సంచీ, మరో చేత్తో టిఫిను కేరీజు పట్టుకొని, బడికి వెళ్ళాలనుకుంటాడు. అంతలోనే తన చిరిగిన లాగూ, మాసిన బనీనూ చూసుకొని, సిగ్గుపడిపోతాడు. తను కూడా 'యస్నో ఆలైట్' అని గబగబా మాట్లాడాలనుకుంటాడు. కానీ, ఆ మాటలు ప్రయత్నించినా, తన నోటికి రావడం లేదు. తను కూడా హాయిగా తుళ్ళుతూ పాడుతూ తిరగాలనుకుంటాడు. అయితే ఎవరూ తనని ఒక్క అడుగు కూడా ముందుకి వెయ్యనివ్వడం లేదు. తన బతుకు మీద అసహ్యం కలుగుతుంది. తను చేసే పనుల్లో విసుగు పుడుతుంది. తనకి చదువుకోవాలని, మనిషిలా గుర్తింపబడాలనే తపన రోజు రోజుకీ ఎక్కువవుతుంది. అదొక అందమైన లోకం. అక్కడ తనకి చోటు ఉంటే ఎంత బావుణ్ణు.

సూరమ్మ దగ్గర బోలెడంత డబ్బుంది. తనని చదివించగలదు. అందుకే తనకి చదువుకోవాలని ఉందని మామ్మకి చెప్పాడు జపాను.

"సచ్చినోడా! సదువుకుంటావా? నీయమ్మ గడించింది లేదురా. నీ బాబిచ్చింది లేదురా, నీయమ్మ బేగి సచ్చి, నన్ను గుల్ల చేసింది. అది సాలక, నువ్వు సదివి నన్ను మరీ గుల్ల సెయ్యాలనుకుంతున్నావా? అదేటి కుదర్దు పోరా... పో" సూరమ్మ కసిరింది. జపాన్ని చెడామడా తిట్టింది.

పంకజం దగ్గర డబ్బు లేకపోయినా మంచి మనిషని సలహా యిమ్మని అడిగాడు.

"వద్దు, జపానూ! చదువుకుంటే నువ్వు మీ అమ్మను, ఈ బతుకును చీదరించుకుంటావు. నీ మనసు పాడవుతుంది. ఆ చదువులు మనకి వద్దు. నువ్వు చదవొద్దురా..."

ఆ మాటలు పూర్తిగా అర్థం కాలేదు. 'చదవొద్దురా' అన్న ఒక్క ముక్క తప్ప.

అసిరయ్యతో చెప్పినప్పుడు, గొల్లున నవ్వేడు. "సదువులో ఏటుందిరా? కంకరపీసు... ఇదిగో ఇందులో ఉందిరా సారం" అని చెప్పి తను తాగుతున్న సారా కొంచెం జపాను నోట్లో బలవంతంగా పోశాడు.

తన కడుపు కొట్టొద్దని మస్తూ తాత లబోదిబో మన్నాడు. ఇంకా చాలామంది వద్దని నిరుత్సాహపరిచారు.

ఒక్క పోలారావు మాత్రం జపానుకి చాలా సలహాలు యిచ్చాడు. రోజుకో సినిమా చూడమన్నాడు. సినిమాల్లో ఎన్నో నేర్చుకోవచ్చునన్నాడు. బిడి కావాలంటే జైలు కెళ్ళమన్నాడు.

చదువు గురించి ఆలోచిస్తున్నప్పుడు జపానుకి ఆకలీ ఏడుపూ గుర్తుకురావు. బతికినంతకాలమూ అలాగే ఆలోచిస్తూ ఉండిపోవాలనిపిస్తుంది.

ఆ రోజు –

జపాను ఊతకర్రకి ఒక చివర తీసుకొని మౌనంగా ముందుకి నడుస్తున్నాడు. మస్తూ తాత కర్రకి రెండో చివర పట్టుకొని, జపాను వెనుక అడుగులు వేస్తున్నారు.

లేత కిరణాల వెలుగులు నేల మీద పరచుకుంటున్నాయి.

"ఒరే, జెపానూ! సోటు మారింది గనక సిల్లరెక్కువ దొరికింది. అందుకే నీకు సెప్తాను వోరాని కోసుట్టు సోటు మార్చరా అని. నువ్వినిపించుకోవు గందా?

"జెపానూ రేతిరి నువ్వేటి తిన్నావురా? సూరమ్మ కోడి కోసిందట. కోడి కోర నీకెట్టిందా? ఒరే! జపానూ తెల్లారగట్ల మీ అమ్మ కలలో అగుపించిందిరా. మా జపాను దొరెలాగున్నాడు తాత అని అడిగిందిరా!"

"జపానూ! నీకేటయిందిరా. ఈ పొద్దు బెల్లం కొట్టిన రాయిలా పలకవేట్రా?"

తాత ఎన్నిసార్లు ఎలా మాట్లాడినా జపాను నోరు విప్పలేదు. మస్తూ తాత చోటు మారింది. చోటు చేరుకోగానే జపాను గుడ్డపరిచి, మస్తూ తాతను కూర్చోబెట్టాడు. జపాను పక్కనే ఫుట్పాత్ మీద చతికిలబడ్డాడు. "బాబూ కళ్ళు లేనోడు దరమం సేయండి" అని తాత అడుక్కోవటానికి సాయం చేసేవాడు. కానీ ఈ రోజు ఏమీ పట్టించుకోబుద్ధి కావడం లేదు.

ఎన్నో దృశ్యాలు జపాను కళ్ళముందు కదులుతున్నాయి. డింగు డాంగు గంటలు, కాన్వెంటు పిల్లల ముద్దుమాటలు వినిపిస్తున్నాయి. ఆ పిల్లల గురించి, ఆ చదువుల గురించి, ఆ జీవితాల గురించి తన మనసు ఎదిగినంత వరకు ఆలోచిస్తున్నాడు.

మధ్యాహ్నం మస్తూ తాత యిచ్చిన రొట్టె ముక్కా టీ నీళ్ళూ జపాను తీసుకోలేదు.

ఎండ చల్లబడింది. రోడ్డు మీద జనం రద్దీ పెరుగుతోంది. కాసేపట్లో ఆ చోటు ఖాళీ చేసి, తాతను తీసుకెళ్ళాలి. జపానులో ఆలోచనలు తీవ్రరూపం దాల్చాయి. తను చదువుకోవాలి. పోలారావు మావ చెప్పినట్లు బిడి కావాలంటే, జైలుకి వెళ్ళాలి. ఎలా? ఎలా? చిల్లర దొంగతనాలు, చిన్న అల్లర్లు చేస్తే ఎంతోకాలం జైల్లో ఉండనివ్వరు.

క్షణంలో జపాన్ని ఏదో ఆవేశం లాంటిది ఆవహించింది.

అంతే! జపాను పరుగు పరుగున వెళ్ళి నడిరోడ్డుమీద హుందాగా నడిచి వెళ్ళిపోతున్న ఓ వ్యక్తి, తనకి ఎలాంటి

సంబంధం లేని మనిషిని, కత్తితో సర్రున పొడిచాడు.

★★★

'సిన్న పిల్లలు హత్యలు చేస్తే ఆల్ని జైల్లో పెట్టి, బాగా సదువు చెప్పిస్తారని మా పోలారావు మావ చెప్పాడు. ఆ మద్దిల ఒక సినిమాలో కూడా సూపించారు... నాకు సదువు కోవాలనుంది. సదువుకొని, పెద్ద బావుల్లాగా తిరగాలనుంది. అందుకే నేనీ పనిచేశాను. నన్ను జైల్లో ఎట్టండి, నన్ను బడి కంపి, సదుకోనియ్యండి. మీ కాళ్లట్టుకుంటాను. నన్ను బడికెళ్ళనియ్యండి."

జపాను మాటలకి అందరూ అదిరిపడ్డారు. కోర్టులో నిశ్శబ్దం చోటు చేసుకుంది. జడ్జిగారి తలలో పెద్ద క్వెశ్చన్ మార్కు నిలిచింది.

ఈ దేశంలో జపాను లాంటి అనాధ బాలురెందరో ఉన్నారు. అందరికీ చదువుకోవాలనే ఆలోచన ఉండదు. అందరికీ చదువుకొనే అవకాశమూ ఉండదు. ఒకవేళ జపాను లాంటి ఏ ఒక్కరిలోనైనా అలాంటి ఆశాకిరణం పుడితే, వాళ్ళకి చదువుకొనే అవకాశం ఎవరందివ్వాలి?

ఈ వ్యవస్థ తయారుచేసిన ఏ చట్టంతో న్యాయాన్యాయాలు విచారించి, ముద్దాయిని శిక్షించాలి? ఎలాంటి తీర్పు యివ్వాలి?

జడ్జిగారి ఆలోచనల్ని బ్రేక్ చేస్తూ, గోడ మీద గడియారం అయిదు గంటలు వినిపించింది.

ముళ్ళపూడి వెంకటరమణ



**కథామార్గదర్శి కథ**

***పాతిక సంవత్సరాల గాలివాన వెలిసింది.***
***గోపన్న నీరసంగా మేను వాల్చాడు. తాను పని ముగించాడా?***
***కృష్ణయ్యకి శ్రుతి శుద్ధమైన వేణువును పంపాడా? అయినా శ్రుతి శుద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకుందా? సరిచేసే శక్తి అయనకి లేదని తను అనుకొన్నాడా? గోపన్నకి నవ్వు వచ్చింది. ఎంత పొరబాటు... ఆయన నవ్వుకుంటాడు. వెర్రి గోపన్న అనుకుంటాడు.***

సాయంసంధ్య వాలుతోంది. నెమ్మదిగా చీకటి ముసురుకుంటోంది. ఆ సమయంలో ఓ చెట్టుకింద గోపన్న ఎర్రటి మంటలో సన్నని ఊచని కాలుస్తున్నాడు. అతనికి ఒక పక్కన లెక్కలేనన్ని వేణువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంకా మూడు రాత్రులు గడిస్తే అష్టమి —— అంటే కృష్ణయ్య పుట్టినరోజు పండగ వచ్చేస్తుంది. సరిగ్గా పాతిక పండగల నాడు గోపన్న ప్రారంభించిన ఈ వేణు నిర్మాణం ఇప్పటికీ తెమలలేదు. మరునాటికైనా సాధించి తన వేణువును ఆయనకి సమర్పించాలి. రేపటికి గానీ ఇవ్వలేకపోయాడో ఇక ఈ జన్మకివ్వలేడు... వేళయిపోయింది.

ఇంతలో గోపన్న కొడుకు చిన్న గోపన్న అక్కడికి వచ్చి, “నాయనా! బువ్వదిను.. రా..” అని పిలిచేడు. గోపన్నకీ మాట వినపడలేదు. అతని హృదయం బృందావనంలో ఉంది. గోపికల అందెల రవళి వినిపిస్తోంది. వెదురు పొదలు సన్నగా ఈల వేస్తున్నాయి. కృష్ణయ్య వచ్చాడు. క్షణాలలో మోహన మురళీ గానం వినవస్తోంది. గోపన్న చెట్ల చాటున కూర్చుని ఆ మురళీ గానం ఎన్ని యుగాలుగా వింటున్నాడో అతనికే తెలియదు. ఆ వేణునాదాన్ని తన హృదయంనిండా నింపేసుకున్నాడు. ఎలా అయినా ఆ నాదాన్ని తన వేణువులో నింపాలని పరుగుపరుగున తన కుటీరానికి వచ్చాడు. కొత్త వెదురునొక దానిని కోసి, స్వరద్వారాలు వేసి, మనసులో దాచుకున్న స్వరాల్ని దానిలో పలికించ బోయాడు. అదే స్వరం కనక ఈ వేణువులో పలికితే దాన్ని కృష్ణయ్యకి కానుకగా ఇవ్వాలి! ఇదీ అతని కోరిక. కానీ అది పలకలేదు. ఎలా అయినా పలికించాలని అతను ఎన్ని వేల వేణువులో చేశాడు.

తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలన్నీ వేణువుకి శ్రుతి చేయడానికే ఉపయోగించాడు. యమున ఒడ్డున పొదలమాటున దాక్కుని కృష్ణయ్య మురళీ గానం విన్నప్పుడు ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపేవాడు. అక్కడ పొదుపు చేసిన ఆ ఊపిరిని కొత్త వేణువు పూరించడానికి ఉపయోగించేవాడు. తీరా పూరించేసరికి అది శ్రుతి శుద్ధంగా వినబడేదికాదు. పైగా జీరబోయేది. లోపలేమన్నా ఈనెలు లేచాయేమో అని గోపన్న ఎంతో శ్రద్ధగా లోపలంతా నునుపు చేసేవాడు. ఏం చేసినా జీర అలాగే ఉండేది.

గోపన్న పూర్వం ఎన్నో వేణువులు తయారుచేసుకుని తృప్తిగా వాయించేవాడు. బాగానే ఉందనుకున్నాడు. అయితే అతను

ఊహించిన సంగీతం దానిలో పలకడంలేదనే సత్యం అతనికి క్రమక్రమంగా తెలియవచ్చింది. అనంతమైన జలపాతం లాంటి సంగీతాన్ని వెదురుగొట్టంలో ఇమడ్చడం తెలివితక్కువ అని అర్థమైంది. సరిగ్గా ఆ స్థితిలోనే అతను కృష్ణుడి మురళి విన్నాడు. ముగ్ధుడైపోయాడు. అది తను ఊహించిన దానికన్నా గొప్పది. అనుభవంలోకి వస్తోంది! అంతే... ఆరోజునుంచి ప్రతినిత్యం కృష్ణయ్య ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్లి మురళి వినేవాడు.

అంత మోహనమైన సంగీతాన్ని కృష్ణుడు ఒక వెదురుముక్కలో ఎలా ఇమిడ్చాడా అని గోపన్న ఆలోచించాడు. ఒకసారి



అతని ఇంటికి వెళ్లి, ఆ మురళిని ఎత్తుకొచ్చేశాడు. తీరా యమున ఒడ్డుకువచ్చి, చెంగుచాటునుంచి మురళి తీసి వాయించాలనుకునేసరికి అది కనబడలేదు! "మాయదారి కృష్ణుడు.... గజదొంగ దగ్గర నేను దొంగతనమేమిటి?" అనుకున్నాడు గోపన్న.

కానీ గజదొంగ ఆ సాయంకాలం కనబడి, "గోపన్నా! నా మురళి తీసుకుపోయావు కదూ... పోని ఇంకోటి చేసిపెట్టు." అన్నాడు నవ్వుతూ. గోపన్న తెల్లబోయాడు.

ఆ మర్నాటినుంచి వేణు నిర్మాణం ఆరంభించాడు గోపన్న. అతనిలో కొత్త శక్తి, కొత్త చైతన్యం మేల్కొన్నాయి. తన చేతుల్లో రూపు దిద్దుకున్న మురళి మర్నాడు కృష్ణుడి హస్తాలను అలంకరిస్తుందని, అందులో ఆయన జీవం పోస్తాడని ఆశపడుతూ రోజంతా కష్టపడి రూపొందించాడు. ఆయన పెదిమలూ, చేతులు ఆనుకునే చోట వేణువు కఠినంగా ఉండి, నొప్పి పెట్టకుండా ఉండేందుకు ఆచోట్ల తన చేతులతో అరగదీశాడు. మురళి సిద్ధం కాగానే శ్రుతి చూశాడు. అది శ్రుతి శుద్ధంగా లేదు. పైగా జీర! రెండుమూడు వేణువులు పలికినట్టుంది. కృష్ణుడు ఊదుతాడన్న ఆనందంలో దానికి ఒళ్ళు పులకరించిందో ఏమో!

గోపన్న అది పడేసి మరోటి చేశాడు... అదీ అంతే! మర్నాడు చాలా వెదురు తెప్పించాడు. పది పన్నెండు చేశాడు. ఒక్కొక్కటీ ఊది చూడడం... నచ్చక పారేయడం... "నీకు వేణువు ఇవ్వందే నా ముఖం చూపను కృష్ణయ్యా" అనుకున్నాడు.

నాటి నుంచి ఇదే పని! సాయంకాలం బృందావనం వేపు వెళ్ళి వేణువు వినడం, ఉదయాస్తమానం కొత్త వేణువులు చెయ్యడం! ఊళ్ళో అందరూ మొదట్లో మెచ్చుకున్నా, తర్వాత పిచ్చివాడిగా జమకట్టి నవ్వుకున్నారు. గోపన్న పనికి రావని పడేసిన వందలాది వేణువులను కొత్తలో గొల్లపిల్లలు తీసుకుపోయేవారు. కానీ అతనికి భయం వేసింది– వాటిలో ఏదైనా కృష్ణయ్య దగ్గరకి చేరిపోతుందేమోనని. అందుకని చేసిన వేణువులన్నీ పాకలో అటకమీద పడేసేవాడు.

పాతికేళ్ళు గడిచిపోయాయి. కృష్ణయ్య పెద్దవాడయ్యాడు. బృందావనికి రావడం లేదు. పట్నవాసం మనిషైపోయాడు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. అయినా ప్రతి నవమినాడు గోపన్న కొత్త ఉత్సాహంతో కొత్త వేణువు ఆరంభిస్తూ "వచ్చే

పుట్టినరోజుకైనా పంపాలి!” అనుకునేవాడు. ఏదో శాపం ఉన్నట్టు వేణువు మాత్రం కుదిరేది కాదు. ఏమిటో ఆ జీర?

“నాయనా బువ్వదినవా?” అన్నాడు చిన్న గోపన్న. తండ్రి వాడికేసి చూశాడు. జాలి వేసింది. తల్లిలేని బిడ్డ. తండ్రి ఉండీ లేని బిడ్డ. ఆ వయసుకి వాడే ఇంత గంజి కాచి పెడుతున్నాడు.

“బువ్వ తింటాలే గాని, రేపొచ్చే కిష్టయ్య పుట్టినరోజుకి నువ్వు నందయ్య గారి లోగిలికెళ్ళి ఎవరూ చూడకుండా ఇది కిష్టయ్యకిచ్చి, మానాయనిచ్చి రమ్మన్నాడని చెప్పి రావాల” అన్నాడు గోపన్న.

“బువ్వదిను మరి” అన్నాడు చిన్న గోపన్న. గోపన్నకి ఎందుకో వాణ్ణి చూస్తే బాలకిష్టయ్య గుర్తుకొచ్చాడు. గబుక్కున వాడి బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు.

మర్నాడు ఉదయమే గోపన్న కొడుక్కి తలంటి నీళ్ళు పోశాడు. సాంబ్రాణి ధూపం వేసి, జుట్టు ముడేసి పూలు తురిమేడు. పట్టుకండువా తీసి పంచె కట్టేడు. కస్తూరి తిలకం దిద్దేడు. కాటుక దిద్ది, బుగ్గన చుక్క పెట్టాడు. విసినికఱ్ఱ లోంచి ఒక నెమలికన్ను తీసి కొప్పులో పెట్టాడు. ముస్తాబు ముగించిన గోపన్న తృప్తిగా ఓసారి కొడుకుని చూసుకున్నాడు. క్షణంలో ఆశ్చర్యపోయాడు. ఇదేమిటి బాలకృష్ణుడు--- గోపాలకృష్ణుడు--- ఇక్కడికి ఎందుకొచ్చాడు? తాను ఏనాడో ఎత్తుకొచ్చిన వేణువు కోసమా? సందేహం లేదు--- కృష్ణుడే! అప్రయత్నంగా చేతులు జోడించి దండం పెట్టాడు--- కళ్ళవెంట నీళ్లతో!

“ఏందే అయ్యా?” అంటూ బావురు మన్నాడు కొడుకు... తండ్రి దండం పెట్టేసరికి!

గోపన్న ఉలిక్కిపడి, సద్దుకున్నాడు. “దేవుడికి దండం పెట్టానురా” అని, “ఏదీ... మురళేదీ?” అంటూ అటూ ఇటూ చూశాడు.

“అటక మీదెట్టేను. రాతిరి ఎలకలొస్తే---” అన్నాడు చిన్నగోపన్న భయపడుతూ.

“ఆ! ఎంతపన్జేసేవురా బాబూ--- అసలు ఎలకలుండేదే అక్కడే!” అని, వాడిని కేకలెయ్యడానికి మనస్కరించక అటకెక్కేడు. అక్కడ తను పనికి రావని పడేసిన వేణువులు గుట్టగా ఉన్నాయి. అందులో ఏది కొత్తది? ఏది మంచిది? గోపన్న ఆ వేణువులన్నీ కిందకి దించాడు.

ఒక్కొక్కటీ తీసి ఊది చూస్తున్నాడు. “ఇది కాదు--- ఇదీ కాదు--- ఇదీ కాదు...” అంటూ పక్కన పడేస్తున్నాడు. ఇటువేపు గుట్ట తరుగుతోంది. అటువేపు పెరుగుతోంది. కాలం కరుగుతోంది. మధ్యాహ్నం అయింది. చిన్నగోపన్న, తండ్రిని పలకరించే ధైర్యం లేక అలాగే కూచున్నాడు. చెమటకి వాడి కాటుక చెరిగి, కస్తూరి బొట్టు కరిగిపోయింది. తిండిలేక నీరసంకూడా వస్తోంది. గోపన్న ఇదేమీ గమనించే స్థితిలో లేడు.

క్రమంగా పొద్దు వాలింది. చిన్నగోపన్న దీపం వెలిగించాడు. “నాయనా, చీకటి పడిపోతోంది. పుట్టినరోజు పండుగయిపోతుంది.” అన్నాడు జంకుతూ. గోపన్న తలూపాడు. ఇంక రెండే రెండు వేణువులు మిగిలాయి. ఒకటి చూశాడు. అదీకాదు. ఇంక ఒకటే మిగిలింది. చివరిది! దాన్ని పరీక్షించడానికి గోపన్నకి ధైర్యం చాలలేదు. ఇంక వ్యవధి లేదు.

“ఇదే!” అన్నాడు ధీమాగా.

“ఊదవా?” అన్నాడు కొడుకు.

“ఒద్దు--- లగెత్తు---కిష్టయ్య చేతికియ్యి. ఆయనే చెబుతాడు!” అన్నాడు గోపన్న.

కుర్రాడు ఇంక ఆగలేదు. చీకట్లోకి పరుగెట్టేడు.

పాతిక సంవత్సరాల గాలివాన వెలిసింది. గోపన్న నీరసంగా మేను వాల్చాడు. తాను పని ముగించాడా? కృష్ణయ్యకి శ్రుతి శుద్ధమైన వేణువును పంపాడా? అయినా శ్రుతి శుద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకుందా? సరిచేసే శక్తి అయనకి లేదని తను అనుకొన్నాడా? గోపన్నకి నవ్వు వచ్చింది. ఎంత పొరబాటు... ఆయన నవ్వుకుంటాడు. వెఱ్ఱి గోపన్న అనుకుంటాడు. శ్రుతులన్నీ దాచుకున్న బొజ్జలోంచి, ఓంకారానికి మూలస్థానమైన నాభిలోంచి, మంగళమైన గళంలోంచి, వెన్నా పాలూ ఆరగించిన మధురాధరాలలోంచి జీవం వచ్చి తన వేణువులో ప్రవేశిస్తుంది!

ఇంతలో తన పక్కనున్న వేణువులోంచి చక్కటి స్వరం నెమ్మదిగా వినపడుతోంది. ఇదేమిటి... తను పనికిరాదనుకున్న మురళి... ఇంకో క్షణానికి ఆ పక్క మురళి... మరుక్షణం ఇటుపక్క మురళి... అలాకుటీరంలో అన్ని వేణువులూ అలనాటి బృందావన కృష్ణుడి మోహన రాగం భువన మోహనంగా గానం చేయసాగాయి. భగవంతుడికి ఉపయోగపడని వేణువే లేదు. గోపన్న విభ్రాంతుడైపోయాడు. ఆనందంగా కళ్ళు మూసుకుని మేను వాల్చాడు.

కాసేపటికి గుమ్మంలో అడుగుల చప్పుడు. కళ్ళు తెరిచాడు గోపన్న. ఎదురుగా బాలకృష్ణుడు!

"నువ్వే వచ్చావా కిష్టయ్యా..." అంటూ లేచి కూచున్నాడు గోపన్న.

"అయ్యా... అయ్యా... కిష్టయ్య నీ మురళి వాయించాడే. నాకు బువ్వ పెట్టాడు. ఇక్కడ ముద్దెట్టుకున్నాడు. కానీ అయ్యా... కిష్టయ్య నీ మురళి ఎంత వాయించినా ఏమీ వినపడ్లేదే... అసలు పాట రాలేదే!" అన్నాడు కొడుకు. గోపన్నతల పక్కకి తిప్పి గదినిండా పడివున్న వేణువులను చూశాడు. ఇంతసేపూ గానంచేసి అలసిపోయిన వేణువుల వంక ఆప్యాయంగా, సగర్వంగా చూసి, ఒకటి తీసి ముద్దుపెట్టుకున్నాడు.



అనగనగా ఒక ఊరిలో .. లేదా ఓ రాజ్యంలో .. అని మొదలయ్యే కథలకు
కాలం చెల్లిందేమో గాని, కథ మాత్రం సజీవంగానే ఉంది.

కాలంతో పాటు కథ మార్పులు చెందుతూనే ఉంది..
ఆధునికతను సంతరించుకుంటూనే ఉంది.

కథ కంచికి మనమింటికి .. ఇది ఒకప్పటి మాట.
కంచికెళ్ళని కథలు, మంచిని పెంచే కథలు, మనసు నుండి తీసివేయలేని కథలు..
అబ్బో ఎన్ని కథలు!

వందేళ్ళ నుంచి కథను బ్రతికిస్తూనే ఉన్నారు కథకులు ..
ఆదరిస్తూనే ఉన్నారు పాఠకులు.

వందనాలు, వందనాలు .. కథకులకు వేయి వందనాలు.
వందనాలు, వందనాలు .. పాఠకులకు వేనవేల వందనాలు.

కథామంజరి ఆశ, శ్వాస .. కథలు, కథకులు, పాఠకులు, శ్రోతలే!